సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 360
గురువారం 21-3-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



అదరగొట్టేందుకు...
తొలిసారి ఐపీఎల్ బరిలో యువ తారలు. అందరి దృష్టి రచిన్ రవీంద్రపైనే. - 12లో



నృత్య తపస్వి
మద్దాలి ఉషా గాయత్రి.. ఆమె నృత్య ప్రయాణం ఒక తపస్సు - 11లో



ఉచిత వాగ్దానాలపై సుప్రీంలో పిల్
రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలను తప్పుబడుతూ దాఖలైన పిల్ విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది.
- వివరాలు 6లో



కృత్రిమ మేధలో లీడర్ ఇండియా
ప్రపంచదేశాల సమస్యలకు స్వదేశీ పరిష్కారాలు కనిపెట్టాలని భారత స్టార్టప్ కంపెనీల ప్రతినిధులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.
- వివరాలు 6లో



ఫిన్లాండ్.. హ్యాపీనెస్‌కు అడ్రస్
సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్లాండ్ వరుసగా ఏడోసారి తొలి స్థానం దక్కించుకుంది. భారత్ 126వ స్థానంలో నిలిచింది.
- వివరాలు 6లో



కాంగ్రెస్‌లో చేరిన పప్పూ యాదవ్
జన్ అధికార్ పార్టీ అధినేత పప్పూ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

'టీజీ' స్మార్ట్ కార్డులేవీ?



ఈనెల 15 నుంచి రిజిస్టర్ అయ్యే వాహనాలకు టీజీ సిరీస్ కేటాయిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. రోజుకు దాదాపు 10 వేల వరకు కొత్త వాహనాలు రోడ్డెక్కుతాయి. అయితే, ఇప్పటివరకు టీజీ సిరీస్ ఆర్సీ, కొత్త లైసెన్సులకు స్మార్ట్‌కార్డులు జారీ కాలేదు.
- వివరాలు 5లో

ప్రణీత్‌రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వు



సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తన విచారణ జరగడం లేదంటూ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగించిన హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. గురువారం తీర్పు వెల్లడించే అవకాశం ఉంది.
- వివరాలు 5లో

అభిషేక్ బోయినపల్లికి మధ్యంతర బెయిల్




ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో నిందితుడైన హైదరాబాద్ వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లికి సుప్రీంకోర్టు 5 వారాలపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.
- వివరాలు 10లో

టార్గెట్ కాంగ్రెస్!

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రత్యేక వ్యూహం
రాష్ట్రంలో కాంగ్రెస్‌కు సీట్లు తగ్గేలా..
బీజేపీకి మెజార్టీ సీట్లు దక్కేలా కార్యాచరణ

- జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను నిలువరించే లక్ష్యంలో భాగంగానే..
- ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నుంచి రాష్ట్ర కీలక నేతల దాకా హస్తం పార్టీపైనే విమర్శలు
- వచ్చే ఐదేళ్లలో కాంగ్రెస్ రాష్ట్రాన్ని నాశనం చేస్తుందని ఆరోపణలు
- ఇచ్చిన హామీల అమలుపై మభ్య పెడుతోందంటూ బీజేపీ ప్రచారం
- 'ప్రశ్నిస్తోంది తెలంగాణ' పేరిట వరుస కార్యక్రమాలు
- వివిధ వర్గాల సమస్యలను ఎత్తిచూపుతూ నిరసనలు
- అభివృద్ధి జరగాలంటే బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలని విజ్ఞప్తులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 'టార్గెట్ కాంగ్రెస్' వ్యూహంతో బీజేపీ ముందుకెళుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలిచిన, ఇటీవలి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కంటే కూడా కాంగ్రెస్‌పైనే ప్రధానంగా ఫోకస్ చేసింది. ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాల నుంచి రాష్ట్ర ముఖ్యనేతలు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ తదితరుల దాకా అంతా హస్తం పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ రెండు పార్టీలకు లోక్‌సభ ఎన్నికలు కీలకంగా మారిన నేపథ్యంలో.. రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌కు సీట్లు తగ్గేలా, అదే సమయంలో తాము మెజార్టీ స్థానాల్లో గెలిచేలా కార్యాచరణ అమలు చేస్తున్నారు. క్రమంగా విమర్శల దాడిని పెంచుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడున్నర నెలలు అవుతోందని.. ఆ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రైతు భరోసా, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు ఏమైందంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు.

'ప్రశ్నిస్తున్న తెలంగాణ'.. పేరిట క్యాంపెయిన్!

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌ను నిలదీసేందుకు, వ్యతిరేక ప్రచారం చేసేందుకు.. ఆరు గ్యారంటీలు, వాటి అమలుకు

మిగతా 2వ పేజీలో ▶

డబుల్ డిజిట్ ఇవ్వాలంటూ

రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు 15 చోట్ల అభ్యర్థులను బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. రాష్ట్రంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేస్తూనే.. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కారు హామీల అమల్లో విఫలమైందంటూ ఎండగడుతున్నారు. బీఆర్ఎస్ ఎంపీ సీట్లు గెలిచి జాతీయ స్థాయిలో చేసేదేమీ లేదని.. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ అవినీతి, అక్రమాల పాలన వస్తుందని ఆరోపిస్తున్నారు. బీజేపీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో గత ఎన్నికలప్పుడు బీజేపీ ఓట్ల శాతాన్ని ప్రజలు రెండింతలు చేశారని.. ఈసారి డబుల్ డిజిట్‌లో ఎంపీ సీట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి కనీసం పది ఎంపీ సీట్లను కచ్చితంగా గెలుచుకోవాలని రాష్ట్ర పార్టీకి బీజేపీ జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేసింది. అదనంగా మరో రెండు స్థానాల్లో గెలిచేలా కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించింది.



తెలంగాణ రాష్ట్ర మూడో గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాజ్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, వివిధ పార్టీల నేతలు, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు

అందరి వాణి వింటా..

- తెలంగాణ కొత్త గవర్నర్ సీపీ రాధాకృష్ణన్
- రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే.. ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యమివ్వాలని రాజకీయ పార్టీలకు గవర్నర్ పిలుపు
- యాదాద్రి, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాల సందర్శన

2లో

తొలి విడత నోటిఫికేషన్ జారీ

21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరగనున్న ఎన్నికలు
102 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఏప్రిల్ 19న పోలింగ్
అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు సైతం నోటిఫికేషన్ జారీ

సాక్షి, న్యూఢిల్లీ: తొలి విడత సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న తొలి విడత ఎన్నికలు జరుగనున్నాయి. వీటితోపాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలు, తమిళనాడులోని విలవన్‌కోడ్, త్రిపురలోని రామ్‌నగర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను సైతం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 28న నామినేషన్లను పరిశీలిస్తారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. బిహార్‌లో మాత్రం స్థానిక వేడుక నేపథ్యంలో నామినేషన్లకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు విధించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు విడతల్లో జరుగనున్న సంగతి తెలిసిందే. తొలి విడతలో అత్యధికంగా తమిళనాడులో 39 స్థానాలు, రాజస్తాన్‌లో 12, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, అసోం, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఐదు స్థానాల చొప్పున, బిహార్‌లో 4, పశ్చిమ బెంగాల్‌లో 3, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో రెండు స్థానాల చొప్పున, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్, జమ్మూకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లో ఒక్కో స్థానానికి ఏప్రిల్ 19న పోలింగ్ జరుగనుంది.





వైఎస్సార్‌సీపీలోకి వంగవీటి నరేంద్ర

10లో

మేనిఫెస్టో.. పవిత్ర గ్రంథం
ఈసారీ జనరంజకమే

- ఏపీలో ఎన్నికల మేనిఫెస్టోపై వైఎస్సార్‌సీపీ ముమ్మర కసరత్తు..
- 27న బస్సు యాత్ర ప్రారంభమయ్యేలోగా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల
- ఎన్నికల ప్రణాళికపై సీఎం జగన్ కసరత్తు..
- తుది దశకు చేరుకుందంటున్న పార్టీ వర్గాలు
- అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలను నెరవేర్చి మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం
- 58 నెలల్లో 99 శాతం హామీలు అమలు
- చెప్పిన వాటితోపాటు ఇవ్వని హామీలను అమలు చేసిన సీఎం జగన్

- వివరాలు 10లో

తప్పుడు పత్రాలతో 21 లక్షల సిమ్‌లు
- వివరాలు 6లో

ఇదండీ జగత్



కొత్త వాళ్లు కాద్సార్! గతంలో మన పార్టీ నుండి జంపయిన వాళ్లే మళ్లీ తిరిగి చేరుతున్నారు

- ఆశలన్నీ నేలపాలు..



మంచిర్యాల జిల్లాలో బుధవారం సాయంత్రం గాలివాన సృష్టించిన బీభత్సానికి తపాలపూర్ గ్రామంలో మొక్కజొన్న పంట ఇలా నేలవాలింది - జన్నారం

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం: మంత్రి తుమ్మల

రైతులంటే ఎందుకింత చిన్నచూపు?: కేటీఆర్

పంట నష్టపరిహారం ఇవ్వాలి: నిరంజన్ రెడ్డి డిమాండ్

ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలి: బండి డిమాండ్

5లో


5,348 పోస్టుల భర్తీకి అనుమతి

వైద్య, ఆరోగ్యశాఖలో కొలువులకు ఓకే..

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో 5,348 ఉద్యోగ ఖాళీలు భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ అనుమతించింది. ఈ మేరకు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్, నోటిఫికేషన్ త్వరలోనే విడుదల చేస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నా, ఎన్నికల తర్వాతే నోటిఫికేషన్ ఉండొచ్చని వైద్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు నోటిఫికేషన్ విడుదల చేయాలంటే ఈసీ అనుమతి తప్పనిసరి కావడంతో దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అధికారులు

మిగతా 3వ పేజీలో ▶

- ఆర్థికశాఖ ఉత్తర్వులు
- అత్యధికంగా డీఎంఈ పరిధిలో 3,235
- డాక్టర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నర్సులు తదితర పోస్టులు ఖాళీ
- ఎన్నికల తర్వాతే నోటిఫికేషన్!



హైదరాబాద్ వాసి అమెరికాలో కిడ్నాప్

లక్ష ఇవ్వకపోతే కిడ్నీ అమ్మేస్తామని బెదిరింపు



మల్లాపూర్: ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన హైదరాబాద్ నాచారానికి చెందిన మహ్మద్ సలీం కుమారుడు అబ్దుల్ మహ్మద్ అర్ఫద్ (25)ను అక్కడ దుండగులు కిడ్నాప్ చేశారు. 8 నెలల క్రితం క్లీవ్‌లాండ్ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ కోసం అబ్దుల్ అమెరికాకు వెళ్లాడు. ఈ నెల 8న చివరిసారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాడు. మూడు రోజుల క్రితం డ్రగ్ మాఫియాకు చెందిన దుండగులు సలీంకు ఫోన్ చేసి.. మీ అబ్బాయిని కిడ్నాప్ చేశామని, 1200 డాలర్లు (సుమారు లక్ష రూపాయలు) ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి నుంచి వరుసగా బెదిరింపు మెసేజ్‌లు పెడుతున్నారు. డబ్బు ఇవ్వకపోతే అబ్దుల్ కిడ్నీని విక్రయిస్తామని బెదిరించినట్లు తెలిసింది. భయాందోళనకు గురైన సలీం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆశ్రయించారు. మరిన్ని వివరాల కోసం 'సాక్షి' ప్రయత్నించగా వెల్లడించేందుకు సలీం నిరాకరించారు. కాగా, అబ్దుల్ బంధువులు క్లీవ్‌లాండ్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, అక్కడి పోలీసులు లుకౌట్ నోటీసు జారీచేశారు.

అన్నారం డ్యామేజీలకు మేము బాధ్యులం కాదు

- బ్యారేజీకి తీవ్రమైన ముప్పు పొంచి ఉంది
- నీటిపారుదల శాఖకు నిర్మాణ సంస్థ 'ఆఫ్కాన్స్' లేఖ.. డిజైన్‌లో లోపమున్నట్టు మోడల్ స్టడీలో తేలింది..
- గేట్ల నుంచి వచ్చే భీకర వరదతో దిగువన లోతైన గుంతలు
- గుంతలు విస్తరించి సెకెంట్ పైల్స్, ర్యాఫ్ట్ మధ్య అగాధం!
- అందుకే బ్యారేజీలో బుంగలు పడి తరచూ లీకేజీలు
- వర్షాకాలం ప్రారంభానికి ముందే అత్యవసర రక్షణ చర్యలు తీసుకోవాలి



మోడల్ సర్వేలో పాల్గొన్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బ్యారేజీకి డిజైన్ లోపాలతో తీవ్ర ముప్పు పొంచి ఉందని నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్–విజేత–పీఈఎస్ జాయింట్ వెంచర్ తెలిపింది. ఎలాంటి డ్యామేజీలకైనా తాము బాధ్యులం కాదని స్పష్టం చేసింది. బ్యారేజీలో లోపాలు తెలుసుకోవడానికి పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్

మిగతా 10వ పేజీలో ▶

నాటి సీఎం స్థాయిలోనే నిర్ణయాలు!

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపై చంద్రశేఖర్ అయ్యర్ కమిటీకి నీటి పారుదల శాఖ నివేదన

- 2016లో నాటి సీఎం కేసీఆర్ స్థాయిలో నిర్ణయాలు జరిగాయి
- ఆ తర్వాతే డీపీఆర్‌లను రూపొందించాం
- ఆమోదం రాకముందే పనులు ప్రారంభించినట్టు వెల్లడి
- తొందరపాటుతో రెండేళ్లలోనే బ్యారేజీలు ఎందుకు నిర్మించారన్న కమిటీ
- అంత వేగంతో చేసిన పనుల్లో నాణ్యతను ఎలా పర్యవేక్షించారు?
- షీట్‌పైల్స్ స్థానంలో సెకెంట్ పైల్స్‌ను ఎందుకు మార్చారు.. అనుమతి ఉందా?
- ఇంజనీర్లకు ప్రశ్నల వర్షం
- సమావేశానికి హాజరైన మాజీ ఈఎన్సీలు మురళీధర్, వెంకటేశ్వర్లు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై 2016లో నిర్వహించిన సమావేశాల్లో నాటి ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీకి రాష్ట్ర నీటిపారుదల శాఖ నివేదించింది. ఆ నిర్ణయాలకు అనుగుణంగానే సవివర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను రూపొందించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం కోసం పంపించామని తెలిపింది. అయితే ఆమోదం లభించకముందే నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల డిజైన్, నిర్మాణాలపై అధ్యయనం కోసం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇటీవల చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రెండో విడత రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆ కమిటీ.. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జలసౌధలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, మాజీ అధికారులతో సుదీర్ఘంగా సమావేశమైంది. నీటి పారుదల శాఖ ఈఎన్సీ(జనరల్) అనిల్ కుమార్, ఈఎన్సీ (ఓ అండ్ ఎం) బి.నాగేందర్ రావు, మాజీ ఈఎన్సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొని

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

వద్దిరాజుకు రాజ్యసభ చైర్మన్ శుభాకాంక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఢిల్లీలో జగదీప్ ధన్‌ఖడ్‌ను రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ వద్దిరాజు సేవలపై మరింత నమ్మకం, విశ్వాసం ఉండటం వల్లే ఎమ్మెల్యేలు రాజ్యసభకు ఎన్నుకున్నారని పేర్కొన్నారు.

ఇండియా కూటమి విజయం సాధిస్తుంది

మాజీ ఎంపీ మల్లు రవి ధీమా



సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, మాజీ ఎంపీ మల్లు రవి ధీమా వ్యక్తంచేశారు. ఈ ఎన్నికల తర్వాత దేశంలో ప్రజాస్వామిక, లౌకిక ప్రభుత్వం ఏర్పాటవుతుందని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, లింగం యాదవ్‌లతో కలిసి రవి మాట్లాడారు. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు గెలిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేబినెట్ మంత్రులు, కాంగ్రెస్ నేతలు టీంగా పనిచేస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిందని, అయినా ప్రతిపక్ష పార్టీలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. పదేళ్ల నుంచి పేరుకుపోయిన ఎన్నో సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడేటప్పుడు ప్రతిపక్ష నాయకులు ఆలోచించి మాట్లాడాలని, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని సూచించారు. రవికి నాగర్‌కర్నూల్ లోక్‌సభ టికెట్ ఖరారైందన్న వార్తల నేపథ్యంలో బుధవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయనకు పార్టీ నేతలు డప్పులు, డ్యాన్సులతో ఘన స్వాగతం పలికారు.

బీఆర్‌ఎస్ నేతలకు ఉద్యోగాల్లేవు

మమ్మల్ని నిందించడమే వారికి ఇప్పుడు ఉద్యోగం: చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో సహా రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ నేతలకు ప్రస్తుతం ఉద్యోగాల్లేవని, తమను నిందించడమే వారికి ఇప్పుడు ఉద్యోగం అయిపోయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఎద్దేవా చేశారు. వర్షాలు లేక రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, భూగర్భ జలాలు లేక తాగునీటికి ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవమేనని చెప్పారు. అయితే, దానికి కాంగ్రెస్సే కారణమని బీఆర్‌ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మా పాలన గురించి విమర్శించేందుకు ఏమీ లేకనే ప్రతిపక్ష నాయకులు చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి లింగం యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తొమ్మిది జిల్లాల్లో వరి, మామిడి, ఉల్లి లాంటి పంటలకు నష్టం జరిగిందని, కామారెడ్డి జిల్లాలో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. పంట నష్టం ఎంత జరిగిందన్న దానిపై త్వరలోనే నివేదిక తెప్పించుకుని రైతాంగాన్ని ఆదుకుంటామని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై ప్రకటన చేస్తారని చెప్పారు. రాష్ట్రంలోని 92 శాతం మంది రైతాంగానికి రైతుబంధు ఇచ్చామని, మిగిలిన 8 శాతం మంది పెద్ద రైతులకు మాత్రమే ఇవ్వలేదని, దీనిపై కూడా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సమంజసం కాదని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు.

మరో మున్సిపాలిటీ 'హస్త'గతం

తిరుమలగిరిలో నెగ్గిన అవిశ్వాసం

తిరుమలగిరి (తుంగతుర్తి): కాంగ్రెస్ పార్టీ ఖాతాలో మరో మున్సిపాలిటీ చేరింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోతరాజు రజని, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహించారు. దీనికి 15 మంది కౌన్సిల్ సభ్యులకుగాను 12 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. అవిశ్వాసానికి మద్దతుగా 13 మంది చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ వేణుమాధవరావు ప్రకటించారు. ఈ సమావేశానికి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్ సంకెపల్లి జ్యోతి హాజరు కాలేదు.

అందరి వాణి వింటా

తెలంగాణ కొత్త గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

- రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే
- పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, అధికారులు



నూతన గవర్నర్‌కు భాగ్యలక్ష్మి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న అధికారులు



యాదాద్రి శ్రీస్వామి వారి పుష్పయాగం పూజలో పాల్గొన్న గవర్నర్, కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, అధికారులు, ప్రజా సంఘాలు, సామాన్య ప్రజలకు రాజ్‌భవన్ అత్యంత నిబద్ధతతో నిర్విరామ సహకారం అందిస్తుందని రాష్ట్ర నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చెప్పారు. తాను అందరి వాణిని వింటానని, ప్రతి ఆందోళనను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియను ఎల్లవేళలా సమర్థిస్తూ, గౌరవించేలా, అత్యంత శ్రద్ధతో తన విధులను నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ చేశారు. న్యాయం, సమగ్రత, నిష్పాక్షికత సూత్రాలకు కట్టుబడి దృఢ నిబద్ధతతో పనిచేస్తానన్నారు. రాష్ట్రం, ప్రజల అభ్యున్నతికి అత్యంత అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర మూడో గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం ఉదయం రాజ్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ గవర్నర్లు సీహెచ్ విద్యాసాగర్‌రావు, రామ్మోహన్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ ప్రసంగించడంతో పాటు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఓ సందేశాన్ని విడుదల చేశారు.

ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇవ్వండి

ప్రజల అవసరాలు, ఆకాంక్షలను పరిష్కరించడానికి ప్రాధాన్యతనివ్వాలని అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు, ప్రజా సంఘాలకు రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, న్యాయం, కరుణ అనే సూత్రాల ఆధారంగా మార్పు కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గొప్ప చరిత్ర, సంస్కృతి, పటిష్ట ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రమని, వ్యవసాయం, ఐటీ, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో విశేష ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. లక్షలాది మందికి లబ్ధి చేకూర్చే వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయడంలోనూ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. తెలంగాణ గవర్నర్‌గా పని చేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా కొత్త గవర్నర్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు, సీఎస్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రివర్గంతో గవర్నర్ గ్రూపు ఫోటో దిగారు. ఇంతకుముందు రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన తమిళిసై సౌందరరాజన్ రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్‌కు అదనంగా తెలంగాణ బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు

చార్మినార్: గవర్నర్ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారానంతరం బుధవారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీమణితో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

యాదాద్రి మరో వెయ్యేళ్లు నిలుస్తుంది

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం అద్భుతంగా ఉందని గవర్నర్ అన్నారు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఆలయానికి వేల సంవత్సరాల చరిత్ర ఉందని, మరో వెయ్యేళ్లు అద్భుతంగా నిలుస్తుందని చెప్పారు. గర్భాలయంలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఒళ్లు పులకరించిందని అన్నారు. అంతకుముందు గవర్నర్‌కు సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ హనుమంత్ కె.జండగే, ఇతర అధికారులు, అర్చకులు తూర్పు త్రితల రాజగోపురం ముందు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను గవర్నర్ దర్శించుకున్నారు. ముఖ మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. సీఎస్ శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేయగా, ఈవో భాస్కర్ రావు లడ్డూ ప్రసాదం ఇచ్చారు. శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీపుష్ప యాగం వేడుకలో గవర్నర్ పాల్గొన్నారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద మొక్కి, సందర్శకుల పుస్తకంలో తన అనుభూతిని రాసి సంతకం చేశారు.

ఒంటరిగానే బరిలోకి సీపీఎం!

కాంగ్రెస్ స్పందించకపోవడంతో నిర్ణయం

- భువనగిరి ఎంపీ అభ్యర్థిగా జహంగీర్



జహంగీర్‌ను అభినందిస్తున్న వీరయ్య

సాక్షి, హైదరాబాద్: గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఒంటరిగానే బరిలోకి దిగాలని సీపీఎం భావిస్తోంది. ఇండియా కూటమిలో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని భావించినా, ఆ పార్టీ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. బుధారం జరిగిన రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినట్లు సమాచారం. కాగా ఈ నేపథ్యంలోనే భువనగిరి ఎంపీ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ పేరును ఆ పార్టీ ఖరారు చేసింది. మిగిలిన 16 లోక్‌సభ స్థానాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్న దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య హైదరాబాద్‌లో విలేకరులకు చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలన, పార్లమెంటు ఎన్నికలు, పార్టీ వైఖరిపై సమావేశంలో చర్చించామని తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్, భువనగిరి, నల్లగొండల్లో తమకు బలముందని, భువనగిరి కాకుండా మిగతా మూడింటిలో ఎక్కడ పోటీ చేయాలని కాంగ్రెస్ ప్రతిపాదించినా తాము సిద్ధమని ప్రకటించారు. కలిసి పనిచేద్దామని బీఆర్‌ఎస్ నుంచి ప్రతిపాదన వస్తే ఏం చేయాలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.జహంగీర్ భువనగిరి జిల్లాలో అనేక సమస్యలపై పోరాటాలు చేశారని చెప్పారు. మూసీ సమస్యను పరిష్కరించాలంటూ పాదయాత్ర నిర్వహించారని గుర్తు చేశారు.

తమ్మినేనికి బదులు వీరయ్య నిర్ణయాలు

అనారోగ్య కారణాలతో విశ్రాంతి తీసుకుంటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బదులుగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య పార్టీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. పార్టీ ఈ మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. కాగా జహంగీర్ పేరును కూడా వీరయ్యే ప్రకటించారు. ఇలావుండగా రాష్ట్రంలో పెద్దపల్లి, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో ఏదో ఒక స్థానంలో సీట్ల సర్దుబాటు ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఈ విషయాన్ని తాము ఇదివరకే ప్రతిపాదించామని చెప్పారు. బుధవారం జరిగిన పార్టీ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు.

17 ఎంపీ సీట్లకు నలుగురు జోనల్ కోఆర్డినేటర్లు

పార్లమెంట్, సహ కోఆర్డినేటర్లను నియమించిన బీజేపీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు నలుగురు జోనల్ కోఆర్డినేటర్లు, ఒక్కో స్థానానికి పార్లమెంట్ కోఆర్డినేటర్లు, సహ కోఆర్డినేటర్లను బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ నియమించారు. ఆదిలాబాద్, పెద్దపల్లి, వరంగల్, ఖమ్మం, భువనగిరి సీట్లకు జోనల్ కోఆర్డినేటర్‌గా సంజయ్ ఘనాటే, పార్లమెంట్ కోఆర్డినేటర్లుగా శరద్ సింగ్ ఠాకూర్, రవియాదవ్, తాళ్ల విజయ్, భాను ప్రకాశ్, మహేశ్, మరో ఐదుగురిని సహ కోఆర్డినేటర్లుగా నియమించారు. మల్కాజిగిరి, మెదక్, జహీరాబాద్, నిజామాబాద్ స్థానాలకు జోనల్ కోఆర్డినేటర్‌గా నందనం దివాకర్‌ను, పార్లమెంట్ కోఆర్డినేటర్లుగా సురేందర్‌యాదవ్, వెంకటేశ్, రమేశ్‌గౌడ్, రుద్ర శ్రీనివాస్‌గౌడ్, సుధలను, మరో ఐదుగురిని సహ కోఆర్డినేటర్లుగా నియమించారు. చేవెళ్ల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, మహబూబాబాద్‌లకు జోనల్ కోఆర్డినేటర్‌గా ఈశ్వరప్ప, పార్లమెంట్ కోఆర్డినేటర్లుగా రాజు నేత ఓయూ, వెంకటేశ్, శంకరోళ్ల రవి, రాజుయాదవ్, ఈ.శ్రీనివాస యాదవ్‌లను, మరో ఐదుగురు సహ కోఆర్డినేటర్లుగా నియమితులయ్యారు. సికింద్రాబాద్, హైదరాబాద్ సీట్లకు జోనల్ కోఆర్డినేటర్‌గా సదానంద ముదిరాజ్, పార్లమెంట్ కోఆర్డినేటర్లుగా డి.సదానంద ముదిరాజ్, పూసరాజు నియమితులయ్యారు.

హెచ్‌ఎండీఏ ఏపీఓ కృష్ణకుమార్ సస్పెన్షన్

- టీడీఆర్‌లపై ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం
- శివబాలకృష్ణకు ప్రధాన అనుచరుడిగా గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి పరిశీలన లేకుండానే టీడీఆర్ సర్టిఫికెట్‌ల జారీలో ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన శంకర్‌పల్లి జోన్ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి బీవీ.కృష్ణకుమార్‌ను హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిశోర్ బుధవారం సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ వెంటనే అమల్లోకి వస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ ఉదంతంపై సంబంధిత ప్లానింగ్ అధికారులకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నగరానికి పడమటి వైపున శంకర్‌పల్లి జోన్‌లో ఔటర్ రింగ్‌రోడ్డును ఆనుకొని ఉన్న పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరిగాయి. అనేక చోట్ల నిబంధనలను విరుద్ధంగా కొనసాగిన ఈ నిర్మాణాల్లో కృష్ణకుమార్ ప్రమేయం ఉన్నట్టు మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు ఈయన ప్రధాన అనుచరుడిగా వ్యవహరించాడు. ఈ క్రమంలో కబ్జారాయుళ్లు, అక్రమ నిర్మాణాలకు పాల్పడే వారికి కృష్ణకుమార్ అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామ పంచాయతీ పరిధిలో టీడీఆర్‌లపైన వచ్చిన దరఖాస్తులను పరిశీలించకుండానే ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించినట్టుగా తాజాగా రుజువు కావడంతో కమిషనర్ ఆయన్ను సస్పెండ్ చేశారు.
- పుప్పాలగూడలోని 330 నుంచి 332 వరకు సర్వేనంబర్లలో తమకు ఉన్న 11,698 గజాల్లో 100 ఫీట్ల రోడ్డుకు భూమిని గిఫ్ట్‌డీడ్ కింద గ్రామపంచాయతీకి రిజిస్టర్ చేసినట్టు శ్రావణ్‌కుమార్‌తో పాటు, మరికొందరు తెలిపారు. ఈ మేరకు వారు టీడీఆర్‌కు దరఖాస్తు చేసుకున్నారు.
- పుప్పాలగూడ గ్రామంలోనే వెంకటరమణ, మరికొందరు 314 నుంచి 317 వరకు సర్వేనంబర్లలో ఉన్న 22,046 గజాల్లో మాస్టర్‌ప్లాన్ కింద 100 ఫీట్ రోడ్డులో భూమి పోయిందంటూ టీడీఆర్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

టీడీఆర్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే కృష్ణకుమార్ తన పై అధికారులను తప్పుదోవ పట్టించారు. ప్రస్తుతం ఈ ఒకటిరెండు ఉదంతాలే బయటకు వచ్చినా, ఇంకా వెలుగులోకి రాని అక్రమాలు పెద్దఎత్తునే ఉంటాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పట్లో శివబాలకృష్ణపై ఏసీబీ దాడులు కొనసాగుతున్న సమయంలోనే కృష్ణకుమార్ అమెరికాకు వెళ్లడం కూడా చర్చనీయాంశమైంది. ఆయన అమెరికాకు వెళ్లడంతో ఏసీబీ దాడుల నుంచి తప్పించుకున్నాడని అప్పట్లో హెచ్‌ఎండీఏ వర్గాలు చర్చించుకోవడం గమనార్హం.

టార్గెట్ కాంగ్రెస్!

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి రాష్ట్ర ప్రభుత్వపరంగా, కాంగ్రెస్ పార్టీ పరంగా చేసిన ప్రకటనలనే బీజేపీ వినియోగించుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్లు, గ్యారంటీలు పేరిట తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందంటూ.. ప్రత్యేకంగా 'ప్రశ్నిస్తున్న తెలంగాణ..' పేరిట ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఇటీవలే ప్రారంభించింది. మహిళలు, విద్యార్థులు, యువత, రైతులు, వ్యవసాయ కూలీలు.. ఇలా వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలైన పింఛన్ల పెంపు, గొర్రెల పంపిణీ, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు తీరును ప్రశ్నిస్తోంది. కాంగ్రెస్ గ్యారంటీల అమలు కోసం ఒత్తిడి చేస్తూ.. ఆయా పథకాల కింద లబ్ధి ఆశిస్తున్న వారిని సమీకరిస్తోంది. వారి ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో ఇప్పటికే 'ప్రశ్నిస్తున్న తెలంగాణ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి కొనసాగింపుగా 'ప్రశ్నిస్తున్న రైతు..' కార్యక్రమాన్ని కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే 'ప్రశ్నిస్తున్న మహిళ.. ప్రశ్నిస్తున్న నిరుద్యోగి.. ప్రశ్నిస్తున్న వ్యవసాయ కూలీ..' అంటూ కాంగ్రెస్ డిక్లరేషన్లు, గ్యారంటీలు, మేనిఫెస్టోలలో పొందుపరిచిన అంశాలను ఎత్తిచూపేలా ప్రణాళికలను బీజేపీ రూపొందించింది.

ఘాటు విమర్శలతో దాడి

తెలంగాణలో బీజేపీ 12 సీట్లు గెలవబోతోందని తమ సర్వేల్లో వెల్లడైందని హైదరాబాద్‌లో జరిగిన పార్టీ అంతర్గత భేటీలో అమిత్‌షా వెల్లడించారు. 12న ఎల్‌బీ స్టేడియంలో పోలింగ్ బూత్ కమిటీలు, ఆపై అధ్యక్షులతో నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళనంలో రైతులు, ఓబీసీలు, యువత, మహిళలు, పేదల అభ్యున్నతి గురించి కాంగ్రెస్‌కు ఏమాత్రం పట్టదంటూ విరుచుకుపడ్డారు. ఇక ఈనెల 4న ఆదిలాబాద్‌లో, 5న పటాన్‌చెరులో, 16న నాగర్‌కర్నూల్‌లో 18న జగిత్యాలలో జరిగిన సభల్లో ప్రసంగించిన ప్రధాని మోదీ కూడా.. కాంగ్రెస్ లక్ష్యంగా ఘాటు విమర్శలు చేశారు. ''కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య తెలంగాణ నలిగిపోయింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులతో దోపిడీకి పాల్పడితే.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ భూములు, ఇతర ఆస్తుల కైంకర్యానికి దిగుతోంది. తెలంగాణను మళ్లీ నాశనం చేసేందుకు కాంగ్రెస్‌కు ఐదేళ్లు చాలు..'' అని ఆరోపణలు చేయడం గమనార్హం. అంతేకాదు దేశవ్యాప్తంగా బీజేపీని 400 సీట్లలో గెలిపిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఇష్టానుసారం చేయడం సాధ్యం కాదని, తెలంగాణలోని అన్ని ఎంపీ సీట్లలో కమలం వికసించేలా చేయాలని కూడా పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

- సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి
- ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కూడా..



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన స్వర్ణ సుధాకర్ రెడ్డి. చిత్రంలో వంశీచంద్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి వెళ్లిన ఆమె మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పురాణం సతీశ్ కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎంను కలిసిన సతీశ్ త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

హైదరాబాద్‌లో కృతజ్ఞత సభ

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకుగాను రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల నేతృత్వంలో 60 కమ్మ సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ కమ్మవారి సేవాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం హైదరాబాద్‌లో కృతజ్ఞత సభ ఏర్పాటు చేస్తామని కమ్మ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని ఒక స్థానాన్ని తమ సామాజికవర్గానికి కేటాయించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో సమాఖ్య ప్రధానకార్యదర్శి గంగవరపు శ్రీరామకృష్ణప్రసాద్, నేతలు కండపనేని రత్నాకర్, బొడ్డు రవిశంకర్ తదితరులున్నారు.

సీఎంను కలిసిన మత్స్య సొసైటీల చైర్మన్

ఇటీవల రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సొసైటీల సమాఖ్య చైర్మన్‌గా నియామకమైన మెట్టు సాయికుమార్ సీఎం రేవంత్‌ను కలిశారు. తనకు చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బండి సంజయ్‌ది ఆస్కార్ స్థాయి నటన

- కరీంనగర్‌కు ఆయనేం చేశారో.. ప్రజలకు చెప్పి ఓట్లడగాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ది ఆస్కార్ స్థాయి నటన అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఎలాంటి కారణం లేకుండా తనమీద అభాండం వేయాలని బండి సంజయ్ ప్రయత్నించారని, అయితే తాను సజీవదహనానికి కూడా సిద్ధం అనేసరికి సైలెంట్ అయిపోయారని పేర్కొన్నారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బండి సంజయ్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ఎంపీగా ఇప్పటివరకు బండి సంజయ్ కరీంనగర్ ప్రజలకు ఏం చేశారో సమాధానం చెప్పాలని, ఆ తర్వాతనే ఓట్లు అడగాలని అన్నారు.

నా ఫోన్ రికార్డు చేశారు

రాష్ట్ర మంత్రినైన తన ఫోన్ సంభాషణలనే రికార్డు చేశారని పొన్నం ఆరోపించారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో హుజూరాబాద్ ఆర్డీవోకు ఫోన్ చేస్తే కమలాపూర్ ఎమ్మార్వోకు కాన్ఫరెన్స్ కాల్ కలిపారని, అప్పుడు తాను మాట్లాడిన విషయాలను రికార్డు చేసి ప్రతిపక్షానికి చెందిన ఓ ఎమ్మెల్యేకు పంపారని చెప్పారు. ఆయన ఆ రికార్డును బయటకు లీక్ చేశారని, దీనిపై సీఎస్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమకు బీజేపీతోనే పోటీ ఉంటుందని చెప్పారు.

ఎల్లంపల్లి నుంచి తెస్తాం

ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం సింగూరు నుంచి 18 శాతం, గోదావరి నుంచి 35, కృష్ణా నుంచి 45, ఉస్మాన్ సాగర్ నుంచి 4 శాతం నీటిని వాడుతున్నామని మంత్రి పొన్నం చెప్పారు. ఇప్పుడు నాగార్జునసాగర్‌లో 510 అడుగుల మేర నీళ్లున్నాయని, అవసరమైతే బూస్టర్‌పైపుల ద్వారా నీటిని తరలిస్తామని, ఎల్లంపల్లి నుంచి కూడా 3 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నామని చెప్పారు.

సౌత్ గ్రూప్, కిక్‌బ్యాక్‌లపై ప్రశ్నలు

- నాలుగోరోజూ కవితను విచారించిన ఈడీ
- కవిత పీఏలనూ ప్రశ్నించిన అధికారులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అధికారులు నాలుగోరోజైన బుధవారం కూడా విచారించారు. మద్యం విధానం కూర్పు, అమలు, సౌత్ గ్రూప్, కిక్‌బ్యాక్‌లకు సంబంధించి పలు అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. అనంతరం సాయంత్రం 7 గంటల సమయంలో మాజీ మంత్రి కేటీఆర్ ఈడీ కార్యాలయంలో కవితతో భేటీ అయ్యి సుమారు గంటసేపు మాట్లాడారు. శుక్రవారం సుప్రీంకోర్టులో జరగనున్న విచారణకు సంబంధించి న్యాయవాది మోహిత్‌రావుతో కలిసి చర్చించారు. ఇదే కేసులో అభిషేక్ బోయినపల్లికి మధ్యంతర బెయిల్ వచ్చిన అంశాన్ని వివరిస్తూ బెయిల్ కోసం కృషి చేస్తున్నామంటూ కవితకు ధైర్యం చెప్పినట్లు తెలిసింది. మరోవైపు, కవిత పీఏలైన రాజేశ్, రోహిత్‌రావులను బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఈడీ అధికారులు విచారించారు.

కోలుకుంటున్న నారాయణ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 16న కామారెడ్డిలో ఒక వివాహ కార్యక్రమంలో జారిపడిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పక్కటెముక విరిగిందని, ఆయనకు రెండు వారాల విశ్రాంతి అవసరమని ఏఐజీ వైద్యులు సూచించినట్లు సీపీఐ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం నారాయణ హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఓటరుగా నమోదు చేసుకోండి

బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: మనకున్న ప్రాథమిక హక్కులు, విధుల్లో ఓటు హక్కు ఒకటి అని ఈ ప్రాథమిక హక్కు వినియోగానికి ఓటరుగా నమోదు చేసుకోవడం అత్యవసరమని బీజేపీనేత, చేవెళ్ల లోక్‌సభ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి గడువు సమీపిస్తున్నందున, ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోనివారు త్వరపడాలని బుధవారం ఓ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జగన్‌ను చూసి నేర్చుకోండి

- సీఎం రేవంత్‌రెడ్డికి వంగపల్లి శ్రీనివాస్ సలహా
- ఏపీలో సామాజిక న్యాయం అద్భుతంగా అమలవుతోందని ప్రశంసలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

ముషీరాబాద్ (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సామాజిక న్యాయం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం విషయంలో అక్కడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని సలహా ఇచ్చారు. వైఎస్ జగన్ ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లలో 50 శాతానికి పైగా బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు కేటాయించి ఔరా అనిపించుకున్నారని ప్రశంసించారు. 2019తో పోలిస్తే అత్యధికంగా బీసీలకు 48, ఎస్సీలకు 29, ఎస్టీలకు ఏడు, మహిళలకు 19 టికెట్లు కేటాయించారని కొనియాడారు. రెండు రోజుల క్రితం రేవంత్‌రెడ్డి 37 కార్పొరేషన్ల చైర్మన్లను ప్రకటిస్తే 17 అగ్రకులాలకు ఇచ్చారని, 50 శాతం ఉన్న బీసీలకు కేవలం 13, 12 శాతం ఉన్న ఎస్టీలకు మూడు, 20 శాతం ఉన్న ఎస్సీలకు కేవలం ఒకే ఒక్క చైర్మన్ పదవిని ఇచ్చారని తెలిపారు. దీన్ని బట్టి తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం కేవలం మాటలకు మాత్రమే పరిమితం అని అర్థమవుతోందన్నారు. ఉద్యమకారులను వాడుకుని వదిలేశారని మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్‌రెడ్డి, 37 చైర్మన్ పోస్టులలో ఒక్కటి కూడా ఓయూ ఉద్యమకారులకు ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు.

మల్కాజ్‌గిరిలో బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య చీకటి ఒప్పందం

- ఎన్నికల తర్వాత ఆ రెండు పార్టీలు ఖాళీ అవుతాయి
- సర్వేల ఆధారంగానే లోక్‌సభ అభ్యర్థుల ఖరారు
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలిచేలా బీఆర్‌ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆరోపించారు. ఈటల గెలుపు కోసమే మల్కాజ్‌గిరిలో బీఆర్‌ఎస్ డమ్మీ అభ్యర్థిని బరిలో దింపిందని, తనను బీఆర్‌ఎస్ నేతలు గెలిపిస్తారన్న ఆలోచనతోనే కేసీఆర్ తురుంఖాన్ అని ఈటల మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, లింగంయాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సుపరిపాలనను చూసి బీఆర్‌ఎస్, బీజేపీలు ఓర్వలేకపోతున్నాయన్నారు. అందుకే ఆ రెండు పార్టీలు చవకబారు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. వారికి లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని, ఈ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్, బీజేపీ ఖాళీ అవుతాయని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌ని ఉద్దేశించి ఈటల చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనకు ఆకర్షితులయ్యే ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని చెప్పారు. సర్వేల ఆధారంగానే లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేస్తోందని తెలిపారు.

క్లుప్తంగా...

జూన్ 23న నీట్ పీజీ



సాక్షి, అమరావతి: వైద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) పీజీ–2024ను ఈ ఏడాది జూన్ 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ ఎంసీ) బుధవారం విడుదల చేసింది. వచ్చే జూలై 7న నీట్ పీజీ నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. కాగా, జూన్ 23నే పరీక్ష నిర్వ హించి, జూలై 15న ఫలితాలు ప్రకటించను న్నట్టు సవరించిన షెడ్యూల్‌లో వెల్లడించారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆగస్టు 5 నుంచి అక్టోబర్ 15 మధ్య ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 16వ తేదీ నుంచి అకడమిక్ కార్యకలా పాలు ప్రారంభించనున్నారు. కళాశాలల్లో చేరికలకు అక్టోబర్ 21 చివరి గడువుగా పేర్కొన్నారు.

టీ-శాట్‌లో టెట్ అవగాహన తరగతులు

- టీ–శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షపై అభ్యర్థులకు టీ–శాట్ నెట్‌వర్క్‌లో అవగాహన కల్పించనున్నట్లు టీ–శాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం నుంచి వచ్చే పదిరోజుల పాటు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అనుభవం కలిగిన ఫ్యాకల్టీతో నిర్వహించే లైవ్ కార్యక్రమాల్లో గురువారం కెమిస్ట్రీ సబ్జెక్ట్‌పై అవగాహన కార్యక్రమం ఉంటుందని సీఈవో తెలిపారు. పది రోజుల పాటు పది సబ్జెక్టులపై జరిగే ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాల్లో టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 040–23540326, టోల్ ఫ్రీ 1800–425–4039 నంబర్లకు కాల్ చేయాలని సీఈవో పేర్కొన్నారు.

యూపీఎస్సీ సీశాట్-2025 ఉచిత శిక్షణకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సీశాట్–2025 పరీక్షకు ఉచిత శిక్షణ కోసం అర్హులైన మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో 100 మంది అభ్యర్థులను శిక్షణ కోసం ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, వికలాంగులకు 5% సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్క్రీనింగ్ టెస్ట్ అన్ని జిల్లా కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ఏప్రిల్ 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 040– 232 40134 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్సెస్సీ పరీక్షల నిర్వాహకులపై వేటు

సాక్షి ఎఫెక్ట్

పాల్వంచ: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు మెయిన్ ఆన్సర్ షీట్లు ఇవ్వకుండా అడిషనల్ షీట్లు ఇచ్చిన పరీక్షా కేంద్రం నిర్వాహకులపై అధికారులు వేటు వేశారు. ఈ నెల 18న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ నంబర్ గదిలో ఒక ఇన్విజిలేటర్ ప్రధాన జవాబు పత్రం ఇవ్వకుండా అడిషనల్ షీట్లు ఇచ్చి పరీక్ష రాయించారు. ఈ విషయాన్ని 19వ తేదీన గమనించిన విద్యార్థులు..వారి తల్లిదండ్రులకు చెప్పడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై 'సాక్షి'ప్రధాన సంచికలో 'ఆన్సర్ షీట్లకు బదులు అడిషనల్ షీట్లు?'శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఈఓ వెంకటాచారి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, ఇన్విజిలేటర్‌ను పరీక్ష విధుల నుంచి తొలగించడంతో పాటు మెమో జారీ చేశారు. ఈ విషయం బుధవారం రాత్రి వెలుగుచూసింది. కాగా, ఘటనపై విచారణ కొనసాగుతుందని.. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందొద్దని సూచించారు.

బకాయిలు ఇవ్వండి: టీపీడీపీఎంఏ

సాక్షి,హైదరాబాద్: ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు తక్షణమే ఇప్పించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్య సంఘం (టీపీడీపీఎంఏ) కోరింది. ఈ మేరకు సంఘం నేతలు బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, యాదరామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పరమేశ్వర్ తదితరులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలు వినిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.





అలరిస్తున్న అతిథులు..

నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం జీజీ నడుకుడ, చిన్నయానం గ్రామ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో ఫ్లెమింగో పక్షులు సందడి చేస్తున్నాయి. ప్రతి వేసవిలో యూరప్ ఖండం నుంచి ఈ పక్షులు వలస వచ్చి ఇక్కడ సేదతీరుతాయి. వేసవి ముగియగానే తిరిగి వెళ్లిపోతాయని డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు.

\- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

డీఎస్సీ హడావుడి షురూ

ప్రశ్నపత్రం కఠినంగా ఉండొచ్చనే వాదన

- ప్రిపరేషన్ లేకుంటే కష్టమనే ప్రచారం
- మార్కెట్ ట్రెండ్ పెంచిన కోచింగ్ కేంద్రాలు
- ఈసారి డీఎస్సీ దరఖాస్తులు 3 లక్షలు దాటే అవకాశం



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ హడావుడి మొదలైంది. మంచి కోచింగ్ కేంద్రాల కోసం టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసినవారు వెతుకుతున్నారు. అయితే వారిని ఆకర్షించేందుకు కోచింగ్ కేంద్రాలు లోతైన మెటీరియల్ ఇస్తామని, సబ్జెక్ట్ నిపుణులతో ప్రత్యేక క్లాసులు చెప్పిస్తామని ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టులతో డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. వచ్చే జూలై 17 నుంచి 31 వరకూ ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష జరుగుతుంది. గత ఏడాది డీఎస్సీకి 1.70 లక్షల దరఖాస్తులు వస్తే, ఇవి కాకుండా కొత్తగా ఇప్పటి వరకూ మరో 25 వేల మంది వరకూ దరఖాస్తు చేశారు. డీఎస్సీకి ముందే ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో గడువు ముగిసే నాటికి మరో లక్ష మంది వరకూ డీఎస్సీకి దరఖాస్తు చేసే అవకాశముంది. మొత్తంగా 3 లక్షల మంది ఈ ఏడాది డీఎస్సీకి హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. కోచింగ్ తీసుకునేందుకు 1.50 లక్షల మందికిపైగా హైదరాబాద్‌కు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

తేలికగా ఉండదని...

ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ఈసారి కఠినంగా ఉంటుందని కొన్ని కోచింగ్ కేంద్రాలు చెబుతున్నాయి. ఏజెంట్లను నియమించుకుని మరీ ఈ తరహా ప్రచారానికి తెరలేపాయి. 2017 నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ లేకపోవడం, టెట్ ఉత్తీర్ణత సాధించినవారి సంఖ్య ఏటా పెరుగుతుండటంతో దరఖాస్తుదారుల సంఖ్య భారీగానే ఉంటుందని అనుకుంటున్నారు. పోటీ పెరిగిన నేపథ్యంలో వడపోత విధానాలపై విద్యాశాఖ కసరత్తు మొదలుపెట్టిందని వారు అంటున్నారు. గతంలో మాదిరి తేలికైన, సూటి ప్రశ్నలు వచ్చే వీల్లేదని అంచనా వేస్తున్నారు. మ్యాథ్స్, సైన్స్ సహా సైకాలజీ సబ్జెక్టుల్లోనూ కఠినమైన రీతిలో ప్రశ్నలు రూపొందించొచ్చని చెబుతున్నారు. నూతన విద్యావిధానం అమలులోకి వస్తున్న తరుణంలో బోధన పద్ధతుల నుంచి లోతైన ప్రశ్నలు ఉంటాయంటున్నారు. జాతీయ, అంతర్జాతీయ బోధన మెళకువలను అభ్యర్థుల నుంచి తెలుసుకునే వ్యూహం డీఎస్సీలో ఉంటుందని నిపుణులూ అంటున్నారు. గత కొంతకాలంగా బీఈడీ, డీఎడ్‌లో ఇవన్నీ లేవని, కాబట్టి కొత్త విషయాలను అవగాహన చేసుకుంటే తప్ప డీఎస్సీ తేలికగా రాయడం కష్టమనే వాదనను కోచింగ్ కేంద్రాలు ప్రచారం చేస్తున్నాయి. అయితే, నిర్దేశించిన సిలబస్ నుంచే ప్రశ్నపత్రం ఉంటుందని, కాకపోతే నవీన బోధన విధానాలు, సైకాలజీ నుంచి సరికొత్త విషయాలతో ప్రశ్నపత్రం రూపొందించే ఆలోచనలో ఉన్నట్టు అధికార వర్గాలు అంటున్నాయి. దీనినిబట్టి అకడమిక్ పుస్తకాలకు అందని రీతిలో డీఎస్సీ ఉంటుందా? అనే సందేహాలు అభ్యర్థుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

పోటీ పెంచుతున్న కోచింగ్ సెంటర్లు

కొత్త స్టడీ మెటీరియల్ రూపకల్పన, ఫ్యాకల్టీ ఎంపికపై కోచింగ్ కేంద్రాలు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. మూడు నెలల కాల పరిమితితో కూడిన డీఎస్సీ కోచింగ్ సిలబస్ రూపొందిస్తున్నాయి. సొంతంగా మెటీరియల్ తయారు చేసుకుంటున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా ఇప్పటికే 20 ప్రముఖ కోచింగ్ సెంటర్లు విస్తృతంగా ప్రచార కార్యక్రమంలో ఉన్నాయి. మరో వంద వరకూ చిన్నాచితక సెంటర్లు వెలిశాయి. స్వల్పకాలిక కోచింగ్‌కు ఒక్కో అభ్యర్థి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ. 2.50 లక్షల వరకూ డిమాండ్ చేస్తున్నాయి. వివిధ రాష్ట్రాల్లో నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పుల ఆధారంగా కోచింగ్ ఉంటుందని చెబుతున్నాయి. డీఎస్సీ రాసేవారిలో నాలుగేళ్ల ముందు బీఎడ్, డీఎడ్ ఉత్తీర్ణులైన వారున్నారు. ఒక్కసారిగా సిలబస్ మారుతోందనే ప్రచారంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. కొత్త తరహా ప్రశ్నపత్రం వస్తే కష్టమనే భావన బలపడుతోంది. అయితే, మెథడాలజీ, సబ్జెక్టులపై అవగాహన ఉంటే ఇబ్బంది ఏమీ ఉండదని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఏదేమైనా కోచింగ్ కోసం ఈ తరహా అభ్యర్థులు హైదరాబాద్‌ను ఆశ్రయిస్తున్నారు.

వచ్చే నెలాఖరు కల్లా గురుకుల ప్రవేశ పరీక్షలు పూర్తి

- కార్యాచరణ రూపొందించిన గురుకుల సొసైటీలు
- ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడిగా నిర్వహించే పరీక్ష ఇప్పటికే పూర్తి
- వచ్చే నెలలో ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీలకు ప్రవేశ పరీక్షలు
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముందుగా పరీక్షలు




సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహించే అర్హత పరీక్షలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని గురుకుల విద్యా సంస్థల సొసైటీలు నిర్దేశించుకున్నాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నెలాఖరు నాటికే అన్నిరకాల ప్రవేశపరీక్షలను నిర్వహించాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా గురుకుల సొసైటీలు ఉమ్మడిగా నిర్వహించే ఐదో తరగతి ప్రవేశ పరీక్షను ఇప్పటికే పూర్తి చేశాయి. విడివిడిగా నిర్వహించే బ్యాక్‌లాగ్ ఖాళీలు, జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్ అడ్మిషన్లు, డిగ్రీ, పీజీ కోర్సుల్లోనూ సంవత్సరం ప్రవేశాలకు అర్హత పరీక్షలను తేదీలను ప్రకటించి.. వేగంగా ఏర్పాట్లు చేస్తున్నాయి.

మే నెలాఖరు నాటికి ఫలితాలు

గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యాశాఖల ఆధ్వర్యంలోని గురుకుల సొసైటీలు ఉమ్మడిగా ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నాయి. దాదాపు 50వేల సీట్ల భర్తీ కోసం నిర్వహించిన పరీక్ష ఈసారి 1.5లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు వారి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని కూడా మొదలుపెట్టారు. ఇక సొసైటీల వారీగా గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలను కూడా భర్తీ చేయడానికి వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారు. ఇటీవల బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలు వీటికి పరీక్షలను నిర్వహించగా.. మైనార్టీ, జనరల్ గురుకుల సొసైటీలు వారంలోగా పరీక్షలు నిర్వహించనున్నాయి. ఇక గురుకుల జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్ అడ్మిషన్ల అర్హత పరీక్షలు కూడా దాదాపు పూర్తికావొచ్చాయి. డిగ్రీ కాలేజీల్లో ఫస్టియర్ ప్రవేశాల పరీక్షను ఏప్రిల్ 28వ తేదీ నాటికి అన్ని సొసైటీలు పూర్తి చేయనున్నాయి. పీజీ కాలేజీల్లో ప్రవేశ పరీక్షలను కూడా వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. వాటి ఫలితాలను మే నెలాఖరు నాటికి ప్రకటించాలని, జూన్ తొలివారం నుంచి 2024–25 విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చాయి. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ మే 13న జరగనుంది. ఆ తర్వాత క్రమంగా ఫలితాలను ప్రకటించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

యాదాద్రిలో వైభవంగా శ్రీచక్ర తీర్థం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమానుసారంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో బుధవారం ఉదయం నిత్య పూజలు చేసిన ఆచార్యులు ప్రథమ ప్రాకారంలోని ఉత్తర దిశలోని యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీచక్ర ఆళ్వారుడికి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, ఆలయ మాడవీధుల్లో ఊరేగించి, విష్ణు పుష్కరిణిలో శ్రీచక్ర తీర్థ స్నానం చేపట్టారు. విష్ణు పుష్కరిణిలో చక్రతీర్థం నిర్వహించిన సందర్భంలో భక్తులు స్నానాలు ఆచరించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో అష్టోత్తర శత ఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహిస్తారు. శృంగార డోలోత్సవంతో 11 రోజుల బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఎస్‌ఐఈటీ ప్రక్షాళనకు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (ఎస్‌ఐఈటీ), మోడల్ స్కూల్స్, ఓపెన్ స్కూల్స్, బాలభవన్, డీజీఈ, సమగ్ర శిక్ష విభాగాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంపికలో నిర్దేశిత నిబంధనలు పాటించాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు పి.రాజభాను చంద్రప్రకాశ్ ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి బుధవారం వినతి పత్రం అందజేశారు. గతంలో జరిగిన నియామకాలపై పునఃసమీక్ష చేయాలని కోరారు. అనధికారిక డిప్యుటేషన్లను పరిశీలించి ప్రక్షాళన చేయాలని కోరారు.

5,348 పోస్టుల భర్తీకి అనుమతి

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు. అత్యధికంగా వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) విభాగం పరిధిలో 3,235 పోస్టులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో 1,255, ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 575, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో 11, ఆయుష్ విభాగంలో 26, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో 34, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి పరిధిలో 212 పోస్టులు భర్తీ చేస్తారు.

వివిధ విభాగాల్లో భర్తీ చేసే పోస్టుల వివరాలు

➤ **ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో..**
సివిల్ అసిస్టెంట్ సర్జన్– 351, ల్యాబ్ టెక్నీషియన్ (గ్రేడ్–2)– 193, స్టాఫ్‌నర్స్– 31

➤ **డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో..**
జూనియర్ అనలిస్ట్ – 11

➤ **ఆయుష్ విభాగంలో..**
టెక్నికల్ అసిస్టెంట్(ఆయుర్వేద)– 6, టెక్నికల్ అసిస్టెంట్ (యునాని)–8, లెక్చరర్ (ఆయుర్వేద)–1, లెక్చరర్ (హోమియో)–10, మెడికల్ ఆఫీసర్ (యు) లీవ్ రిజర్వుడు–1

➤ **ఐపీఎంలో..**
సివిల్ అసిస్టెంట్ సర్జన్– 4, లేబొరేటరీ టెక్నీషియన్ గ్రేడ్–2 లోకల్ కేడర్ –6, లేబొరేటరీ టెక్నీషియన్ గ్రేడ్–2 స్టేట్ కేడర్ –1, లేబొరేటరీ అటెండెంట్ స్టేట్ కేడర్ – 7, వ్యాక్సినేటర్ –1, స్టాఫ్‌నర్స్–1, ఫార్మసిస్ట్ (గ్రేడ్–2) –1, జూనియర్ అనలిస్ట్ (లోకల్ కేడర్)–2, జూనియర్ అనలిస్ట్ (స్టేట్ కేడర్) – 11

➤ **డీఎంఈ పరిధిలో..**
సీటీ స్కాన్ టెక్నీషియన్–6, డెంటల్ హైజినిస్ట్– 3, ఈసీజీ టెక్నీషియన్ – 4, ఈఈజీ టెక్నీషియన్ – 5, అనస్థిషియా టెక్నీషియన్ – 93, ఆడియో విజువల్ టెక్నీషియన్ – 32, ఆడియో మెట్రీ టెక్నీషియన్– 18, బయో మెడికల్ ఇంజనీర్–14, బయో మెడికల్ టెక్నీషియన్–11, డెంటల్ టెక్నీషియన్– 53, రేడియోగ్రఫీ టెక్నీషియన్– 19, ఆప్తోమెట్రిస్ట్– 20, స్టెరిలైజేషన్ టెక్నీషియన్–15, ఫిజియోథెరపిస్ట్–33, అసిస్టెంట్ ప్రొఫెసర్లు– 555, నాన్ మెడికల్ అసిస్టెంట్లు (జి)–17, రేడియోలాజికల్ ఫిజిక్స్ అండ్ రేడియోలాజికల్ ఫిజిసిస్ట్ లెక్చరర్– 5, పర్‌ఫ్యూజనిస్ట్–3, లైబ్రేరియన్–14, ఫిజికల్ డైరెక్టర్ – 5, క్లినికల్ సైకాలజిస్ట్ – 2, స్పీచ్ పాథాలజిస్ట్–1, చైల్డ్ సైకాలజిస్ట్– 21, ఇమ్యునోలజిస్ట్–1, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు–80, మెడికో సోషల్ వర్కర్ (గ్రేడ్–2)– 95, స్టాఫ్‌నర్సులు–1,545, స్టాటిస్టీషియన్–20, ఫార్మసిస్ట్ (గ్రేడ్–2) – 125, ల్యాబ్ టెక్నీషియన్ (గ్రేడ్–2)– 420

➤ **తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో..**
ఫిజియోథెరపిస్ట్– 13, ఏఎన్‌ఎంలు– 85, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు– 617, స్టాఫ్‌నర్సులు– 332, డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు – 6, ల్యాబ్ టెక్నీషియన్లు– 136, ఫార్మసిస్ట్ (గ్రేడ్–2)– 66

➤ **ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో..**
అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు.. అనస్థీషియా– 4, బయోకెమిస్ట్రీ –1, డెంటల్ సర్జరీ –1, ఈఎన్‌టీ– 1, గైనిక్ అంకాలజీ– 2, మెడికల్ అంకాలజీ (పీడియాట్రిక్ మెడికల్ అంకాలజీతో కలిపి)– 4, మైక్రోబయోలజీ – 1, మాలిక్యులర్ అంకాలజీ –1, న్యూక్లియర్ మెడిసిన్– 2, అప్తమాలజీ – 1, పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్– 2, పాథాలజీ– 2, ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ – 2, రేడియోలాజికల్ ఫిజిక్స్ – 4, రేడియాలజీ – 2, రేడియోథెరపీ – 4, సర్జికల్ అంకాలజీ – 6, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్–1. సివిల్ అసిస్టెంట్ సర్జన్ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్) – 2, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (అనస్థీషియా)– 2, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సైటో పాథాలజీ)– 2, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (పాథాలజీ) –2, లెక్చరర్ (న్యూక్లియర్ అంకాలజీ) – 1, లెక్చరర్ (న్యూక్లియర్ మెడిసిన్/న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్)– 3, బయోమెడికల్ ఇంజనీర్ – 2, స్టాఫ్‌నర్స్–80, ల్యాబ్ టెక్నీషియన్లు (గ్రేడ్–2 – 8, మౌల్డ్ టెక్నీషియన్ – 1, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నీషియన్ – 2, రేడియోథెరపీ టెక్నీషియన్ – 10, టెక్నీషియన్లు–5, టెక్నీషియన్లు (మెడికల్ ఇమేజింగ్)– 5, థియేటర్ అటెండెంట్లు–5, డెంటల్ టెక్నీషియన్ –1, ఈసీజీ టెక్నీషియన్– 2, ల్యాబ్ టెక్నీషియన్– 8, మెడికల్ ఫిజిసిస్ట్– 5, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్– 3, రేడియోగ్రాఫర్ సీటీ టెక్నీషియన్– 2, రేడియోగ్రాఫర్ మమోగ్రఫీ టెక్నీషియన్–1, రేడియోగ్రాఫర్ ఎంఆర్‌ఐ టెక్నీషియన్–2, రేడియోగ్రాఫర్ ఆర్‌టీ టెక్నీషియన్– 5, రేడియోగ్రాఫర్–6, సోషల్ వర్కర్–6.

ఈ గుడ్డు వెరీగుడ్డేనా...?

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖమ్మం కలెక్టర్ తనిఖీలు
- గుడ్ల నాణ్యత, బరువు తనిఖీ



కోడిగుడ్లను తూకం వేయిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల బరువు, నాణ్యతను తెలుసుకునేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ వాటిని తూకం వేయించారు. కలెక్టర్ గౌతమ్ బుధవారం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతుల కల్పనపై సూచనలు చేశారు. అనంతరం పెద్దతండా, మద్దులపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి.. అక్కడి కోడిగుడ్ల నాణ్యతపై ఆరా తీశారు. ఒక్కొక్క గుడ్డు బరువు, నాణ్యతను నిశితంగా పరిశీలించడమే కాక టెండర్‌లో పేర్కొన్నట్లు బరువుందో, లేదో తెలుసుకునేందుకు కేసుల వారీగా గుడ్లను తూకం వేయించారు. ప్రతిసారి కోడిగుడ్లు వచ్చినప్పుడు అగ్రిమెంట్ ప్రకారం బరువు, ఉన్నాయా లేదా అని పరిశీలించాలని సిబ్బందికి కలెక్టర్ గౌతమ్ సూచించారు.

ఎక్కువ రేటుకు అమ్ముతున్నారని

మద్యం లూటీ చేశారు

- నాలుగు వైన్ షాపులపై మందుబాబుల దాడి
- సుమారు రూ.30 లక్షల విలువైన మద్యం అపహరణ



వైన్‌షాపులో మద్యం ఎత్తుకెళ్తున్న స్థానికులు



టేకులపల్లి: అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారంటూ ఆగ్రహించిన కొందరు మందుబాబులు నాలుగు మద్యం దుకాణాలపై దాడి చేసి సుమారు రూ.30 లక్షల విలువైన సరుకు లూటీ చేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. టేకులపల్లిలో పల్లవి–1, పల్లవి–2, గణేష్, క్రాంతి పేర్లతో నాలుగు వైన్ షాపులు ఉన్నాయి. ఈ షాపుల్లో కొంతకాలంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉండగా, బుధవారం నుంచి సిండికేట్‌గా మారినట్లు సమాచారం. ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, ముఖ్యమైన బ్రాండ్ల మద్యం వైన్‌షాపులో ఉంచకుండా బెల్ట్ షాపులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం పలువురు మందుబాబులకు, వైన్ షాపు నిర్వాహకులకు మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో షాపులో ఉన్న వర్కర్లను పక్కకు తోసేసిన మందుబాబులు మద్యం సీసాలు, బాక్సులు ఎత్తుకెళ్లారు. ఇదే అదనుగా భావించిన కొందరు స్థానికులు, ప్రయాణికులు సైతం షాపుల్లోకి చొరబడి అందినకాడికి మద్యం సీసాలు, బాక్సులు తీసుకుపోయారు. వారిలో కొందరు మహిళలు కూడా ఉండటం గమనార్హం. కాగా, ఈ షాపులన్నీ ఇటీవల ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లుపై అవిశ్వాస తీర్మానానికి నేతృత్వం వహించిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త కొండపల్లి గణేష్‌కు చెందినవి. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆధ్వర్యంలో సీఐలు కరుణాకర్, సురేశ్, ఎస్‌ఐ పి.శ్రీకాంత్ వైన్ షాపుల వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు.

పాస్ పుస్తకాలు ఇవ్వలేదని..

పెట్రోల్ పోసుకుని..



పెట్రోల్ చల్లుతున్న మహిళ


- తహసీల్దార్ ఎదుట మహిళల ఆత్మహత్యాయత్నం
- జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో ఘటన

అయిజ: ప్రభుత్వం ఇచ్చిన భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని ఐదుగురు మహిళలు తహసీల్దార్ ఎదుట ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. అయిజ మండలం బింగుదొడ్డి గ్రామ శివారు సర్వేనంబర్ 139లో అయిజకు చెందిన ఆది శేషుడికి ఐదెకరాలు, ఆయన తల్లి లక్ష్మీదేవమ్మకు ఐదెకరాల భూమిని 1972లో ప్రభుత్వం ఇచ్చింది. కొంతకాలం తర్వాత ఆ పదెకరాల భూమిని ఆదిశేషుడి కుటుంబ సభ్యులైన నాగరాజు భార్య రామేశ్వ రమ్మ, ఆదిశేషుడి భార్య సుభద్రమ్మ, అమర్నాథ్ భార్య గోవిందమ్మ, రుక్మానాథ్ భార్య రోహినమ్మ, శివుడి భార్య లక్ష్మి పేరిట 2 ఎకరాల చొప్పున పంచుకుని, పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందారు. కాగా, గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తేవడంతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకుని, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడంతో బుధవారం ఐదుగురు మహిళలు తహసీల్దార్ జ్యోతిని కలిశారు. సమస్య పరిష్కారానికి సమయం కావాలని తహసీల్దార్ అనడంతో,మహిళలు తమవెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకునే ప్రయత్నం చేశారు. వెంటనే అక్కడున్న వారు పెట్రోల్ బాటిళ్లను లాక్కున్నారు. ఈ క్రమంలో తహసీల్దార్‌పైనా పెట్రోల్ పడింది. బాధిత మహిళలు 50 ఏళ్ల నుంచి కాస్తులో లేరని.. ఆ భూమిలో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు పంపారని తహసీల్దార్ తెలిపారు. ఆ భూమిని సర్వే చేయాలని సర్వేయర్‌ను ఆదేశించినట్లు చెప్పారు.

పక్షుల నియంత్రణకు స్ప్రే డ్రోన్



సాక్షి, విశాఖపట్నం: విమానాల రాకపోకలకు పక్షులు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. దీంతో తూర్పు నౌకాదళంలోని వైమానిక బృందం వినూత్న విధానాల్ని అమల్లోకి తీసుకొచ్చింది. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం, నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్‌ఎస్‌డేగా పక్కపక్కనే ఉన్నాయి. వీటి పక్కనే మడ అడవులు విస్తరించి ఉన్నాయి. అక్కడ నుంచి పక్షులు రాకపోకలు పెరుగుతుండటంతో.. విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నేవల్ ఫ్లైట్స్ కూడా ఎగిరేందుకు అంతరాయం కలుగుతున్న తరుణంలో ఈ సమస్యని పరిష్కరించేందుకు నేవల్ ఏవియేషన్ అధికారులు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. స్ప్రే డ్రోన్స్‌ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐఎన్‌ఎస్ డేగా నుంచి వీటి ఆపరేషన్స్ నిర్వహించి.. పక్షులు ఎగరనీయకుండా నియంత్రించనున్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలో ఉన్న చెట్లపై నీటిని స్ప్రే చేస్తే.. రన్‌వే సమీపంలోకి పక్షులు రాకుండా నిలువరించగలమనీ.. తద్వారా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడదని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.



బలమైన మెదళ్లు... ఆలోచనల గురించి మాట్లాడుతాయి.
సాధారణ మెదళ్లు ... సంఘటనల గురించి మాట్లాడుతాయి.
బలహీనమైన మెదళ్లు... జనాల గురించి మాట్లాడుతాయి.
– సోక్రటీస్

గురువారం, 21 మార్చి 2024

ఇది ఏకగ్రీవ సి'ఫార్సు'

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని ఉన్నత స్థాయి కమిటీ ఊహించినట్టుగానే జమిలి ఎన్నికలకు జైకొట్టింది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో, ఆ తర్వాత వంద రోజుల్లో మునిసిపాలిటీలు, పంచాయతీల ఎన్నికలు జరపాలని ఏకగ్రీవంగా సిఫార్సు చేస్తూ, సదరు కమిటీ గత వారం నివేదిక సమర్పించింది. సిఫార్సులు ఊహించినవే అయినప్పటికీ, నిర్ణీత కాలవ్యవధి ఏమీ లేకపోయినా 2024 సార్వత్రిక ఎన్నికలకు కొద్దిగా ముందుగా కమిటీ 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' (ఓఎన్‌ఓఈ) ప్రతిపాదనను తెర మీదకు తేవడం అనుమానాలు రేపింది. రాజ్యాంగ సవరణ, ఒకే ఎన్నికల జాబితా – ఎన్నికల గుర్తింపు కార్డు, త్రిశంకు సభ – అవిశ్వాస తీర్మాన పరిస్థితులు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు – పోలింగ్ సిబ్బంది – పోలీసు బలగాల ఏర్పాట్ల లాంటి పలు అంశాలపై కమిటీ కీలక సిఫార్సులు ఇప్పుడు చర్చ రేపుతున్నాయి. మన ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలనూ, సమాఖ్య చట్రాన్నే మార్చేసే సత్తా ఈ ప్రతిపాదనకు ఉండడమే అందుకు కారణం.

కోవింద్ సారథ్యంలో 2023 సెప్టెంబర్‌లో ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి కమిటీలో భాగం కావడానికి నిరాకరించారు. మొత్తం 8 మంది సభ్యుల కమిటీ 65 సమావేశాలు జరిపి, అనుకున్నట్టుగానే ప్రభుత్వ వైఖరికి అనుకూలంగా నివేదిక ఇచ్చింది. జాతీయ, రాష్ట్ర పార్టీల అభిప్రాయాల్ని తెలుసుకున్నామనీ, న్యాయకోవిదుల మొదలు ఆర్థికవేత్తల దాకా పలువురి సూచనలు కోరామనీ కమిటీ తెలిపింది. అయితే, నివేదికను గమనిస్తే అవసరమైన లోతైన అధ్యయనం, విశ్లేషణ సాగినట్టు తోచదు. అన్ని వర్గాలనూ ఈ అధ్యయన ప్రక్రియలో భాగం చేసినట్టు అనిపించదు. తూతూ మంత్రపు తతంగం చివరకు 21 సంపుటాల్లో, 18,626 పేజీల్లో, మొత్తం 11 అధ్యాయాలు, అనేక అనుబంధాల బృహన్నివేదిక రూపం మాత్రం సంతరించుకుంది. రాష్ట్రపతికి మార్చి 14న కమిటీ తన నివేదికను అందించడంతో ప్రధాన ఘట్టం ముగిసింది. త్వరలోనే లా కమిషన్ సైతం తన నివేదికను ఇవ్వనుంది. ఇక, వచ్చే 2029 ఎన్నికల్లోగా దాన్ని ఎలా ఆచరణలోకి తేవాలన్నది కేంద్రం చేతిలో ఉంది. కమిటీ ఏకగ్రీవ సిఫార్సు గనక అది ముగిసిన కథ అనకుండా, వ్యతిరేకిస్తున్న వారి సముచితమైన భయాందోళనల్ని విని, సమాధానపరచడం అవసరం.

నిజానికి, ఒకేసారి లోక్‌సభ, శాసనసభలకు ఎన్నికలు జరగడం కనివిని ఎరుగనిదేమీ కాదు. చట్టం ఏమీ లేకపోయినా స్వతంత్ర భారతావనిలో ఎన్నికలు మొదలయ్యాక తొలి రోజుల్లో ఏకకాలంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. అయితే, అయిదేళ్ళ కాలవ్యవధి పూర్తికాక ముందే రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసే ధోరణి మొదలయ్యాక, 1967 తర్వాత నుంచి ఈ ఏకకాల విధానానికి తెర పడింది. తరువాత కూడా మధ్య మధ్యలో ఈ జమిలి ఎన్నికల ఆలోచన తొంగిచూసినా, వడివడిగా అడుగులు పడింది మాత్రం ఇప్పుడే. మోదీ సారథ్యంలోని బీజేపీ ఆది నుంచి జమిలి ఎన్నికల నిర్వహణ జపం చేస్తోంది. అందుకు తగ్గట్టే ఇప్పుడు కోవింద్ కమిటీ జమిలి ఎన్నికలకు సిఫార్సు చేసింది. జమిలి ఎన్నికలను 15 పార్టీలు వ్యతిరేకించాయని కమిటీ పేర్కొంది కానీ, వ్యతిరేకిస్తున్నవారిని ఒప్పించడానికీ, సద్విమర్శలను తీసుకొని సరిదిద్దుకోవడానికీ చేసిందేమిటో తెలియదు. అలాగే, ఒకే దశలో ఎన్నికలు చేయలేక 7 విడతల్లో, 40 రోజులపైగా ఎన్నికలు జరుపుతున్న పాలకులు ఒకేసారి ఎన్నికలు ఎలా చేయగలరన్నదీ సందేహమే!

ఒకరకంగా, 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' వల్ల అటు ప్రభుత్వానికీ, ఇటు పార్టీలకూ ఎన్నికల ఖర్చు తగ్గుతుందనే మాట నిజమే. అలాగే, కాస్తంత వ్యవధి తేడాతో మునిసిపల్, పంచాయతీ సహా అన్ని ఎన్నికలూ ఒకేసారి జరగడం వల్ల పాలనకు తరచూ అంతరాయాలు ఏర్పడవు. అయితే, ఈ విధానం మన సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందనేదీ అంతే వాస్తవం. ఇక, ఈ పద్ధతిలో రాష్ట్ర అసెంబ్లీలకు నిర్ణీత కాలవ్యవధి కన్నా ముందే మంగళం పాడి, ఆనక ప్రతి ప్రభుత్వానికీ నిర్ణీత వ్యవధిని నిర్ణయించడం ప్రజాస్వామ్య సిద్ధాంతాలకే విరుద్ధం. ఒకవేళ గనక ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా అర్ధంతరంగా కూలిపోతే, ఆ తర్వాత ఎన్నికైన ప్రభుత్వం ఆ వర్తమాన లోక్‌సభా కాలం ఉన్నంత వరకే అధికారంలో కొనసాగాలనడం మరో తిరకాసు. అన్నిటి కన్నా పెద్ద భయం మరొకటుంది. ఏకకాలంలో కేంద్ర, రాష్ట్రాల ఎన్నికల వల్ల ప్రాంతీయ, స్థానిక అంశాలను మింగేసి, జాతీయ అంశాలే పైకొచ్చే ప్రమాదం ఉంది. ఎన్నికల వ్యూహంలో, వ్యయంలో జాతీయ పార్టీలతో రాష్ట్ర స్థాయి పార్టీలు దీటుగా నిలబడడమూ కష్టమే. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు, ముఖ్యంగా చిన్న పార్టీలు కనిపించకుండా పోతాయని సమాజ్‌వాదీ పార్టీ లాంటివి బాహాటంగానే చెబుతున్నాయి.

నిజానికి, ఏకకాలపు ఎన్నికల వల్ల ఓటర్లలో 77 శాతం మంది కేంద్రంలో, రాష్ట్రంలో – రెండు చోట్లా ఒకే పార్టీకి ఓటేస్తారని 2015 నాటి ఓ సర్వే తేల్చింది. రెండు ఎన్నికల మధ్య ఆరు నెలల విరామం ఉంటే, 61 శాతమే అలా ఓటేస్తారట. అంటే ఒక రకంగా ఈ జమిలి ఎన్నిక కేంద్రంలో చక్రం తిప్పుతున్న పార్టీలకే వాటంగా మారవచ్చు. అసలు 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' అనే ఈ ఆలోచన వెనుక అసలు మతలబు... దేశంలో అధ్యక్ష తరహా పాలన తీసుకు రావాలన్న బీజేపీ ఆలోచన అని మరికొందరి వాదన. అందుకు రాజ్యాంగ సవరణలు సహా అనేకం అవసరం. దానికి తగ్గట్టే దీర్ఘకాలిక వ్యూహంతో బీజేపీ 400 పైచిలుకు సీట్లతో సంపూర్ణ మెజారిటీని కోరుతోందని విశ్లేషణ. అవతలి వారివి 'అనవసర భయాందోళనలు' అని కొట్టిపారేస్తే సరిపోదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకొనే ముందు మరింత విస్తృత స్థాయి సంప్రతింపులు జరపడం అవసరం. అంతేకానీ, డబ్బు ఆదా పేరిట ప్రజాస్వామ్య స్ఫూర్తినీ, సమాఖ్య స్వభావాన్నీ నీరు గార్చడం సమర్థనీయం కానే కాదు.

నేపాల్‌లో అధికార క్రీడ

విశ్లేషణ



మంజీవ్ సింగ్ పురీ

ఏడాదిన్నర కూడా కాకముందే నేపాల్‌లో మూడో ప్రభుత్వం ఏర్పాటైంది. విచిత్రమైన కూటములు జట్టుకట్టాయి, విడిపోయాయి, మళ్లీ ఒక్కటయ్యాయి. ఇందులో భారత్ అనుకూల, అననుకూల పార్టీలూ ఉన్నాయి. మూడు ప్రభుత్వాలకూ సారథిగా ప్రచండ ఉండటం విశేషం. కోవిడ్ –19 మహమ్మారి తర్వాత నేపాలీ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. తిరిగి పుంజుకునే సంకేతాలు ఎంతమాత్రమూ కనబడటం లేదు. ఇది ప్రజల్లో నిరుత్సాహానికి దారి తీస్తోంది. గతంలో ఉన్న రాచరికమే మంచిదని కొందరు భావిస్తున్నారు. కొన్ని వారాల క్రితం, ఖాట్మండులో రాచరికం అనుకూల ప్రదర్శన కూడా జరిగింది. ప్రస్తుత కూటమి అమరిక వల్ల, ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ తిరిగి సాధారణ ఎన్నికలకు రంగం సిద్ధం అయినట్టుగా కనబడుతోంది.

నేపాల్‌లో కేవలం 15 నెలల్లోనే మూడవ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆసక్తికరంగా, ఈ మూడు ప్రభుత్వాలకూ పుష్పకమల్ దహాల్ అలియాస్ ప్రచండ సారథ్యం వహించారు. 2022 నవంబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పార్టీ మావోయిస్ట్ సెంటర్ 30 స్థానాలతో ప్రతినిధుల సభలో మూడవ స్థానంలో నిలిచింది. 275 మంది సభ్యుల సభలో 88 స్థానాలతో నేపాలీ కాంగ్రెస్ మొదటి స్థానంలో, 78 స్థానాలతో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్- లెనినిస్ట్) లేదా సీపీఎన్–యూఎమ్ఎల్ రెండవ స్థానంలో నిలిచాయి. చీలిపోయిన ప్రజా తీర్పు ముఖ్యమైన స్థానాన్ని ప్రచండ పొందేలా అనుమతించింది.

మొదటిదే అయినప్పటికీ స్వల్పకాలంలోనే ముగిసిన కూటమి సీపీఎన్–యూఎమ్ఎల్, మావోయిస్టులకూ మధ్య ఏర్పడినది. ప్రచండకు ప్రధానమంత్రి పదవిని అందించిన తర్వాత, ఆయన నేపాలీ కాంగ్రెస్ వైపునకు మళ్లడంతో ఒక నెలలోనే ఆ కూటమి విచ్ఛిన్నమైంది. చిత్రంగా, అదే ప్రచండనీ, అదే సీపీఎన్–యూఎమ్ఎల్‌నీ మళ్లీ ఒకచోట చేర్చిన ప్రస్తుత కూటమిలో, మరో రెండు వామపక్ష అనుకూల పార్టీలు కూడా ఉన్నాయి. ఉపేంద్ర యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌బాదీలు (సోషలిస్టులు), మాజీ ప్రధాని మాధవ్ కుమార్ నేపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మాజీ సీపీఎన్–యూఎమ్ఎల్ సభ్యుల పార్టీ ప్రస్తుత ప్రభుత్వానికి మద్దతునిస్తున్నాయి.

ఈ కూటమిలోనే రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పీ) ఉండటం కొందరికి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ పార్టీకి 21 సీట్లున్నాయి. యువత ఆకాంక్షలను సమర్థించే, పశ్చిమ దేశాలకు అనుకూలంగా ఉండే ఒక వేదికగా ఈ పార్టీని చెప్పుకోవచ్చు. ఈ పార్టీ గతంలో మొదటి మావోయిస్టు... సీపీఎన్–యూఎమ్ఎల్ కూటమిలో భాగంగా ఉండేది. అంతకుముందు అమెరికన్ జాతీయుడైన రవీ లామిఛానే దాని నాయకుడు. ప్రస్తుత సంకీర్ణంలోని నలుగురు ఉప ప్రధాన మంత్రులలో ఆయన ఒకరుగా ఉన్నారు.

కోవిడ్ –19 మహమ్మారి కాలంలో నేపాలీ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. కానీ ఇతర దేశాల మాదిరిగా, తిరిగి పుంజుకునే సంకేతాలు ఎంతమాత్రమూ కనబడటం లేదు. ఇది ప్రజల్లో నిరుత్సాహానికి దారి తీస్తోంది. రాజకీయ వర్గం ఫలితాలు చూపని కారణంగా కొంతమంది గతంలో ఉన్న రాచరికమే మంచిదని కూడా భావిస్తున్నారు. కొన్ని వారాల క్రితం, రాజధాని నగరం ఖాట్మండులో రాచరికం అనుకూల ప్రదర్శన కూడా జరిగింది.

ఆర్థిక సమస్యలపై నేపాలీ కాంగ్రెస్ చాలా మొండితనంతో ఉందని ప్రచండ ఆరోపించారు. ఆ కారణంగా రాజకీయంగా తన మార్పును సమర్థించుకున్నారు. అయితే, ఐదుసార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన నేపాలీ కాంగ్రెస్ నాయకుడు షేర్ బహదూర్ దేవుబా నిరంతరం వేచివున్న ప్రధానమంత్రి స్థానంలో పరిభ్రమించడం ప్రచండ నిజంగానే భరించలేకపోయి ఉంటారు.



ప్రచండ



కేపీ శర్మ ఓలి



షేర్ బహదూర్ దేవుబా

కానీ సాంప్రదాయకంగా నేపాలీ కాంగ్రెస్‌తో వ్యవహరించడం సులభతరమని భారతదేశం గ్రహించింది. నేపాల్‌ను హిందూ రాజ్యంగా పునఃస్థాపించాలనే నేపాలీ కాంగ్రెస్ నాయకత్వానికి మావోయిస్టు–నేపాలీ కాంగ్రెస్ కూటమి కొంత ఓదార్పునిచ్చింది. 2015 రాజ్యాంగం నేపాల్‌ను లౌకిక దేశంగా ప్రకటించింది. అయితే, సీపీఎన్–యూఎమ్ఎల్ నాయకుడు అయిన కేపీ శర్మ ఓలి గతంలో కూడా హిందూ రాజ్యం పట్ల గానీ, నేపాల్‌లో 'సాంస్కృతిక' రాచరికం పట్ల గానీ విముఖంగా లేరని గమనించాలి. అయోధ్యలో రామ మందిర శంకుస్థాపనను నేపాల్ ఉత్సాహంతో స్వీకరించింది. ఇది హిందూ రాజ్యానికి మద్దతును పెంచుతుంది.

ప్రచండ కూడా సానుకూల పాత్రను పోషిస్తున్నట్లు కనిపిస్తున్నారు. సంవత్సరాల తరబడి తాను విడిచిపెట్టేసినటువంటి, హిందూ రాచరికంతో గుర్తింపు పొందిన నేపాలీ అధికారిక జాతీయ దుస్తులైన దౌరా సురువాల్‌ను ధరించారు. ఏమైనప్పటికీ, ప్రచండ పెంపకం వామపక్షంతో కూడుకున్నది. అది రాచరికానికి వ్యతిరేకమైనది. ఆయనకు ఇప్పుడు తనను తాను వెనక్కి తిప్పుకొనే, నేపాల్ గుర్తింపు రాజకీయాలను తిరిగి అక్కున చేర్చుకునే అవకాశం వచ్చింది. అంటే ప్రాథమికంగా భారతదేశం నుండి తనను తాను భిన్నంగా చూపుకోవడం. అందుకే ఆయన నేపాలీ కాంగ్రెస్‌తో విడిపోయినప్పుడు దానిని 'ప్రతీఘాత శక్తి' అని పేర్కొన్నారు.

నేపాల్‌లోని రాజకీయ చర్చల్లో దక్షిణ (భారతదేశానికి సూక్ష్మ నామం), ఉత్తర (చైనా సూక్ష్మ నామం) పాత్రలకు సంబంధించిన సూచనలు సర్వ సాధారణం. సుమారు గత రెండు దశాబ్దాలుగా పశ్చిమ దేశాలనూ (అమెరికా, యూరోపియన్ యూనియన్ మొదలైనవి), చర్చ్‌తో కూడుకున్న వారి ఎన్జీఓ భాగస్వాముల పాత్రనూ కూడా కొట్టిపారేయలేము. ఇవి మానవ హక్కులు, లౌకిక వాద ఆలోచనలను కలిగి ఉండి, తమవైన డైనమిక్స్‌ను కలిగి ఉన్నాయి. కొందరికి వామపక్ష కూటమిలో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ చేరిక ఉత్తరాది– పాశ్చాత్య కూటమి మధ్య సఖ్యతలా కనిపిస్తుంది.

చాలా మంది పరిశీలకులకు, తాజా అమరిక నేపాల్‌లో తదుపరి సాధారణ ఎన్నికలకు రంగం సిద్ధం చేసినట్టుగా కనబడుతోంది. కాకపోతే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉంది. అంత కాలం అవసరమైన ఓపికను ఓలీ ప్రదర్శిస్తారా అని చాలామంది అనుమానిస్తున్నారు. 2020లో, అధికార భాగస్వామ్య ఒప్పందం ఉన్నప్పటికీ ప్రచండకు ప్రధానమంత్రి పదవిని వదులుకోవడానికి ఆయన ఇష్టపడలేదు. ప్రచండ ఇప్పటికే ప్రజల్లో తన పట్టును కోల్పోయినందున, తన పాత కమ్యూనిస్ట్ సహచరులతో చేతులు కలపడమే ఏకైక మార్గం. సీపీఎన్–యూఎమ్ఎల్ మద్దతుదారుల నుండి మావోయిస్టులకు ఓటు బదిలీ అంత సులభం కానప్పటికీ, నేపాలీ కాంగ్రెస్ నుండి మావోయిస్టులకు బదిలీ చేయడం ఇంకా కఠినమైనది. కొత్త అమరిక చైనీయులు సంతోషించడానికి ఒక కారణాన్నిస్తుంది. అంతర్గత నేపాలీ రాజకీయ కోణం కూడా ఉన్నప్పటికీ, దాన్ని తీసుకురావడంలో వారి పాత్ర ఉంది.

భారతదేశం ఇప్పటివరకూ నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య, ఆర్థిక భాగస్వామి. పైగా దేశంలో ఆర్థిక తేజస్సుకు గేట్‌వే. నేపాల్‌కు దాని పెరుగుతున్న జలవిద్యుత్ ఉత్పత్తి అవసరాల నుండి ప్రయోజనాలను పొందేందుకు ఇది ఏకైక అర్థవంతమైన మార్గం. ఇటీవలి సంవత్సరాలలో సమీకృత చెక్ పోస్టుల నిర్మాణం, రైల్వే కనెక్టివిటీ అభివృద్ధి, విద్యుత్ సరఫరా లైన్లు, యూపీఐ లావాదేవీలకు వెళ్లడం వంటి వాటితో నేపాల్ కనెక్టివిటీకి భారత్ ఊతమిచ్చింది. వాస్తవానికి, నేపాల్‌కు చమురు సరఫరా చేయడానికి ఏర్పాటయ్యే పైప్‌లైన్, 900 మెగావాట్ల అరుణ్–3 ప్రాజెక్ట్ నిర్మాణంతో సహా చాలా ప్రాజెక్టులు ఓలీ 2018–19లో ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించారు.

నేపాల్‌లో, ఇండియా కార్డ్‌ను ప్లే చేయడం వల్ల అది ప్రజల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థ చాలా ముఖ్యమైనది. అనారోగ్యకరమైన ఆర్థిక స్థితి ఏ ప్రస్తుత ప్రధానమంత్రికీ మంచిది కాదు. సులభతరమైన వ్యాపారాన్ని మెరుగుపరచడం కోసం తీసుకునే చర్యలు భారతదేశం, నేపాల్ రెండింటి ప్రయోజనాలకు ఉపయోగపడుతాయి.

వ్యాసకర్త నేపాల్‌లో భారత మాజీ రాయబారి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇంకానా?



వీసా అప్లికేషన్ అనేది అత్యంత అమానవీయమైన, వినుగుపుట్టించే ప్రక్రియ. ఇండియా లాంటి దేశాలవారిపై వివక్షాపూరితంగా ఉంటున్నాయి. ఎలాగైనా మీ దేశాల్లో స్థిరపడటానికి జనాలు పడిచచ్చే రోజులు పోయాయి. మేము ప్రయాణిస్తాం, పని చేస్తాం, సెలవులు గడుపుతాం, డబ్బులు ఖర్చు చేస్తాం, మీ దేశపు ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేస్తాం. అయినా సరే మీరు మమ్మల్ని చూస్తున్న విధానం మీ దేశం ఎంత దారుణంగా ఉందో చూపుతోంది.

– హన్సల్ మెహతా, దర్శకుడు

గొప్ప క్షణం



ఆయన (విరాట్ కోహ్లి) వల్లే క్రికెట్ చూడటం మొదలుపెట్టాను. ఆయనలా కావాలని కలలు కంటూ పెరిగాను. రాత్రి నా జీవితంలో గొప్ప క్షణం. 'హాయ్ శ్రేయాంకా! బౌలింగ్ బాగా చేశావు' అన్నారు. ఆయనకు నిజంగా నా పేరు తెలుసు!

– శ్రేయాంకా పాటిల్, క్రికెటర్

ఇప్పుడేమంటారో?



కార్నెల్‌లో (యూనివర్సిటీ) 1985లో నేను సీనియర్‌గా ఉన్నప్పుడు రోడ్స్ స్కాలర్‌షిప్ కోసం అప్లై చేశాను. 'ఏఐ'(కృత్రిమ మేధ)ని ఒక వినోదాత్మక కాల్పనిక పాత్రగా సృష్టిద్దామనుకుంటున్నానని చెప్పాను. నన్ను ఇంటర్వ్యూ చేసిన హ్యూమానిటీస్ ప్రొఫెసర్ల స్తబ్ధత నాకు ఇంకా గుర్తుంది. వాళ్లకు ఆ ఆలోచన నచ్చనే లేదు.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

శుభాకాంక్షలు



ప్రపంచ వ్యాప్తంగా నౌరోజ్ (పార్శీల నూతన సంవత్సరం) జరుపుకొంటున్న అందరికీ హార్దిక శుభాకాంక్షలు. మీకు ఏడాది పొడవునా సమృద్ధిగా చిగిర్చే వసంతాలు, శాంతి, భద్రత కలగాలి.

– షేక్ మొహమ్మద్, దుబాయ్ పాలకుడు

దేవుడా!



నీకున్న ఏకైక సోదరుడు ఫోన్ చేసి, 'నా శరీరాన్ని బాగు చేయడానికి నాకు చేయాల్సిన అన్ని చికిత్సలు చేశామని డాక్టర్లు చెప్పారు. ఇంక చేయడానికేమీ లేదు. నాకు ఈ భూమ్మీద ఇంక మూడు నెలలే ఉంది' అని చెబితే నిజంగా ఏం చెప్పాలో తెలీదు.

– మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

వైజ్ఞానిక వేగుచుక్కలు

వైద్య విద్యలో వివక్ష

ఆధునిక భారతదేశంలో వైద్య శాస్త్రంతోపాటు అన్ని విజ్ఞాన శాస్త్రాలు ఎలా వికసించాయో అధ్యయనం చేయాలంటే నేపథ్యంగా సంభవించిన కీలక సంఘటనలను సూక్ష్మంగా పరిశీలించాలి. అప్పట్లో బ్రిటిష్ పాలనలో భారతదేశం ఉంది కనుక, అక్కడి చారిత్రక వాతావరణం, వారి విధానాలు మన దేశాన్ని కూడా ప్రభావితం చేశాయి. తొలుత వైద్యానికి సంబంధించి ఆ సమాజం ఎలా ఉందో, ఎలా ప్రతిస్పందించిందో చూడాలి.



మద్రాసు మెడికల్ కళాశాల

1869లో ఎడిన్‌బరో యూనివర్సిటీ మెడికల్ స్కూల్‌కు ఐదుగురు మహిళలు తొలిసారి ప్రవేశం కోసం దరఖాస్తు చేశారు. వారే సోఫియా జెక్స్ బ్లాక్, ఎడిత్ పెచాయ్, మెటిల్డా చాప్లిన్, హెలెన్ ఎవాన్స్, ఇసబెల్ థోర్న్. పురుష విద్యార్థుల కన్నా రెట్టింపు రుసుం విద్యార్థినులు చెల్లించి ప్రవేశం పొందారు. ఈ ఐదుగురిలో ఎడిత్ పెచాయ్ రసాయన శాస్త్రంలో అత్యంత ప్రతిభ కనబరిచి హోప్ స్కాలర్షిప్ పొందే స్థాయి గడించారు. ఎడిన్‌బరో విశ్వవిద్యాలయం మెడికల్ స్కూల్లో స్త్రీలు, యువతులు ప్రవేశం పొందడమే చట్ట విరుద్ధం అని అప్పట్లో పత్రికలూ వాదించాయి. ఫలితంగా ఉత్తమంగా ప్రతిభ కనపరిచిన మహిళా విద్యార్థికి కాకుండా రెండవ స్థానంలో నిలిచిన పురుష విద్యార్థికి ఆ హోప్ స్కాలర్షిప్ బహూకరించారు. ఆ ఐదుగురు తొలి మహిళా విద్యార్థులు దీనికి నిరసనగా ఐర్లాండ్, బెర్న్, డబ్లిన్, స్విట్జర్లాండ్ విశ్వవిద్యాలయాలకు వెళ్లి అక్కడ వైద్య పట్టాలు పొందారు.

ఈ సంఘటన తర్వాత 1874లో డా॥ ఎలిజబెత్ గ్యారెట్ ఆండర్సన్ చొరవ తీసుకొని 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమెన్' ప్రారంభించారు. ఫలితంగా వైద్య శాస్త్రం అభ్యసించడానికి, పిమ్మట ప్రాక్టీస్ ప్రారంభించడానికి తగిన అవకాశాలు ఇంగ్లాండ్ మహిళలకు లభించడం మొదలైంది. అయితే వారి చదువు పూర్తయిన తర్వాత ఆసుపత్రుల్లో కీలక స్థానాలు కాకుండా చిన్న చిన్న హెల్త్ సెంటర్లలో లేదా సబార్డినేట్ ఆసుపత్రుల్లో మాత్రమే వారికి ఉద్యోగావకాశాలుండేవి. ఆ రకంగా ప్రొఫెషనల్‌గా కూడా మహిళా వైద్యులు పురుష ప్రపంచం కారణంగా తీవ్ర వివక్షకు, దోపిడీకి గురయ్యారు.

బ్రిటన్‌లో పురుషులే వైద్యం చేయాలనే అంధ సంప్రదాయముంటే; వారి వలస దేశమైన ఇండియాలో మహిళా రోగి (మగ) డాక్టర్ కంట పడకూడదనే అర్థం లేని పరదా ఆచారం రూపంలో బలపడి ఉంది. చావడానికైనా సిద్ధమే కానీ ఘోషా తీసి తమ రోగం నయం చేసుకోవడానికి ఆనాటి మన సమాజపు మహిళలు సుముఖంగా లేరు. కాన్పు సమయంలో స్త్రీలు బతికి బట్ట కట్టడం అనేది మరుజన్మ వంటిదనడానికి ఇదే కారణం! మన దేశంలోని అధ్వాన్నమైన ఆరోగ్య పరిస్థితులూ, ఎక్కువ సంఖ్యలో పసికందుల మరణాలూ ఆనాటి బ్రిటిష్ పాలకులకు ఆందోళన కలిగించాయి.

ఈ నేపథ్యంలో లక్నోకు 100 మైళ్ళ దూరంలో ఉండే 'పన్నా' సంస్థానపు రాణి అనారోగ్యం కారణంగా రాజు తీసుకున్న నిర్ణయమూ, ఆయన రాణి చేసిన చొరవల కారణంగా భారతదేశంలో వైద్య వసతులు పెరిగాయి. అందువల్లనే 1835లో వైద్య విద్యా సంస్థ 'మద్రాస్ మెడికల్ కాలేజ్' ఏర్పడింది. అయితే ఇది సంభవించడానికి ముందు మరెన్నో కీలకమైన మలుపులు కూడా ఉన్నాయి.

– డా॥ నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

'పొత్తు'గడలతో ఓట్లు రాలేనా?

అభిప్రాయం



డా॥ జి. నవీన్

కేవలం రాజకీయ ఎత్తుగడలతోనే 40 ఏళ్ల కెరీర్‌ను గడిపిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు పొత్తులను, చిలక పలుకులను ఆశ్రయించారు. తన వందిమాగధులయిన బాకా మీడియా సంస్థలు విశ్వసనీయతను కోల్పోయిన విషయాన్ని గమనించినట్టున్నారు. అందుకే ఇప్పుడు కొత్తగా పేరెన్నికగన్న ప్రశాంత్ కిషోర్ ద్వారా దుష్ప్రచారానికి తెర లేపారు.

ప్రశాంత్ కిషోర్ లాంటి ఎన్నికల వ్యూహకర్తలు పుట్టక మునుపు నుంచి ప్రజల నాడి తెలిసిన జన నేతలు ఎన్నికలు గెలుస్తున్నారు. 1994లో ఎన్టీఆర్, అదే విధంగా 2004లో వైఎస్సార్ విజయదుందుభి మోగించింది స్వబలం ఆధారంగానే. క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రశాంత్ కిషోర్ చేపట్టిన వ్యూహకర్త కార్యక్రమాలు అప్పటికే గెలుపు గుర్రాలయినవారికి ఉపయోగపడ్డాయి తప్ప ఈయనవల్ల, ఓడిపోయే నాయకులు గెలుపు చేజిక్కించుకొన్న సందర్భం అయితే లేదు. ఇంతటి ప్రశాంత్ కిషోర్ ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కి వ్యూహరచన చేపట్టి బొక్క బోర్లా పడిన సందర్భం మరిచిపోరాదు.

పొత్తుల విషయానికి వస్తే చంద్రబాబు చరిత్ర చర్విత చర్వణమే. 1999 నుంచి చూస్తే ఆయన పోటీ చేసిన అయిదు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో గెలిచింది రెండు మాత్రమే. ఆ రెండింటిలో కూడా పొత్తులే ఆయన్ని గట్టెక్కించాయి. 1999లో కార్గిల్ యుద్ధ నేపథ్యంలో బీజేపీ ఖాతాలోని దేశభక్తి ఓటు ఈయనకి ఉపయోగపడితే, 2014లో మోదీ గాలి, పవన్ కల్యాణ్ నటనా శౌర్యం తోడై విడిపోయిన రాష్ట్రానికి పండిపోయిన అనుభవజ్ఞుడు అవసరమనే తప్పుడు వాదనను ముందుకు తెచ్చి గద్దెనెక్కారు. పొత్తు లేకుండా ఆయన పోటీ చేసిన ఎన్నికలు కేవలం 2019 మాత్రమే. ఈ 25 ఏళ్ల ఘన చరిత్ర మనకు చెబుతున్న పాఠం ఏమిటంటే... పొత్తులు అన్ని వేళలా పని చేయవు. కాలం గడిచే కొద్దీ స్వప్రయోజనాలకోసం ఇష్టానుసారం భిన్న ధ్రువాలలాంటి శక్తులతో చేతులు కలుపుతూ పోతే రెంటికి చెడ్డ రేవడి కావడం తథ్యం.

బీజేపీని అలౌకిక పార్టీగా తూర్పార బట్టి అయిదు ఏళ్ళు కూడా నిండక మునుపే మళ్లీ దానితోనే పొత్తుపెట్టుకున్నారు. అయితే మునుపటి (1999, 2014) ఫలితాలు మళ్ళీ సాధిస్తారా అనేది ప్రశ్న. ఈ సారి వీరి ప్రయాణం నల్లేరు మీద బండి నడక కాదనే చెప్పాలి. ఎందుకంటే



'సిద్ధం' సభల్లో జనసందోహం

గతానికీ, ఇప్పటికీ తేడా ఏమంటే ఇప్పుడు టీడీపీ – జనసేన – బీజేపీ త్రయం, ఒక పూర్తి కాలం పనిచేసి జనాదరణ పొందిన జగన్ ప్రభుత్వాన్ని ఎదుర్కొంటుంది. ఇదే పరిస్థితి 2009లో చంద్రబాబుకి వచ్చింది. అప్పటి వైఎస్సార్ పార్టీ ప్రభుత్వం సంక్షేమం ద్వారా ప్రజల్లో బలంగా పాతుకుపోయింది. అందుకే చంద్రబాబు మహా కూటమి ఏమీ చేయలేకపోయింది. అయితే కొంతమంది దీనికి 'ప్రజారాజ్యం' పార్టీ కారణం అని అనుకున్నా నిజానికి చిరంజీవికి పడిన ఓటు కోస్తా జిల్లాల్లోని పీడిత వర్గాల ఓటు. తాము ఇలవేలుపుగా భావించే రంగా హత్యానంతరం సాంప్రదాయకంగా టీడీపీని వ్యతిరేకిస్తూ వచ్చిన కాపు ఓటు. అది దృష్టిలో పెట్టుకొనే చంద్రబాబు 2014 కల్లా పవన్ కల్యాణ్ అంటే పెనుప్రేమ చూపించే కాపు వర్గాన్ని బుట్టలో వేసుకోడానికి జనసేనను అక్కున చేర్చుకున్నారు. తద్వారా ఒక అసహజ పొత్తుకు ప్రాణం పోశారు.

2014 ఎన్నికల అనంతరం పవన్ కల్యాణ్ తనను నమ్ముకున్న వర్గాలకు కాని, వ్యక్తులకు కాని ఏ మాత్రం సాయపడలేకపోయారు. ఇటు రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం ద్వారా కానీ, అటు కేంద్ర ప్రభుత్వం ద్వారా కానీ రాష్ట్రానికి ఒక్క మేలు కూడా చేయలేకపోయారు పవన్ కల్యాణ్. పైపెచ్చు ఆయనే బీజేపీ మన రాష్ట్రానికి 'పాచిపోయిన లడ్డూలు' ఇచ్చింది అని 2019 ఎన్నికలకు ముందు కోడై కూశారు. అలాంటిది మళ్ళీ ఏ విధంగా ఇప్పుడు ఈ త్రయం ఒకటిగా సభలు నిర్వహిస్తారో వారికే తెలియాలి.

ఒకవైపు నేరుగా నగదు బదిలీతో జగన్ పేదలకు వినూత్న సాయం అందజేసి దానిని పెట్టుబడిగా భావిస్తుంటే... ఓటు బదిలీని పెట్టుబడిగా పరిగణిస్తూ టీడీపీ – బీజేపీ – జనసేన త్రయం ఇప్పుడు బరిలోకి దిగుతున్నది. 2019లో జనసేన... బీఎస్పీ, కమ్యూనిస్ట్ పార్టీలతో పొత్తు పెట్టుకొని పోటీ చేసి సుమారు 5–6 శాతం ఓటు దక్కించుకున్నది. బీజేపీ అయితే సొంతంగా పోటీ చేసి 'నోటా' కంటే తక్కువ ఓటు శాతాన్ని తెచ్చుకొంది. దీనిని కొలమానంగా తీసుకొంటే టీడీపీకి పడిన 39 శాతానికి వీరి ఓట్లు జత అయినా కూడా జగన్ దరిదాపులకు చేరలేరు.

స్థూలంగా విషయమేమిటంటే పొత్తుల జిత్తులూ, వ్యూహకర్తల విషపు పలుకులూ ప్రజలను ఏమార్చబోవు.

వ్యాసకర్త సామాజిక ఆర్థికాంశాల విశ్లేషకుడు (యూఎస్ఏ)

మౌనం సర్వార్థ సాధకం

మౌనం అంటే ఏమిటి? ఏమీ మాట్లాడకుండా ఉంటే మౌనమైపోతుందా? బయటకి పెదవులు కదపకుండా, లోపల మనసుతో మనం మాట్లాడుతూనే ఉంటాము. అది నిజమైన మౌనం కాదు. కాని, బాహ్య మైన మౌనం కూడా అవసరమే. తమ మాటకి విలువ లేనపుడు మనిషి మౌనం వహించటమే మంచిది. మాట, మౌనం రెండూ మనిషికి ముఖ్యమైనవే. మనిషిని ఉన్నతంగా నిలిపేవే. తక్కువ మాట్లాడు, ఎక్కువ పని చేయి అన్నది ఒక లోకోక్తి.

ఎక్కడ తక్కువ మాట్లాడాలి అన్నది కూడా అవసరమే! గురువు, పెద్దల దగ్గర ఎక్కువ మాట్లాడకూడదు. వారందించే జ్ఞాన సంపదను మౌనంగా గ్రహించాలి. మౌనం మనని మనకు దగ్గర చేస్తుంది. రోజూ నియమంగా కొంత సమయం మౌనంగా ఉండటం అలవాటు చేసుకుంటే మానసిక ఆనందం, దేహారోగ్యం, ఆలోచనలపై నియంత్రణ సిద్ధిస్తాయి. మౌనం ఒక తపస్సు. ఆధ్యాత్మిక సాధనలో మౌనానికే ప్రాధాన్యత.



జ్యోతిర్మయం

ఒక్కొక్కసారి మాటలలో చెప్పలేని అభిప్రాయం మౌనం బాగా వ్యక్తం చేస్తుంది. సీతారాముల వనవాస సమయంలో దండకారణ్యంలో, భర్తను దైవంగా భావించే ఋషుల సతులు తమ మహిమతో వారి భర్తలకు శ్రీరాముని రూపాన్నిచ్చి, వీరిలో నీ అసలు రాముడెవరో తెలుపమన్నారు. సీతమ్మ మౌనంగా చూస్తూ ఉండిపోయింది. వారు ఒక్కో రాముని ఆమె ముందు నిలబెట్టి ఇతడేనా అని అడుగుతుంటే సీతమ్మ తల అడ్డంగా తిప్పేది. చివరకు అసలు రాముని నిలబెట్టగా ఆమె చిరునవ్వుతో తల వంచుకుని మౌనం వహించింది. అక్కడ సీతా దేవి మౌనమే పూర్తి సమాధానం.

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మెహెర్ బాబా తన ఆధ్యాత్మిక ప్రయాణంలో నలభై నాలుగు సంవత్సరాలు మౌన దీక్షలో ఉన్నారు. బయటకు మౌనంగా ఉండటమే కాక లోపల కూడా నిశ్శబ్దంగా ఉండాలి. ఆ మౌనం మనసు పొరల దాకా చేరుకోవాలి. ఆలోచనలను మనసు నుండి పూర్తిగా పరిహరించటం ద్వారా దీన్ని సాధించవచ్చు. ఎలాంటి కదలిక లేని నిశ్చల స్థితి మనో మౌనం. ఇది చాలా గొప్పది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.ద్వాదశి తె.5.25 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి త్రయోదశి, నక్షత్రం: ఆశ్లేష రా.2.22 వరకు, తదుపరి మఖ, వర్జ్యం: ప.2.16 నుండి 4.00 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.07 నుండి 10.55 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, అమృత ఘడియలు: రా.12.45 నుండి 2.26 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.06.

క్లుప్తంగా...

ఎన్నికల పెండింగ్ బిల్లులను విడుదల చేయండి

- సీఈఓ వికాస్‌రాజ్‌కు డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్ల వినతి



ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న లచ్చిరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కోరాయి. ఈ మేరకు బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల బిల్లులకు సంబంధించిన బడ్జెట్ మంజూరైనప్పటికీ నేటికీ బిల్లులు ఇవ్వలేదని, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ కూడా వచ్చిన నేపథ్యంలో పాత బడ్జెట్ వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్లకు సంబంధించిన వాహనాల అద్దెబిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయని, ఆర్థిక సంవత్సరం ముగియక ముందే పాత బిల్లులను క్లియర్ చేయాలన్నారు. వికాస్‌రాజ్‌ను కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ ఉన్నారు.

ఐటీ, ఫార్మా, టూరిజంలో భారత్ మేటి

- నగర సందర్శనలో ఐరోపా మీడియా ప్రతినిధుల ప్రశంస

సాక్షి, హైదరాబాద్: ఐటీ, ఫార్మా, టూరిజం, అంతరిక్ష పరిశోధనలలో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఉందని మధ్య ఐరోపా దేశాల మీడియా ప్రతినిధులు ప్రశంసించారు. వివిధ దేశాల మధ్య విద్య, వాణిజ్యం, సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరిచే ఉద్దేశంతో హైదరాబాద్‌కు వచ్చిన 12 ఐరోపా దేశాలకు చెందిన 22 మంది మీడియా ప్రతినిధులు 17 నుంచి నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా విదేశీ మీడియా ప్రతినిధుల బృందం గోల్కొండ కోట, శిల్పారామం, భారత్ బయోటెక్, టీహబ్, టీ–వర్క్స్, స్కైరూట్ ఎరోస్పేస్ కంపెనీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించింది. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల ప్రత్యేక కమిషనర్ ఎం.హన్మంతరావు రాష్ట్రంలోని మీడియా ప్రతినిధుల బృందం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను రూపొందించారు. రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విదేశీ మీడియా బృందం పర్యటన సాగింది. అల్బేనియా, క్రొయేషియా, సైప్రస్, చెక్ రిపబ్లిక్, ఎస్టోనియా, ఫిన్లాండ్, లాట్వియా, లిథువేనియా, పోలెండ్, రొమేనియా, సెర్బియా, స్లోవేకియా దేశాలకు చెందిన మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నారావు పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: తనపై అక్రమంగా ఆదిభట్ల పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నకొడుకు కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ వద్ద 2 ఎకరాల ప్రైవేట్ భూమిని కబ్జా చేశారంటూ మార్చి 3న కన్నా రావుపై ఓఎస్ఆర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఐపీసీ 307, 447, 427, 436, 148, 149 సెక్షన్ల కింద హత్యాయత్నం, నేరపూరిత చొరబాటు, నష్టం కలిగించడం, పేలుడు పదార్థాలను ఉపయోగించడం, అల్లర్లకు పాల్పడినందుకు కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలు అవాస్తమని.. తనపై హత్యాయత్నం, భూ ఆక్రమణ ఆరోపణలపై ఆదిభట్ల పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కన్నారావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణచే పట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన..కన్నారావు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ ఇదే కేసులో నిందితులు జె.సురేందర్‌రెడ్డి, జె.హరినాథ్ దాఖలు చేసిన మరో రెండు పిటిషన్లను కూడా న్యాయమూర్తి కొట్టివేశారు.

మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ కార్యాలయాల్లో డీసీఏ దాడులు

సాక్షి, హైదరాబాద్: నగరంలోని ఆరు మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ కార్యాలయాల్లో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు వరుసగా దాడులు నిర్వహించారు. ఈ డిస్ట్రిబ్యూటర్ల వద్ద భారీ మొత్తంలో ఇన్సులిన్ ఇంజెక్షన్లను గుర్తించారు. ఇవన్నీ ఢిల్లీ నుంచి దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. అయితే వీటికి సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పాటు, హైదరాబాద్ మార్కెట్‌లో వీటిని గరిష్ట చిల్లర ధర కంటే 40 శాతం తక్కువకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అత్యంత తక్కువ ధరకు విక్రయించడం, బిల్లులు లేకుండా దిగుమతి చేసుకోవడం తదితర కారణాల కింద కేసు నమోదు చేసిన అధికారులు రూ.51.92 లక్షల విలువైన స్టాకును సీజ్ చేశారు.

‘టీజీ’ స్మార్ట్ కార్డులేవీ?

- వారంరోజులుగా ఆగిపోయిన ఆర్‌సీ, లైసెన్స్ చిప్ కార్డులు, నంబర్ ప్లేట్స్
- సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కోసమే అంటున్న రవాణాశాఖ సిబ్బంది
- ఇన్ని రోజులు సమయం తీసుకోవటంపై అనుమానాలు



సాక్షి, హైదరాబాద్: వాహనాల నంబర్ ప్లేట్లపై రాష్ట్ర కోడ్ టీఎస్ నుంచి టీజీగా మారింది. ఈనెల 15 నుంచి రిజిస్టర్ అయ్యే వాహనాలకు టీజీ సీరీస్ కేటాయిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది.. కానీ రోజుకు దాదాపు 10 వేల వరకు కొత్త వాహనాలు రాష్ట్రంలో రోడ్డెక్కుతాయి. ఇప్పటి వరకు ఏ వాహనానికి కూడా టీజీ సీరీస్ ఆర్‌సీబుక్ గానీ, కొత్త లైసెన్సు స్మార్ట్‌కార్డు గానీ జారీ కాలేదు. అయితే దీనిపై రవాణాశాఖ ఎక్కడా స్పష్టత ఇవ్వకపోవటం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. స్మార్ట్ కార్డుల జారీ బాధ్యత ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకొని, చిప్‌తో కూడి కార్డు సరఫరా చేస్తారు. గత ప్రభుత్వ హయాంలో వీటికి సంబంధించి ఒప్పందాలు జరిగాయి. అయితే ఇప్పుడు ఉన్నట్టుండి వాటి జారీ ఆగిపోయింది.

చార్జీల వసూలు సరే...

ఆర్‌సీ, నంబర్ ప్లేట్, లైసెన్స్ బట్వాడా పేరిట చార్జీలు వసూలు చేస్తున్న రవాణాశాఖ వాటిని వారంరోజులుగా ఇవ్వకపోవడంపై వాహనదారులు షోరూమ్ నిర్వాహకులనో, రవాణాశాఖ అధికారులనో ప్రశ్నిస్తే.. సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో ఆమేరకు మార్పు చేయాల్సి ఉందని, అందుకే కొంత జాప్యం జరుగుతోందన్నారు. రెండుమూడు రోజుల్లో వాటి బట్వాడా మొదలవుతుందని చెబుతున్నారు. వాహనాల రాష్ట్ర కోడ్ మారినందున సాఫ్ట్‌వేర్‌ను కూడా యుద్ధప్రాతిపదికన మార్చాలి. ఈనెల 15 నుంచి రాష్ట్ర కోడ్ మారుతుందని రవాణాశాఖకు స్పష్టమైన అవగాహన ఉంది. వెంటనే సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయొచ్చు. కానీ వారం రోజులు గడుస్తున్నా అప్‌డేట్ కాలేదని పేర్కొంటుండటం విచిత్రంగా ఉంది. రాష్ట్ర కోడ్ మార్పు అమలులోకి రావటానికి మూడు రోజుల ముందు నుంచే కార్డుల జారీ నిలిచిపోయిందని తెలుస్తోంది. ఇన్ని రోజులుగా సాఫ్ట్‌వేర్‌ను ఎందుకు అప్‌డేట్ చేయటం లేదో..ఎందుకు జాప్యం జరుగుతోందో సమాచారం లేదు. దీనిపై ఉన్నతాధికారులు కూడా స్పందించటం లేదు. ఆర్‌సీ, లైసెన్స్ స్మార్ట్‌కార్డులు లేక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు తనిఖీ చేస్తే డౌన్‌లోడ్ చేసుకున్న పత్రాలను చూపండి అంటూ రవాణాశాఖ సిబ్బంది సలహా ఇస్తున్నారు. కానీ, రాష్ట్ర సరిహద్దులు దాటే చోట ఉండే చెక్‌పోస్టుల్లో సిబ్బంది ఆ కాగితాలను పరిగణనలోకి తీసుకోవటం లేదని, చిప్ ఉన్న స్మార్ట్ కార్డులే చూపాలని పేర్కొంటున్నారని వాహనదారులు చెబుతున్నారు.

పెన్షనర్ల ఆత్మీయ సమ్మేళనానికి సీఎంకు ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న పెన్షనర్ల ప్రతినిధులు. చిత్రంలో రేణుకా చౌదరి, తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థాయి పెన్షనర్ల ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆహ్వానించింది. ఈమేరకు బుధవారం సీఎం నివాస గృహంలో సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. నగరంలో ఏర్పాటు చేయనున్న పెన్షనర్ల ఆత్మీయ సమ్మేళనానికి సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం సానుకూలంగా స్పందించి వచ్చే నెల మొదటి వారంలో సమయం కేటాయించేందుకు హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అలాగే పలు సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సానుకూలత వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, పెద్దలు సీతారామయ్య, సుదర్శన్‌రెడ్డి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గు పూజారుల ఘర్షణ



గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న భక్తులు

- రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు
- పది మందికి తీవ్ర గాయాలు
- రేకులకుంట మల్లన్న ఆలయం వద్ద ఉద్రిక్తత
- సిద్దిపేట జిల్లాలో ఘటన

దుబ్బాకటౌన్: సిద్దిపేట జిల్లాలో ఒగ్గు పూజారులు ఘర్షణ పడ్డారు. రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని రేకులకుంట మల్లన్న ఆలయం వద్ద బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ప్రసిద్ధి చెందిన రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయం వద్ద.. పూజల విషయమై ఒగ్గు పూజారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పూజారులు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకోవడంతో 10 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర భయందోళనకు గురయ్యారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ గంగరాజు పోలీసు బలగాలతో అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. గాయపడ్డ వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

పూజల విషయమై కొన్నేళ్లుగా వివాదం..

రేకులకుంట మల్లన్న ఆలయంలో కొన్నేళ్లుగా ఒగ్గు పూజారుల మధ్య పూజల విషయమై వివాదం నెలకొంది. చెరుకూరి వంశానికి చెందిన 26 మంది, కోటి వంశంవారు 22 మంది, పయ్యావుల వంశం వాళ్లు 10 మంది పూజలు చేయడంతోపాటు పట్నాలు వేస్తున్నారు. ఈ క్రమంలో పయ్యావుల వంశం పూజారులు తాము 10 మందిమే ఉన్నామని, మరో 10 మందికి అవకాశం ఇవ్వాలని కోరడంతో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో పయ్యావుల వంశం వారు దేవాదాయ శాఖ నుంచి కొత్తగా 10 మంది పూజలు చేసేందుకు అనుమతి తెచ్చుకున్నారని ఈఓ తెలిపారు. దీంతో బుధవారం సాయంత్రం ఆలయం వద్ద పూజలు చేస్తున్న కొత్తవారిని పాత పూజారులు నిలదీయంతో ఘర్షణ మొదలైంది. పరిస్థితి చేయిదాటిపోయి దాడులకు దిగారు. ఈ ఘటనతో ఆలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. దాడుల విషయంలో పూజారులు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

ప్రణీత్‌రావు పిటిషన్‌లో తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తన విచారణ జరగడం లేదంటూ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలు ముగించిన హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. కస్టడీ సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించడం లేదని, పీఎస్‌లో నిద్రపోవడానికి సరైన సౌకర్యాలు లేవని, విచారణ పూర్తయిన తర్వాత తిరిగి జైలుకు తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరడంతోపాటు పోలీస్ కస్టడీ ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రణీత్ హైకోర్టులో సవాల్ చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. ‘24 గంటలూ ప్రణీత్‌రావును పోలీసులు విచారిస్తున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం .. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విచారించాల్సి ఉన్నా.. దాన్ని పాటించడంలేదు. ప్రణీత్ పరువుకు నష్టం కలిగించేలా అధికారులు వివరాలు మీడియాకు లీక్ చేస్తున్నారు’ అని చెప్పారు. అనంతరం పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. ‘పిటిషనర్ న్యాయవాది వాదనలు సరికాదు. 2023లో అక్రమంగా ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేశారు. ఇది చాలా తీవ్ర నేరం. నిబంధనల మేరకే ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేస్తోంది. సాక్ష్యాలను అందించేందుకే రమేశ్ విచారణ జరిగే ప్రాంతానికి వచ్చారు తప్ప.. విచారణలో పాల్గొనలేదు’ అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పును రిజర్వు చేశారు. గురువారం తీర్పు వెల్లడించే అవకాశం ఉంది.

చోరీ చేసిన వాహనంపై పారిపోతూ.. రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నాగోలు: చోరీ చేసిన ద్విచక్ర వాహనంపై పారిపోతున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం ప్రాంతానికి చెందిన గోపి కృష్ణ (30) పలు దొంగతనం కేసుల్లో నిందితుడు. ఖమ్మం పరిసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇతనిపై పలు దొంగతనం కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాత్రి వనస్థలిపురం–సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో ఓ ఇంట్లో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి అదే వాహనంపై పారిపోతూ రాత్రి 1:40 గంటల సమయంలో ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్తూ..ఎదురుగా వచ్చిన ఓ మినీ ట్రక్‌ను బలంగా ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలంలో పడిపోయిన ద్విచక్ర వాహనాన్ని బండి యజమాని వచ్చి తీసుకెళ్లినట్లు సమాచారం. మృతి చెందిన వ్యక్తి వద్ద ఆధారాలతో ఖమ్మం పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

ఇన్‌చార్జి డీఎంఈ నియామకం చెల్లదు

- నిబంధనలకు విరుద్ధమంటూ జీవోను నిలిపివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణిని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996లోని రూల్ 10(హెచ్) నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఫిబ్రవరి 19న ఇచ్చిన జీవో చెల్లదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఇదే హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం 2017, డిసెంబర్ 20న ఇచ్చిన ఆదేశాలకు కూడా ఇది విరుద్ధంగా ఉందని చెప్పింది. హైకోర్టు మరో కేసులో ఇచ్చిన తీర్పు ఆధారంగా పిటిషనర్ (డాక్టర్ ఏ.నరేంద్రకుమార్) డీఎంఈగా పదోన్నతికి అర్హుడని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో వైద్యా రోగ్య శాఖ జారీ చేసిన జీవో 63ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, నిబంధనలు పాటిస్తూ డీఎంఈ పోస్టును భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇన్‌చార్జి డీఎంఈగా వాణిని నియమించడాన్ని సవాల్‌చేస్తూ వనపర్తి ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్ దాఖలుచేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పీవీ కృష్ణయ్య వాదనలు వినిపిస్తూ.. ‘డీఎంఈ పోస్టుకు సీనియారిటీ ప్రకారం డాక్టర్ కె.శివరామప్రసాద్, పిటిషనర్ (నరేంద్ర కుమార్).. ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నారు. పిటిషనర్ డీఎంఈ పోస్టుకు అర్హుడు. కానీ ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా మూడో స్థానంలో ఉన్న వ్యక్తిని ఇన్‌చార్జి డీఎంఈగా నియమించారు. ఈమెకు ముందు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన డా. త్రివేణి కూడా తాజా సీనియారిటీ జాబితాలో 11వ స్థానంలో ఉన్నారు. తన పదోన్నతిని పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని గతంలో ఇదే కోర్టులో పిటిషనర్ మరో పిటిషన్ కూడా వేశా రు. పిటిషనర్ పేరును పరిశీలించాలని ప్రభుత్వానికి న్యాయమూర్తి ఆదేశాలు కూడా ఇచ్చారు’ అని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జీవోను తాత్కాలికంగా నిలిపివేశారు.

మంచిర్యాల జిల్లాలో వడగళ్ల వాన



దండేపల్లి మండలం వెంకటాపూర్ వద్ద రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్టు

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం, దండేపల్లి మండలాల్లో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. జన్నారం మండలంలోని చింతగూడ, మహ్మదాబాద్, తిమ్మాపూర్, రాంపూర్, తపాలపూర్ గ్రామాల్లో వడగళ్లతో 15 ఎకరాల మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. దండేపల్లి మండలంలో పలు చోట్ల గాలికి చెట్లు విరిగి పడ్డాయి. మేదరిపేట, చింతపల్లి, తాళ్లపేట వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో 250కి పైగా ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది.


ప్రతీ రైతును ఆదుకుంటాం: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన పంటల వివరాల కోసం సర్వే చేసి నివేదిక సమర్పించాలని వ్యవసాయశాఖ కార్యదర్శిని ఆదేశించామని, నివేదిక అందిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కష్టకాలంలో ఉన్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, పంట నష్టంపై సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం అవుతామని, అన్ని విషయాలు సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా ఉత్తుత్తి మాటలు, పథకాలు ప్రకటించబోమని తుమ్మల చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ రైతుల పక్షపాత ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. గోదావరి వరదల సమయంలో 100 శాతం నష్టపోయినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. నీళ్లు అవసరంలేని సందర్భాల్లో కూడా కాలువలకు నీళ్లు విడుదల చేసి వృథా చేశారని, ఇప్పుడు నాగార్జునసాగర్ మొదటి పంటకే నీళ్లు ఇవ్వని దుస్థితికి తెచ్చారని తుమ్మల మండిపడ్డారు.

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ఎండిన పంటలు, అకాల వర్షాలు, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు చొప్పున పరిహారం ఇచ్చేలా వెంటనే జీఓ విడుదల చేయాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వడగళ్లు, అకాల వర్షాలతో పంటలకు తీవ్రనష్టం కలిగినా మంత్రులు కనీసం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. గత ఏడాది అకాలవర్షాలతో నష్టపోయిన వికారాబాద్, వరంగల్ జిల్లాల రైతులను ఆదుకునేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే రోజు రూ.1300 కోట్లు విడుదల చేసిందని, ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరిహారం ఇచ్చినా, రైతులకు బిచ్చమేస్తున్నారా అంటూ రేవంత్‌రెడ్డి గతంలో విమర్శించారన్నారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న సాగు, తాగునీరుపై వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కనాడూ సమీక్ష చేసిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని అతలాకుతలం చేసిందన్నారు. వలసలు వెళ్లినవారు గ్రామాలకు తిరిగి వచ్చి వ్యవసాయం చేసే పరిస్థితిని కేసీఆర్ ప్రభుత్వం కల్పిస్తే, ప్రస్తుత ప్రభుత్వం తిరిగి రైతులు, వ్యవసాయ కూలీలు వలస వెళ్లే పరిస్థితి తెచ్చారని దుయ్యబట్టారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

- సభల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరి
- హైదరాబాద్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటించి సజావుగా జరిగేలా సహకరించాలని హైదరాబాద్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రాజకీయ పక్షాలకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా వివిధ రాజకీయ పార్టీలు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన అన్నారు. రాజకీయ పార్టీల సమావేశాలకు సింగిల్ విండో సిస్టం సువిధ యాప్ ద్వారా అనుమతులు అందిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. ఆ ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం తప్పుడు ప్రచారం చేయడం పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రకటనల కోసం 48 గంటల ముందు ఎంసీఎంసీకి దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్ 24 గంటలపాటు మూడు షిఫ్టులలో పనిచేస్తాయన్నారు. నగదు రవాణా, అక్రమ మద్యం అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

రైతులంటే ఎందుకింత చిన్నచూపు?

- ఢిల్లీ ప్రదక్షిణలే తప్ప రైతులపై కనికరం లేదా?
- సీఎంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా, వడగళ్లు ముంచెత్తినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప రైతుల వైపు కన్నెత్తి చూడటం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’ద్వారా ఆయన సీఎం రేవంత్‌కు పలు ప్రశ్నలు సంధించారు. సీఎంకు రైతుల కన్నీళ్లు, అన్నదాతల ఆర్తనాదాలు వినిపించడం లేదని, ఎన్నికల గోల తప్ప.. కష్టాలు పడుతున్న రైతులపై కనికరం లేదని విమర్శించారు. అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా నిరంతరం రాజకీయాల్లోనే మునిగి తేలుతున్నారని ఆక్షేపించారు. పార్టీ ఫిరాయింపులపై పెడుతున్న శ్రద్ధ పంట నష్టం పరిశీలనపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలోని అధిష్టానం చుట్టూ చక్కర్లు కొట్టీ కొట్టీ.. రైతుల సమస్యలు వినే ఓపిక లేకుండా పోయిందా? అని వ్యాఖ్యానించారు. ‘ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం’బాగుపడదు అనే సామెతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై తమ పార్టీ బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

- బీజేపీ ఎంపీ బండి సంజయ్
- వడగళ్ల బాధిత రైతులకు పరామర్శ



ముస్తాబాద్‌లో వడగళ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బండి సంజయ్

ముస్తాబాద్/గంభీరావుపేట(సిరిసిల్ల): వడగళ్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో సర్వేలు, సమీక్షలు, నివేదికల పేరుతో కాలయాపన చేయొద్దన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్, పోతుగల్, గన్నెవారిపల్లెల్లో ఇటీవల వడగళ్లు, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను బండి సంజయ్ బుధవారం పరిశీలించి, రైతులను ఓదార్చారు. గత ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలుచేసి ఉంటే ఇప్పుడు అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడేవారు కాదని అభిప్రాయపడ్డారు. పంటల బీమా పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పుడయినా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయకుండా నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.25 వేల పరిహారం చెల్లించాలని కోరారు. ఎన్నికల కోడ్ వచ్చిందన్న కారణం చెప్పకుండా.. రైతులను ఆదుకునేందుకు ఎన్నికల కమిషన్‌తో మాట్లాడి సాయం చేయాలని సూచించారు. కాగా, ఈ ప్రభుత్వమైనా ఫసల్‌బీమాను అమలు చేస్తుందో.. లేదో చెప్పాలని కోరారు. కౌలు రైతులకు రూ.12 వేల సాయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్తంభం కూలి మృతిచెందిన ముస్తాబాద్‌కు చెందిన రైతు ఎల్సాని ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సిరిసిల్ల బీజేపీ ఇన్‌చార్జి రాణిరుద్రమ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, పలువురు స్థానిక నేతలు బండి సంజయ్ వెంట ఉన్నారు.

ఇద్దరు డ్రగ్ పెడ్లర్ల అరెస్ట్


- 11 గ్రాముల ఎండీఎంఏ, కారు స్వాధీనం
- మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: దేశంలోని మెట్రో పాలిటన్ నగరాలలో పబ్‌లే కేంద్రంగా యువతను టార్గెట్ చేసి డ్రగ్ దందా చేస్తున్న ఇద్దరు పెడ్లర్లను అరెస్ట్ చేశామని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు. బుధవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సైబరాబాద్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు రాడిసన్ డ్రగ్ కేసులో నిందితుడిగా ఉన్న ముషీరాబాద్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్ రెహ్మాన్ (27), న్యూఢిల్లీకి చెందిన మిలాన్స్ నరేంద్ర శివనాథ్ (34)లను అరెస్ట్ చేశామని వెల్లడించారు. నిందితుల నుంచి కోటి రూపాయల విలువైన 11 గ్రాముల ఎండీఎంఏ, జాగ్వార్ కారు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రాడిసన్ డ్రగ్ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన మీర్జా వాహెద్‌కు అబ్దుల్ రెహ్మాన్ కొకైన్‌తో పాటు ఎండీఎంఏ సరఫరా చేస్తున్నాడని పేర్కొన్నారు. మిలాన్స్ నరేంద్ర శివనాథ్ ద్వారా డ్రగ్ కొనుగోలు చేసి ఒక్కో గ్రామును అప్పటి డిమాండ్‌ను బట్టి రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. రెహ్మాన్‌పై గచ్చిబౌలి పీఎస్‌లో రెండు కేసులు, డబీర్‌పుర, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, జగద్గిరిగుట్ట పీఎస్‌లలో ఒక్కో కేసులో నిందితుడుగా ఉన్నాడని, రెహ్మాన్ అరెస్ట్ కావడం ఇదే మొదటి సారి అని పేర్కొన్నారు. గోవా జైలులో ఉన్న ఫైజల్ డ్రగ్ నెట్ వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫైజల్‌నూ విచారణ చేస్తామన్నారు. హైదరాబాద్, బెంగళూర్, గోవా, ముంబై, ఢిల్లీ తదితర మెట్రో నగరాలలో పబ్‌లకు వచ్చే యువతను టార్గెట్ చేసి డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నారని చెప్పారు. దేశంలోని ప్రధాన నగరాలలో నెట్ వర్క్ ఏర్పరుచుకున్నారని మిగిలిన వారిని గుర్తించాల్సి ఉందన్నారు. నిందితులు డ్రగ్స్ విక్రయిస్తూ హైఎండ్ కార్లు, విలువైన సెల్ ఫోన్లు కొనుగోలు చేసి విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని తెలిపారు.

వసంతపు వెలుగులు

సరిగ్గా సగ భాగం చీకట్లో, మరో సగం ఉదయపు కాంతుల్లో నిండుగా వెలిగిపోతూ కనిపిస్తున్న భూమిని చూస్తున్నారుగా! వసంత విషువత్తు (స్ప్రింగ్ ఈక్వినాక్స్) సందర్భంగా బుధవారం అంతరిక్షం నుంచి భూ గ్రహం ఇలా కన్పించింది. అచ్చెరువొందించే ఈ ఫొటోను యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ ద ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ మెటరోలాజికల్ శాటిలైట్స్ (ఈయూఎంఈటీఎస్ఏటీ) విడుదల చేసింది. సంవత్సరంలో రెండు రోజులు భూమిపై రాత్రింబవళ్ల నిడివి సమానంగా ఉంటుంది. ఆ రోజుల్లో సూర్యుడు భూమధ్యరేఖపై నేరుగా ఉండటమే ఇందుకు కారణం. వీటినే విషువత్తులుగా పిలుస్తారు. భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమించే క్రమంలో ఇవి ఏర్పడతాయి. మొదటిదైన వసంత విషువత్తు ఏటా మార్చి 20కి అటూ ఇటుగా వస్తుంది. ఆ రోజుతో ఉత్తరార్ధ గోళం అధికారికంగా శీతాకాలం నుంచి వసంత కాలంలోకి ప్రవేశిస్తుంది. అక్కడినుంచి ఆ ప్రాంతంలో పగటికాలం, ఉష్ణోగ్రతలు పెరుగుతూ రాత్రుళ్ల నిడివి తగ్గుతూ వస్తాయి. రెండోదైన శరద్విషువత్తు (ఆటమల్ ఈక్వినాక్స్) సెప్టెంబర్ 22కు ఇటూ ఇటుగా వస్తుంది. విషువత్తులకు జ్యోతిశ్శాస్త్రంలో చాలా ప్రాధాన్యముంటుంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్



అతివకు అందలం!

శ్రామికశక్తిలో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యం ● మహిళల నియామకంలో హైదరాబాద్, పుణే, చెన్నై టాప్

ముంబై: దేశంలో ఉద్యోగాలు, ఇతర క్రియాశీలక పనుల్లో మహిళల భాగస్వామ్యం నానాటికీ పెరుగుతోంది. మహిళా సాధికారత దిశగా ఇదొక ముందడుగు అని చెప్పొచ్చు. ఇండియాలో 140 కోట్లకుపైగా జనాభా ఉండగా, వీరిలో 69.2 కోట్ల మంది మహిళామణులే. వీరిలో దాదాపు 37 శాతం మంది ఉద్యోగాలు, క్రియాశీలక పనుల్లో కొనసాగుతున్నారని తాజా అధ్యయనంలో తేలింది. 'కెరీర్‌నెట్స్' అనే సంస్థ 'ఇండియాలో మహిళా ఉద్యోగుల స్థితిగతులు' పేరిట తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. ఉద్యోగాలు చేస్తున్న మహిళల విషయంలో హైదరాబాద్, పుణే, చెన్నై అగ్రస్థానాల్లో ఉన్నాయని వెల్లడించింది. 2022తో పోలిస్తే 2023లో శ్రామికశక్తిలో అతివల ప్రాతినిధ్యం 2 నుంచి 5 శాతం పెరిగినట్లు తెలియజేసింది. జూనియర్ ప్రొఫెషన్ ఉద్యోగాలు, ఎగ్జిక్యూటివ్ బోర్డుల్లో వారి భాగస్వామ్యం పెరిగినట్లు పేర్కొంది. నివేదికలో ఇంకా ఏం పేర్కొన్నారంటే..

- 2023లో కాలేజీల నుంచి వచ్చి కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారిలో 40 శాతం మంది మహిళలే ఉన్నారు.
- ఒకటి నుంచి ఏడేళ్ల అనుభవం ఉన్న మహిళలకు కొత్తగా జరుగుతున్న నియామకాల్లో 20 నుంచి 25 శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయి.
- దేశ రాజధాని ఢిల్లీ మినహా ఇతర నగరాల్లో మహిళల నియామకం పెరిగింది. ఢిల్లీలో మాత్రం తగ్గిపోయింది.
- ఉద్యోగాల్లో మహిళల నియామకం రేటు హైదరాబాద్‌లో 34 శాతం, పుణేలో 33 శాతం, చెన్నైలో 29 శాతంగా నమోదైంది. ఢిల్లీలో ఇది కేవలం 20 శాతంగా ఉంది.



సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు అత్యవసర బ్రెయిన్ సర్జరీ

ఆపరేషన్ విజయవంతం: వైద్యులు



న్యూఢిల్లీ: ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ (66)కు మెదడు శస్త్రచికిత్స జరిగింది. పుర్రె లోపల రక్తస్రావంతో మార్చి 17వ తేదీన ఆయన అత్యవసరంగా ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆస్పత్రిలో చేరారు. డాక్టర్ వినీత్ సూరి నేతృత్వంలోని న్యూరో బృందం విజయవంతంగా శస్త్రచికిత్స చేసినట్లు ఆస్పత్రి బుధవారం ప్రకటించింది. సద్గురు కొన్ని వారాలుగా తీవ్ర తలనొప్పితో బాధపడుతున్నారు. మార్చి 15న సూరీని సంప్రదించగా వెంటనే ఎంఆర్ఐ చేశారు. దాంతో రక్తస్రావం విషయం బయటపడింది. మార్చి 17న పాక్షికంగా స్పృహ కోల్పోవడం, ఎడమ కాలు మొద్దుబారడం వంటి సమస్యలు తలెత్తాయి. దాంతో హుటాహుటిన ఆస్పత్రిలో చేర్చి అదే రోజు సర్జరీ చేశారు. సద్గురు కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు.

సద్గురు సరదా పోస్టు

సర్జరీపై సద్గురు ఇన్‌స్టాగ్రాంలో సరదా పోస్ట్ పెట్టారు. ''అపోలో న్యూరోసర్జన్లు నా పుర్రెకు రంధ్రం పెట్టి లోపల ఏదైనా ఉంటుందేమోనని వెతికారు. వాళ్లకేదీ దొరకలేదు. అంతా ఖాళీ. శ్రమ వృథా అయిందనుకుని ప్యాచప్ చేసి రంధ్రం మూసేశారు. ప్యాచప్ పుర్రె, డ్యామేజీ బ్రెయిన్‌తో ఢిల్లీ ఆస్పత్రిలో ఉన్నా'' అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సద్గురుకు ఫోన్ చేసి యోగక్షేమాలు కనుక్కున్నారు.

కృత్రిమ మేధలో లీడర్ ఇండియా

- ఏఐ, సెమీ కండక్టర్లు, క్వాంటమ్ మిషన్లతో ఉపాధి, పెట్టుబడి అవకాశాలు
- ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం
- 'స్టార్టప్ మహాకుంభ్'లో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సామర్థ్యాల్లో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర చెప్పారు. ప్రపంచదేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు స్వదేశీ పరిష్కార మార్గాలు కనిపెట్టాలని భారత యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీలో స్టార్టప్ మహాకుంభ్‌లో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం గతంలోనే ప్రారంభించిన ఏఐ, సెమీ కండక్టర్లు, నేషనల్ క్వాంటమ్ మిషన్ల ద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఉపాధి, విదేశీ ఇన్వెస్టర్లకు పెట్టుబడి అవకాశాలు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. ఏఐ టెక్నాలజీ అనే నూతన శకంలో మనం ఉన్నామని, ఈ రంగంలో భారత్‌దే పైచేయి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ అవకాశం ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోవద్దని సూచించారు. యువతకు, ప్రపంచస్థాయి పెట్టుబడిదారులకు ఏఐ టెక్నాలజీ అవధుల్లేని అవకాశాలు అందిస్తోందని పేర్కొన్నారు. కృత్రిమ మేధలో ఇండియానే లీడర్ అవుతుందంటూ గత ఏడాది అమెరికా సెనేట్‌లో తాను తేల్చిచెప్పానని మోదీ గుర్తుచేశారు. ఎన్నికల ప్రచారం కోసం ఏఐ టెక్నాలజీని వాడుకుంటున్నానని, తెలుగు, తమిళంతోపాటు ఎన్నో భాషల్లో తన స్టేట్‌మెంట్లను ప్రజలతో పంచుకుంటున్నానని ఉద్ఘాటించారు.

మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదే

సార్వత్రిక ఎన్నికల తర్వాత తమ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టబోతోందని ప్రధాని మోదీ వెల్లడించారు. రూ.వేల కోట్లతో కొత్తగా 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలకు మధ్యంతర బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. స్టార్టప్ కంపెనీలకు నిధుల సాయం అందించడానికి ఒక ఉత్తమ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. 2014లో మన దేశంలో కనీసం 100 స్టార్టప్‌లు కూడా లేవని, ఇప్పుడు వాటి సంఖ్య 1.25 లక్షలు దాటిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కంపెనీలతో 12 లక్షల మంది యువత అనుసంధానమై ఉన్నారని వివరించారు. స్టార్టప్‌లు పెద్ద సంఖ్యలో పేటెంట్లు సాధిస్తున్నాయని కొనియాడారు. మనకు 110కుపైగా యూనికార్న్ కంపెనీలు ఉన్నాయని తెలిపారు. విద్యాభ్యాసం అంటే ప్రభుత్వం ఉద్యోగం సంపాదించడం అనే ధోరణి గతంలో ఉండేదని, ప్రభుత్వ ఉద్యోగం వస్తే జీవితంలో స్థిరపడినట్లేనని భావించేవారని గుర్తుచేశారు. అలాంటి ఆలోచనా ధోరణి ఇప్పుడు మారిందని, స్టార్టప్ విప్లవం మొదలైందని అన్నారు. నేటి మన యువత ఉద్యోగాలు కోరుకొనేవారుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారిగా ఎదుగుతున్నారని ప్రశంసించారు. దేశంలో 45 శాతానికిపైగా స్టార్టప్‌లకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. ప్రపంచంలో మూడోఅతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదేనని పేర్కొన్నారు. వికసిత్ భారత్‌తోపాటు ప్రపంచ మెరుగైన భవిష్యత్తుకు నవీన ఆవిష్కరణల సంస్కృతి చాలా కీలకమని స్పష్టం చేశారు.




బుధవారం ఢిల్లీలో స్టార్టప్ మహాకుంభ్‌లో పాల్గొన్న వారికి ప్రధాని మోదీ అభివాదం

రాహుల్‌పై వ్యంగ్యాస్త్రాలు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. రాజకీయాల్లో కొందరిని పదేపదే కొత్తగా ప్రారంభించాల్సి వస్తోందని అన్నారు. ఒక రంగంలో స్టార్టప్ కంపెనీ విఫలమైతే మరో రంగంలో ప్రారంభించవచ్చని చెప్పారు. రాజకీయాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. చాలామంది స్టార్టప్‌లు ప్రారంభిస్తున్నారని, రాజకీయాల్లో స్టార్టప్‌ల సంఖ్య మరింత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

ఎలక్షన్ బీట్

యూపీలో క్లీన్ స్వీప్ చేస్తాం: అమిత్ షా



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ బీజేపీ 2014 కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన న్యూస్ 18 సదస్సులో మాట్లాడారు. వారసత్వ రాజకీయాలు చేసే పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. యూపీలో 80 సీట్లకు గాను 2014లో బీజేపీ 71 గెలుచుకుంది. ఎన్డీఏ భాగస్వామి అప్నాదళ్ రెండు స్థానాలు దక్కించుకుంది. ఒడిశాలో పొత్తులపై అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ)తో చర్చలు జరుగుతున్నాయని, తుది నిర్ణయాన్ని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా తీసుకుంటారని షా తెలిపారు. ఒంటరిగా పోరాడాలనుకుంటే ఆ రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకే ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. పంజాబ్‌లో అకాలీ దళ్‌తో పొత్తు విషయంపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. బెంగాల్‌లో తమ పార్టీ 25 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తుందని, పంజాబ్‌తోపాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ అధిక సీట్లు సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సుప్రీంకోర్టు సెప్టెంబర్ వరకు గడువిచ్చిందని, అంతకుముందే వాటిని నిర్వహిస్తామని అమిత్ షా చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన పప్పూ యాదవ్



సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో ప్రముఖ నేత, జన్ అధికార్ పార్టీ అధినేత రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన పార్టీని అధికారికంగా కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మీడియా ఇంఛార్జి పవన్ ఖేడా, బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్ ప్రకాశ్ ఆధ్వర్యంలో పప్పు యాదవ్, ఆయన కుమారుడు సార్థక్ రంజన్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయన బిహార్‌లోని పూర్ణియా నుంచి కాంగ్రెస్ నుంచి బరిలో దిగే అవకాశముంది. బీఎస్పీ నుంచి సస్పెండైన ఎంపీ డానిష్ అలీ, జార్ఖండ్ బీజేపీ ఎమ్మెల్యే జై ప్రకాశ్ భాయ్ పటేల్, జమ్మూకశ్మీర్ మాజీ ఎంపీ లాల్‌సింగ్ సైతం కూడా కాంగ్రెస్‌లో చేరారు.

టికెట్ నిరాకరిస్తే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో !

తాడోపేడో తేల్చుకోనున్న వరుణ్ గాంధీ



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ ఎంపీ స్థానం నుంచి ఈసారి పార్టీ తరఫున టికెట్ దక్కపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో దిగాలని బీజేపీ యువ నేత వరుణ్ గాంధీ భావిస్తున్నట్లు వార్తలొచ్చాయి. తరచూ సొంత పార్టీ, ప్రభుత్వ విధానాలనే తప్పుబట్టే వరుణ్ గాంధీకి ఈసారి కమలదళం టికెట్ ఇవ్వకపోవచ్చని ఊహాగానాలు వినిపించాయి. టికెట్ దక్కపోయినా పోటీ చేయడం ఖాయమని వరుణ్ ఇప్పటికే నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుణ్ పిలిభిత్ స్థానం నుంచి పోటీచేసి ఘన విజయం సాధించారు. ఏప్రిల్ 19వ తేదీన ఈ స్థానానికి పోలింగ్ జరగనుంది. అయితే ఇప్పటికే పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ ఇప్పటిదాకా పిలిభిత్ స్థానంలో ఎవరిని నిలబెట్టేది నిర్ణయించలేదు. ఇటీవల జరిగిన బీజేపీ కోర్‌కమిటీ భేటీలో వరుణ్‌కు ఈసారి టికెట్ ఇవ్వకూడదంటూ కొందరు రాష్ట్ర నేతలు ఖరాకండీగా చెప్పినట్లు సమాచారం. వరుణ్‌కు సమాజ్‌వాదీ పార్టీ టికెటిస్తుందని వార్తలు గుప్పుమన్నాయి. దీనిపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను మీడియా ప్రశ్నించగా త్వరలోనే నిర్ణయిస్తామన్నారు.

21 మందితో డీఎంకే జాబితా



చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే లోక్‌సభ ఎన్నికలకు 21 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. మిగతా 18 సీట్లను భాగస్వాములైన కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకేకి కేటాయించింది. 21 మందిలో 11 మంది కొత్తవారు. సిట్టింగ్ ఎంపీలు కనిమొళి, టీఆర్ బాలు, ఎ.రాజా, తంగపాండియన్, దయానిధి మారన్, ఎస్.జగత్రక్షకన్, కళానిధి వీరాసామి, కతిర్ ఆనంద్, సీఎన్ అన్నాదురైలకు టికెట్లు దక్కాయి. జాబితాతో పాటు ఎన్నికల మేనిఫెస్టోను కూడా డీఎంకే విడుదల చేసింది. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పౌరసత్వ (సవరణ) చట్టం రద్దు, జాతీయ రహదారులపై టోల్ గేట్ల రద్దు, పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర హోదాను రద్దు చేయడానికి కేంద్రాన్ని అనుమతించే ఆర్టికల్ 356 రద్దు, గవర్నర్ల నియామకంలో రాష్ట్రాలతో సంప్రదింపుల వంటి అంశాలను మేనిఫెస్టోలో పొందుపరిచింది. ''ఇది రాష్ట్ర ప్రజల అభిప్రాయాలతో రూపొందిన ప్రజల మేనిఫెస్టో. మా ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రాబోతోందన్న ధీమాతోనే జాతీయాంశాలకు మేనిఫెస్టోలో చోటు కల్పించాం'' అని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. పదేళ్లలో దేశాన్ని బీజేపీ భ్రష్టుపట్టించిందని, ఎన్నికల వాగ్దానాలేవీ అమలు చేయలేదని విమర్శించారు.

మళ్లీ రాజకీయాల్లోకి తమిళిసై



సాక్షి, చెన్నై: తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం మళ్లీ బీజేపీలో చేరారు. చెన్నైలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, అన్నామలై, ఎల్.మురుగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆమెకు తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సభ్యత్వ కార్డును అందజేశారు. గవర్నర్‌గా చేసి మళ్లీ రాజకీయాల్లోకి రావడమేంటని విపక్ష పార్టీలు, అధికార డీఎంకే చేస్తున్న విమర్శలపై అన్నామలై స్పందించారు. '' రాజ్యాంగబద్ధ విశిష్ట పదవుల్లో కొనసాగి కూడా తర్వాత సాధారణ కార్యకర్తలా పనిచేసే సదవకాశం ఒక్క బీజేపీలోనే ఉంటుంది. ఇతర రాజకీయ పార్టీల్లో పనిచేసి తర్వాత గవర్నర్ అయిన వారు మళ్లీ సాధారణ జీవితం కోరుకోరు. వాళ్లకు అత్యున్నత పదవుల్లో కొనసాగడమే ఇష్టం. కానీ బీజేపీ నేతలు అందుకు పూర్తి భిన్నం' అని ఆయన అన్నారు.

ఉచిత వాగ్దానాలపై పిల్

న్యూఢిల్లీ: ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత వాగ్దానాలను తప్పుబడుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. 'ఓటర్ల నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు పార్టీలు చేస్తున్న ఈ ఉచిత తాయిలాల ప్రకటనలు, వాగ్దానాలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. వీటిపై నిషేధం విధించేలా కేంద్ర ఎన్నికల సంఘం తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వండి' అంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ పిల్‌ను దాఖలుచేశారు. ఈయన తరఫున సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా బుధవారం సుప్రీంకోర్టులో వాదించారు. ' ఉచిత వాగ్దానాలిచ్చే రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి, ఆయా పార్టీల ఎన్నికల గుర్తులను స్తంభింపజేయాలి' అని కోరారు. ' ఇది చాలా ముఖ్యమైన అంశం. ఈ పిటిషన్‌ను వీలైనంత త్వరగా విచారిస్తాం. ఏ తేదీన విచారించాలన్న దానిపై గురువారం బోర్డ్‌లో చర్చిస్తాం' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజే ఉచితాలపై పిల్ దాఖలవడం గమనార్హం. ''ప్రజాధనంతో నిర్హేతుకమైన ఉచిత పథకాలు ప్రకటించడంతో ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో ప్రభావితమయ్యే అవకాశం చాలా ఎక్కువ. పోటీ పార్టీల విజయావకాశాలనూ ఇవి దెబ్బతీస్తాయి. పారదర్శకమైన ఎన్నికల క్రతువుకు ఇది విఘతం. ఉచితాలు ప్రజాస్వామ్య విలువల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు'' అని పిటిషనర్ పేర్కొన్నారు. '' ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న ఈ ఉచితాలు ఒక రకంగా ఓటర్లకు లంచాలు ఇవ్వడం లాంటిదే. అధికార పార్టీ మళ్లీ అధికారంలో కొనసాగడానికి ఇది ఒక మార్గంలా పనికొస్తోంది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఇలాంటి ధోరణులకు చెక్ పెట్టాల్సిందే. ఇందులోభాగంగా ఎన్నికల గుర్తుల(రిజర్వేషన్, అలాట్‌మెంట్) ఉత్తర్వు, 1968లోని సంబంధిత పేరాలో అదనపు షరతులను ఈసీ జతచేయాలి. ఎన్నికలకు ముందు ప్రజాధనంతో నిర్హేతుక ఉచితాల వాగ్దానాలు చేయొద్దని పార్టీలకు షరతు విధించాలి' అని పిటిషనర్ కోర్టును కోరారు.

మూసేవాలా తల్లి ఐవీఎఫ్ చికిత్సపై నివేదిక ఇవ్వండి

పంజాబ్ ప్రభుత్వాన్ని కోరిన కేంద్రం

న్యూఢిల్లీ: దివంగత పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా తల్లి చరణ్ కౌర్‌కు 58 ఏళ్ల వయసులో ప్రసవానికి కారణమైన ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) చికిత్సపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని పంజాబ్ ప్రభుత్వాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోరింది. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ సేవలు పొందే మహిళ వయసు 21- 50 మధ్య ఉండాలి. మూసేవాలా హత్యకు గురైన రెండేళ్లకు ఆయన తల్లి చరణ్ కౌర్ మార్చి 17న మగబిడ్డను ప్రసవించారు.

ఐసిస్ ఇండియా చీఫ్ అరెస్టు

గువాహటి: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్ భారత చీఫ్ హరీస్ ఫరూకీ అలియాస్ హరీష్ అజ్మల్ ఫరూకీ పోలీసులకు చిక్కాడు. అతనితో పాటు సహచరుడు అనురాగ్‌సింగ్ అలియాస్ రెహాన్‌ను కూడా అస్సోంలోని దుబ్రీ జిల్లాలో బుధవారం అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఫరూకీ స్వస్థలం డెహ్రాడూన్ కాగా రెహాన్‌ది పానిపత్. విచారణ నిమిత్తం వారిని ఎన్ఐఏకు అప్పగించనున్నారు.

తప్పుడు సిమ్‌లు 21 లక్షలు!

గుర్తించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తప్పుడు ధృవీకరణ పత్రాలతో 21 లక్షల సిమ్ కార్డులు జారీ అయినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డీఓటీ) అనుమానం వ్యక్తం చేసింది. రీ-వెరిఫికేషన్ చేసి బోగస్ సిమ్‌లుగా తేలిన వాటిని వెంటనే రద్దుచేయాలని భారతీ ఎయిర్‌టెల్, ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ టెలికం సంస్థలకు డీఓటీ హెచ్చరికలు జారీచేసింది. సంచార్ సాథీ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 114 కోట్ల మొబైల్ కనెక్షన్లను డీవోటీకి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఏఐ, డీఐయూ) విశ్లేషించింది. దీంతో దేశవ్యాప్తంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో 21 లక్షల సిమ్ కార్డులు యాక్టివేట్ అయి ఉన్నట్లు డీఓటీ విశ్లేషణలో తేలింది. మనుగడలో లేని, తప్పుడు, ఫోర్జరీ, నకిలీ ధృవీకరణ పత్రాలతో ఈ సిమ్‌కార్డులను సంపాదించి యాక్టివేట్ చేసి ఉంటారని ఏఐ, డీఐయూ విశ్లేషణలో వెల్లడైంది. దేశంలో తొమ్మిది సిమ్ కార్డుల కంటే ఎక్కువ తీసుకున్న వారు ఏకంగా 1.92 కోట్ల మంది ఉన్నట్లు ఈ విశ్లేషణలో వెల్లడైంది. 21 లక్షల సిమ్ కార్డుల్లో కొన్ని అనుమానాస్పద ఫోన్ నంబర్ల జాబితాను విడుదల ఆయా టెలికం కంపెనీలకు డీఓటీ పంపించింది. వాటి ధృవీకరణ పత్రాలను సరిచూసి రీవెరిఫికేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రీవెరిఫికేషన్‌లో ఆ సిమ్‌లు తప్పుడు పత్రాల ద్వారా తీసుకున్నట్లు గుర్తిస్తే ఆ నంబర్లను తక్షణం రద్దు చేయాలని సూచించింది. ఇప్పటి వరకు 1.8 లక్షల మొబైల్ హ్యాండ్‌సెట్‌లను పనిచేయకుండా చేశామని డీఓటీ అధికారులు చెప్పారు. అనుమానాస్పద నంబర్లపై దర్యాప్తును సర్వీసు ప్రొవైడర్లు వేగవంతం చేయాలని డీవోటీ తుది గడువు విధించింది.

సైబర్ నేరాలకు దుర్వినియోగం!

తప్పుడు పత్రాలతో పొందిన సిమ్‌లను ఆయా వ్యక్తులు సైబర్ నేరాలకు వాడుతున్నట్లు డీఓటీ అనుమానం వ్యక్తంచేసింది. ఒక ప్రాంతంలో తీసుకున్న బోగస్ సిమ్‌ను సుదూర ప్రాంతాల్లో వాడున్నట్లు గుర్తించారు. తప్పుడు పత్రాలతో సేకరించిన సిమ్‌ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతూ కోట్లు కొల్లగొట్టే ప్రమాదముంది. సిమ్‌లను సైబర్ నేరాలకు వాడుతున్నట్లు తేలితే వాటిని రద్దు చేయడంతో పాటు ఫోన్‌నూ పనికిరాకుండా చేస్తామని హెచ్చరించింది.

అంతా నిబంధనల మేరకే

ఈసీల నియామకంపై సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ: ఇద్దరు నూతన కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం నిబంధనల మేరకే జరిగిందని కేంద్రం పేర్కొంది. ఈ ప్రక్రియ హడావుడిగా జరిగిందన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఈసీల ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేకపోవడాన్ని సమర్థించుకుంది. ఎంపిక కమిటీలో న్యాయవ్యవస్థ ప్రాతినిధ్యమే ఈసీ స్వతంత్ర ప్రతిపత్తికి ప్రాతిపదిక కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈసీల ఎంపిక కమిటీ నుంచి సీజేఐని మినహాయించడాన్ని సవాలు చేస్తూ కోర్టులో ఈ కేసులో తదుపరి విచారణ గురువారం జరగనుంది.

కరంద్లాజేపై తక్షణ చర్యలు తీసుకోండి

డీఎంకే ఫిర్యాదుకు స్పందించిన ఈసీ

న్యూఢిల్లీ/శివాజీనగర: కేంద్ర మంత్రి, బీజేపీ నేత శోభా కరంద్లాజే కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారన్న డీఎంకే ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాల్సిందిగా కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను ఈసీ బుధవారం ఆదేశించింది. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో పేలుడుకు తమిళనాడుకు చెందిన వ్యక్తి కారణమని శోభ అన్నారు. ఆ క్రమంలో తమిళనాడు ప్రజలు ఉగ్రవాదులనేలా వ్యాఖ్యలు చేశారంటూ డీఎంకే ఈసీకి ఫిర్యాదు చేసింది.

ఫిన్‌లాండ్.. హ్యాపీనెస్‌కు అడ్రస్

- అత్యంత సంతోషకరమైన దేశాల్లో అగ్రస్థానం
- రెండు, మూడు స్థానాల్లో డెన్మార్క్, ఐస్‌లాండ్
- 126వ స్థానంలో భారత్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్‌లాండ్ వరుసగా ఏడో సంవత్సరం సైతం తొలి స్థానం దక్కించుకుంది. నార్డిక్ దేశాలైన డెన్మార్క్, ఐస్‌లాండ్, స్వీడన్ వరుసగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా 143 దేశాల్లో అధ్యయనం చేసి, రూపొందించిన ఈ జాబితాలో భారతదేశం 126 స్థానంలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఇండియా స్థానం మారలేదు. ప్రపంచ సంతోష సూచికలో చైనా(60), నేపాల్(93), పాకిస్తాన్(108), మయన్మార్(118) ఇండియా కంటే మెరుగైన స్థానంలో ఉండడం గమనార్హం. ఐక్యరాజ్యసమితి సౌజన్యంతో రూపొందించిన వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్‌ను 'ప్రపంచ సంతోషకర దినోత్సవం' సందర్భంగా బుధవారం విడుదల చేశారు. తాలిబన్ల నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న అఫ్గానిస్తాన్ 143వ ర్యాంకుతో చిట్టచివరి స్థానంలో నిలిచింది. ఈసారి అమెరికా, జర్మనీకి టాప్-20లో స్థానం దక్కకపోవడం గమనార్హం. ఇలా జరగడం గత పన్నెండు సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. అమెరికాకు 23, జర్మనీకి 24వ ర్యాంకు దక్కింది. 12వ ర్యాంకుతో కోస్టారికా, 13వ ర్యాంకుతో కువైట్ మొట్ట మొదటిసారిగా టాప్-20 లోకి చేరాయి.

- దేశ ప్రజల ఆత్మ సంతృప్తి, సామాజిక మద్దతు, ఆరోగ్యకరమైన జీవిత కాలం, స్వేచ్ఛ, దాతృత్వం, తలసరి జీడీపీ, అవినీతి వంటి అంశాల ఆధారంగా వరల్డ్ హ్యాపీయెస్ట్ కంట్రీస్ జాబితా రూపొందిస్తారు.
- ప్రపంచంలో జనాభాపరంగా అతిపెద్ద దేశాలకు ఈసారి టాప్-10లో చోటు దక్కలేదు.
- ఫిన్‌లాండ్ అత్యంత సంతోషకరంగా దేశంగా మారడానికి కారణం ఏమిటన్నది ఆసక్తికరం. ఫిన్‌లాండ్ ప్రజలు ప్రకృతితో చక్కటి అనుబంధం కలిగి ఉంటారని యూనివర్సిటీ ఆఫ్ హెల్సింకీలో పనిచేసే హ్యాపీనెస్ పరిశోధకురాలు జెన్నిఫర్ డీ పావోలా చెప్పారు. దేశంలో అవినీతి చాలా తక్కువగా ఉండడం, మెరుగైన విద్య, వైద్య సేవలు అందుతుండడం, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం ఉండడం వంటివి దేశంలో సంతోషానికి కారణమని విశ్లేషించారు.



టాప్-10	
1	ఫిన్‌లాండ్
2	డెన్మార్క్
3	ఐస్‌లాండ్
4	స్వీడన్
5	ఇజ్రాయెల్
6	నెదర్లాండ్స్
7	నార్వే
8	లక్సెంబర్గ్
9	స్విట్జర్లాండ్
10	ఆస్ట్రేలియా

డిఫాల్ట్ బెయిల్ పొందడం నిందితుడి హక్కు

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేసులో విచారణ ప్రారంభించకుండా నిందితుడిని కస్టడీలో సుదీర్ఘకాలం ఎలా కొనసాగిస్తారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడం నిందితుడి స్వేచ్ఛను హరించడమే అవుతుందని తేల్చిచెప్పింది. అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తూ నిందితులకు డిఫాల్ట్ బెయిల్ లభించకుండా చేయడం సమంజసం కాదని పేర్కొంది. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అనుచరుడైన ప్రేమ్ ప్రకాశ్ నివాసంలో 2022 ఆగస్టులో ఈడీ సోదాలు చేసింది. రెండు ఏకే-47 తుపాకులు, 60 బుల్లెట్లు లభించాయి. దీంతో అతడిపై ఆయుధాల చట్టంతోపాటు మనీ లాండరింగ్ నేరం కింద ఈడీ కేసులు నమోదు చేసింది. అప్పటి నుంచి నిందితుడు ఈడీ కస్టడీలోనే ఉంటున్నాడు. అతడికి బెయిల్ లభించకుండా ఈడీ ఇప్పటిదాకా కోర్టులో నాలుగు అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేసింది. తనకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ ప్రేమ్‌ప్రకాశ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. డిఫాల్ట్ బెయిల్ పొందడం నిందితుడి హక్కు అని స్పష్టం చేసింది. అతడిని ఎందుకు కస్టడీలో కొనసాగిస్తున్నారనో చెప్పాలని ఈడీని ప్రశ్నించింది. విచారణను ఏప్రిల్ 29కు వాయిదా వేసింది.

సాక్షి కరీంనగర్

గురువారం । 21 । మార్చి । 2024



మధ్యాహ్నం బడి కష్టాలు

విద్యార్థులకు మధ్యాహ్నం బడి కష్టాలు ఎదురవుతున్నాయి. 'పది' పరీక్షల నేపథ్యంలో కొన్ని పాఠశాలలు మధ్యాహ్నం నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సాం)	సహర్ (ఉ)
కరీంనగర్	6.25	4.50
పెద్దపల్లి	6.33	4.57
రాజన్న సిరిసిల్ల	6.33	4.58
జగిత్యాల	6.33	4.57

గరిష్టం/కనిష్టం
33.0/22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల అప్పుడప్పుడు ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైల్వే అధికారులకు అన్ని విధాలుగా సహకరిస్తాం



కరీంనగర్ అర్బన్/కరీంనగర్ రూరల్: కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వేలైన్ పనుల విషయంలో అన్ని విధాలా సహకరిస్తామని అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రైల్వే అథారిటీ, రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్‌శాఖ అధికారులతో రైల్వేలైన్ పనులపై సమీక్షించారు. ఉప్పర మల్యాల, గర్శకుర్తి గ్రామాల్లో కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌కు సంబంధించిన భూ సేకరణ దాదాపు పూర్తయిందని వివరించారు. అందుకు సంబంధించిన రూ.58 కోట్లు రైల్వేశాఖ డిపాజిట్ చేస్తే వెంటనే భూమి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. రైల్వేశాఖ సీఈ ప్లానింగ్ అమిత్ అగర్వాల్, కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్, ఇరిగేషన్ ఎస్‌ఈ శివకుమార్, మైనింగ్ ఏడీ రామాచారి పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులపై విచారణ జరిపించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనుల నాణ్యతపై విచారణ జరిపించాలని బీజేపీ కార్పొరేటర్ రాపర్తి విజయ కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌లకు ఫిర్యాదు చేశారు. ఎస్ఆర్ఆర్ కాంట్రాక్ట్ ఏజెన్సీ స్మార్ట్‌సిటీ పనుల కింద రహదారులు, మురికికాలువలు, ఫుట్‌పాత్‌టైల్స్ నిర్మాణం చేపట్టిందన్నారు. పనుల్లో నాణ్యత లేదని, నాసిరకం పనులతో ప్రజల డబ్బులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. డ్రైనేజీల నుంచి రహదారులపైకి మురికినీళ్లు వస్తున్నాయని, రోడ్లు పగుళ్లు చూపుతున్నాయని, టైల్స్ ఊడిపోతున్నాయన్నారు. సదరు ఏజెన్సీకి బిల్లులు చెల్లించకుండా, విచారణ చేపట్టాలని ఆమె కోరారు.

23న సిటీలో తాగునీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ఈ నెల 23వ తేదీ శనివారం తాగునీటి సరఫరా ఉండదని నగర పాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్‌బెడ్‌లోని బూస్టర్ మోటార్ వద్ద పైప్‌లైన్ ఇంటర్‌కనెక్షన్ పనులు జరుగుతున్నందున తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. కావున నగరవాసులు తాగునీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

పూట గడిచేదెట్లా?



కరీంనగర్‌కు చెందిన రమేశ్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. మంగళవారం నుంచి అతని సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో డెలివరీబాయ్‌గా పనిచేసుకునేందుకు సిద్ధమయ్యాడు.

సర్వశిక్ష అభియాన్‌లో పీడీగా పనిచేసే సిబ్బంది తమకు వచ్చే నెలలో 'నోవర్క్ నో పే' వస్తుందని గ్రహించి, ముందుగానే మరో చోట ట్యూషన్లు చెప్పుకోవడం లేదంటే.. రాపిడో, ఉబర్ వంటి సంస్థల్లో రైడర్‌గా చేరాలని నిర్ణయించుకున్నారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు(ఫైల్), (ఇన్‌సెట్లో వరంగల్‌లో జరిగిన దీక్షల్లో సంఘీభావం తెలుపుతున్న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మార్చి వచ్చిందంటే గుండెదడే. ఎప్పటిలాగే మీ సేవలను తాత్కాలికంగా పక్కన పెడుతున్నామంటూ ప్రభుత్వం నుంచి ఈ ఏడాది కూడా ఆదేశాలు వచ్చాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఈ తాత్కాలిక ఉద్వాసన వల్ల వేసవిలో మూడురోజుల నుంచి రెండు మాసాలపాటు ఉపాధి కోల్పోయేవారు దాదాపు 11,000మంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న వేళ ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ప్రభుత్వం నుంచి వివిధ విభాగాల్లో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి టెర్మినేషన్ ఆదేశాలు అందుతున్నాయి. దీంతో ఏదోఒక పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేందుకు సిద్ధమవుతున్నారు. వీరిలో చాలామంది పదో తరగతి నుంచి పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు ఉన్నారు. అంతా ఆయా విభాగాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న వారే.

- ఉమ్మడి జిల్లాలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్వాసన
- మూడు రోజుల నుంచి రెండు నెలలపాటు 'నో వర్క్ నో పే'
- సీఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకోవాలని వేడుకోలు
- కుటుంబ పోషణకు దినసరి కూలీలు అవుతామని ఆవేదన
- వివిధ విభాగాల్లో 11వేల మందికిపైగా సిబ్బంది

అయితే, వీరెవరూ ఏ కార్యాలయంలోనూ 365 రోజులు పనిచేసిన దాఖలాలు లేవు.

కారణం ఏమిటి?

చాలా ప్రభుత్వ విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. విద్య,వైద్యారోగ్యశాఖల్లో ఈ కొరత అధికం. మిగిలిన విభాగాల్లోనూ ఆఫీసు, ఫీల్డ్‌లెవల్‌లో పనిచేసేందుకు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించుకుంటున్నాయి. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు ఉంటాయి. కానీ ఏడాదిపాటు ఎట్టిపరిస్థితుల్లో కొననసాగనివ్వరు. కనిష్టంగా మూడు రోజుల నుంచి గరిష్టంగా రెండు నెలలపాటు వీరికి తాత్కాలికంగా ఉద్వాసన పలుకుతారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో వీరిని తిరిగి తీసుకుంటారు. అప్పటి వరకూ 'నో వర్క్... నో పే' విధానం అమలు చేస్తారన్న మాట. ఈ కాలంలో ఎలాంటి వేతనం రాదు కాబట్టి ఈ ఉద్యోగులంతా కూలీనాలీ చేసుకుని జీవించాల్సిందే. 365 రోజులపాటు వీరు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులుగా పనిచేస్తే.. కొన్నేళ్ల తరువాత తమను రెగ్యులరైజ్ చేయాలంటూ న్యాయస్థానాల్లో కేసులు వేస్తారన్న అభద్రతాభావంతో ప్రభుత్వమే వారిని ఏటా కొంతకాలం పాటు తొలగించి, తిరిగి కొత్త నియామకం కింద చూపిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో 11 వేలమంది

ఔట్‌సోర్సింగ్ విధానంలో కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మొత్తం దాదాపు పదకొండు వేలమందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరినీ ఇప్పుడు విభాగాల వారీగా వారి అవసరాన్ని బట్టి తొలగించి, కొన్ని రోజులు లేదా వారాల తరువాత తిరిగి నియమించుకుంటారు. ఈ విధానం రద్దు చేయాలంటూ సర్వశిక్షా అభియాన్ సిబ్బంది గతేడాది దాదాపు 25 రోజులపాటు సమ్మె చేశారు. గత ప్రభుత్వంలో ఎలాగూ తమకు ఇబ్బందులు తప్పలేదని, కనీసం తాజాగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమకు న్యాయం చేయాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంలో బయటికి వచ్చి గోడు వెళ్లబోసుకుందామని అనుకున్నా.. ఎక్కడ తిరిగి విధుల్లోకి చేర్చుకోరో అన్న భయంతో వెనకడుగు వేస్తున్నారు.

సీఎం మాట నిలబెట్టుకోవాలి



ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి 2023 సెప్టెంబరు 13న ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనే వరంగల్‌లోని మా దీక్షా శిబిరాన్ని సందర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్నిరకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎలాగూ మమ్మల్ని పట్టించుకోలేదు. కనీసం ఈ సీఎం అయినా మా సమస్యలు పరిష్కరించాలి. మాకు ఉద్యోగ భద్రత కల్పించి, క్రమబద్ధీకరించాలి.

– బెజ్జంకి ఆంజనేయులు, ఎస్ఎస్ఏ జేఏసీ కరీంనగర్ అధ్యక్షుడు

రెగ్యులరైజ్ చేయాలి



శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్న తీరును ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించాం. అయినా ఫలితం లేదు. ప్రభుత్వం వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.

– ఎడ్ల రమేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

12 నెలల వేతనం ఇవ్వాలి



విద్యాశాఖలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రెండు నెలలపాటు వేతనాలు చెల్లించాలి. సీఎం రేవంత్ గత ఎన్నికల ముందు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే అమలు చేయాలి. ఈ రెండు నెలలు ఆ సిబ్బంది కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఆదుకోవాలి.

– డాక్టర్ బీఎస్ రావు, బీఆర్ఎస్ నాయకుడు

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



ఆస్తి పన్ను వసూళ్లపై ఆరా తీస్తున్న ఏసీ

కరీంనగర్ కార్పొరేషన్: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి పన్ను వసూళ్లను మరింత వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. ఆస్తి పన్ను వసూళ్ల తీరును స్వయంగా తెలుసుకొనేందుకు ఆయన బుధవారం రేకుర్తి, సవరన్‌స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో తనిఖీ చేశారు. పన్ను వసూళ్లలో అలసత్వం వహించొద్దని, మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, అదనపు కమిషనర్ స్వరూపరాణి ఆస్తిపన్ను వసూళ్లను నేరుగా పర్యవేక్షించారు. ప్రభుత్వం కల్పించిన 90శాతం వడ్డీ రాయితీని వినియోగించుకోవాలంటూ అవగాహన కల్పించారు. ఈ క్రమంలోనే భగత్‌నగర్‌లోని గురుద్వార్ స్వాధీనంలో ఉన్న భవనానికి సంబంధించిన రూ.2,89,144 చెల్లించారు. బుధవారం ఒక్కరోజు రూ.20 లక్షల 9 వేలు ఆస్తి పన్ను వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. 18,19 డివిజన్ల పరిధిలోని రేకుర్తి శివారులో ఉన్న సుమారు 800 ఇండ్ల యజమానులు ఈనెల 24వ తేదీలోపు పన్ను చెల్లించాలని, రేకుల షెడ్డు వేసుకుని ఇంటి నంబర్లు తీసుకున్న వీరు కొన్నేళ్లుగా రూ.29,54,612 బకాయిలు ఉన్నారని, చెల్లించకుంటే ఇంటి నంబర్లు తొలగిస్తామని బల్దియా అధికారులు వారిని హెచ్చరించారు.

నల్లాలకు మీటర్లొద్దు

కరీంనగర్ కార్పొరేషన్: మున్సిపల్ నల్లాలకు మీటర్లు బిగించొద్దంటూ నగరంలోని 31వ డివిజన్ గాయత్రినగర్ వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 24 గంటల నీటి సరఫరా చేయడంలో భాగంగా, హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో నల్లాలకు మోటార్లు బిగించే కార్యక్రమం నెలలుగా సాగుతోంది. బుధవారం గాయత్రినగర్ రోడ్ నంబర్ 4 ప్రాంతానికి సిబ్బంది నల్లాలకు మోటార్లు బిగించేందుకు వెళ్లారు. అయితే డబ్బులు అధికంగా వసూలు చేసేందుకే నల్లాలకు మీటర్లు పెడుతున్నారని ఆరోపిస్తూ స్థానికులు సిబ్బందిని అడ్డుకున్నారు. ముందు తమ ప్రాంతంలో డ్రైనేజీలు నిర్మించాలని, మౌలికవసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నల్లాకు మీటర్లు బిగించేది లేదన్నారు. కాగా నల్లాకు మీటర్ బిగించడం వల్ల నష్టం లేదని, 24 గంటల నీటి సరఫరాలో భాగంగా మీటర్‌లు బిగిస్తున్నారని సిబ్బంది నచ్చచెప్పారు. దీనితో కొన్ని ఇండ్లల్లో మీటర్లు బిగించడానికి పలువురు అంగీకరించారు.

అడుగంటిన ఎస్సారెస్పీ!



- 19 టీఎంసీలకు పడిపోయిన నిల్వలు
- ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.30 టీఎంసీలు
- గతేడాది ఇదే రోజు 33.764 టీఎంసీలు
- ఈ నెల 25 వరకే చివరి నీటి తడి ఇస్తామన్న అధికారులు
- యాసంగి పంటలు పండేనా?
- ఆందోళనలో ఉమ్మడి జిల్లా రైతులు

జగిత్యాల అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు సాగు, తాగు నీరందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) నీటి నిల్వలు రోజురోజుకూ తగ్గుతూ బుధవారం నాటికి 19.316 టీఎంసీలకు పడిపోయింది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రాజెక్టు అధికారులు సైతం జోన్–1 ఆయకట్టు(డీ–5 నుంచి డీ–53)కు ఈ నెల 25 వరకు మాత్రమే చివరి సాగు నీటి తడి ఇస్తామని ప్రకటించారు. ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుతుండటంతో వేసవిలో సాగు చేసిన వరి పంట పండేనా అని అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

ఇష్టారీతిన వినియోగంతోనే సమస్య

ఈ ఏడాది ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినప్పటికీ ఓ ప్రణాళిక అంటూ లేకుండా నీటిని ఇష్టారీతిన వినియోగించడంతో సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధులు చెప్పిందే వేదం, అవసరమున్నా, లేకున్నా, వానాకాలం, ఎండాకాలం తేడా లేకుండా ఎస్సారెస్పీ అధికారులు ఎప్పుడు పడితే అప్పుడు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినప్పుడు మాత్రమే వరద నీటిని గోదావరిలోకి విడుదల చేయాల్సి ఉండగా నిబంధనలకు తిలోదకాలిచ్చారు. వరద కాల్వకు సైతం కాకతీయ ప్రధాన కాల్వ మాదిరిగా నీటిని విడుదల చేస్తుండటం కాల్వ ఆయకట్టు రైతులకు సమస్యగా మారింది. ఎస్సారెస్పీ కాల్వలకు ఇష్టారీతిన తూములు ఏర్పాటు చేసి, సాగు నీటిని చెరువులకు మళ్లిస్తున్నారు. దీంతో, చివరి ఆయకట్టుకు నీటి విడుదల సరిగా జరగక ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడో ఓచోట అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు.

7 లక్షల ఎకరాల ఆయకట్టు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎస్సారెస్పీ కింద 7 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే.. ఇందులో 3 లక్షల ఎకరాలు ఒక్క జగిత్యాల జిల్లాలోనే ఉంది. ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగికి వరినే అత్యధిక విస్తీర్ణంలో(80 శాతం) సాగు చేశారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వరి పంట పొట్ట దశలో ఉంది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పుడు నీరందకపోతే చాలా కష్టం. ప్రాజెక్టు నుంచి మరో 9 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేసే అవకాశం ఉంది. తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీల నీటిని డెడ్ స్టోరేజీగా ప్రాజెక్టులోనే ఉంచుతారు. అయితే, రానున్న రోజుల్లో ఎస్సారెస్పీ నుంచి సాగు నీరందే పరిస్థితులు కనిపించడం లేదు. రైతులు వ్యవసాయ బావులపైనే ఆధారపడి, పంటలను కాపాడుకోవాల్సిన దుస్థితి ఎదురవనుంది.

ప్రాజెక్టులోకి 203.992 టీఎంసీలు

ఎస్సారెస్పీలోకి గత జూన్ 1 నుంచి ఇప్పటివరకు 203.992 టీఎంసీల నీరు చేరింది. అయితే, ప్రాజెక్టులో ఉన్న పాత నీటిని కలుపుకొని మొత్తం 205.658 టీఎంసీలను సాగు, తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,091.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1,064.40 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 90.30 టీఎంసీలకు ప్రస్తుతం 19.316 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఇదే రోజున 33.764 టీఎంసీలు ఉండటం గమనార్హం. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వకు 3,500 క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 250, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 347, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో చెరువులకు 312, సరస్వతి కెనాల్‌కు 400, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ధాన్యం కొనుగోల్‌కు కసరత్తు

- ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోళ్లు
- కోతల వెంటే కేంద్రాల ప్రారంభం
- కేంద్రాలపై కార్యాచరణ, అవసరాలపై నివేదిక
- అన్నదాతకు అకాల వర్షాల భయం



కరీంనగర్ అర్బన్: ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. యాసంగి పంట ఇప్పుడిప్పుడే కోతకు చేరుకోగా ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో 1,03,257 హెక్టార్లలో వరి సాగవగా 6.12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని అధికారుల అంచనా. ఇందులో విత్తనం, స్థానిక అవసరాలకు 2,04,145 మెట్రిక్ టన్నులు పోనూ 4,08,169మె.టలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోళ్లపై గురువారం హైదరాబాద్‌లో పౌరసరఫరాల అధికారులతో రాష్ట్రస్థాయి సమావేశం జరగనుంది. జిల్లా నుంచి అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.రజనీకాంత్, డీఎస్వో గౌరీశంకర్ హాజరుకానున్నారు. జిల్లామొత్తంగా 351 కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు రూపొందించగా 320 వరకు కేంద్రాల్లో కొనుగోళ్లు జరగనున్నట్లు సమాచారం. వానాకాలం కొనుగోళ్లకు సంబంధించి 338 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేశారు.

ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోళ్లు

జిల్లాలో కరీంనగర్ అర్బన్‌తో పాటు 15 మండలాల్లో వరి సాగుచేశారు. హుజూరాబాద్, వీణవంక, చిగురుమామిడి, సైదాపూర్, జమ్మికుంట, ఇల్లందకుంట, శంకరపట్నం, మానకొండూరు, తిమ్మాపూర్ మండలాల్లో సాగైన వరిలో 40శాతం విత్తన వరి సాగు చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుండగా ఇతర మండలాల్లో పూర్తిగా దొడ్డురకం సాగు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కోతల వెంటే కొనుగోళ్లు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఏప్రిల్ మొదటి వారంలో పంట చేతికి రానుండగా ఇక అప్పటి నుంచే కొనుగోళ్లు మొదలవనున్నాయి.

గన్నీ సంచుల నిల్వ, అవసరం ఇలా

గన్నీ సంచులు ఉన్నవి:	40,56,897
ఇందులో కొత్తవి:	29,44,304
ఒకసారి వాడినవి:	9,87,064
రేషన్ డీలర్ల వద్ద:	1,25,529
కావాల్సినవి :	25,65,977

సామగ్రి అవసరాలిలా

వస్తువు	ఉన్నవి	కావాల్సినవి
టార్పాలిన్లు	7,106	575
ప్యాడీ క్లీనర్లు	301	21
మాయిశ్చర్ మీటర్లు	424	27
ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్లు	745	19

ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు రెండు రోజుల్లో రానున్నాయి.

అన్నదాతకు అకాల భయం

యాసంగి పంట దిగుబడులు చేతికందే సమయంలోనే అకాల వర్షాలు వెంటాడటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. గత యాసంగిలోనూ పలుచోట్ల వడగళ్ల వాన విరుచుకుపడగా మరిన్ని చోట్ల ఈదురుగాలులు పంటను నేలరాల్చాయి. ఈ క్రమంలో ఈ యాసంగిలో కూడా అకాల వర్షాలు, ఈదురుగాలులు కర్షకులను కలవరానికి గురిచేస్తున్నాయి. ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇదే పరిస్థితి నెలకొంటుండగా అధికార యంత్రాంగం కోతల వెంటే కొనుగోలు చేస్తే రైతులకు ప్రయోజనం. లేదంటే పంట ఆరబోతకే సమయం వృథా కానుంది.

జిల్లాలో సాగైన వరి: 1,03,257 హెక్టార్లు
పంట దిగుబడి అంచనా: 6,12,314మెట్రిక్ టన్నులు
విత్తనం, స్థానిక వినియోగం: 204145మె.ట
కొనుగోలు కేంద్రాలకు రానున్న దిగుబడి: 4,08,169మె.ట

ప్రభుత్వ కనీస మద్దతు ధర(క్వింటాల్‌కు)
గ్రేడ్ 'ఏ' రకం: రూ.2,203
సాధారణ రకం: రూ.2,183

మొత్తం కొనుగోలు కేంద్రాలు: 353
ఐకేపీ: 56, పీఏసీఎస్: 245
డీసీఎంఎస్: 51, హాకా: 01

జిల్లాలో మొత్తం రైస్ మిల్లులు: 169
రా రైస్ మిల్లులు: 82
బాయిల్డ్ రైస్‌మిల్లులు: 87

ఇంటి వంట ముద్దు.. బయటి ఫుడ్ వద్దు

- ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వండి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: ఇంటి ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మగవారికి వంటల పోటీలు నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై వంటకాలు రుచి చూశారు. మగవారు చాలా బాగా వంటలు చేశారని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయట దొరికే జంక్‌ఫుడ్‌ను తీసుకోవడం వల్ల అధిక అనర్థాలు ఉంటాయని తెలిపారు. సంప్రదాయ వంటకాలపై దృష్టి సారించాలని అన్నారు. మహిళలకు వంటల్లో మగవారు కొంతసాయం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మహిళలు పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని అన్నారు. వంటల పోటీల్లో కొత్తపల్లి సెక్టార్ పరిధిలోని ఆసిఫ్‌నగర్–4 అంగన్వాడీ సెంటర్‌కు ప్రథమ బహుమతి లభించింది. సురేశ్– వెన్నెల దంపతులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్వాడీ టీచర్ మెంగాని పద్మలకు కలెక్టర్ బహుమతి అందజేశారు. అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, డీఈవో జనార్దన్‌రావు, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

పిచ్చుకలకు సేవ చేస్తే దేవుళ్లకు చేసినట్లే

వాతావరణంలో వస్తున్న మార్పులతో పిచ్చుకలు అంతరించిపోతున్నాయని, వాటిని అందరం కలిసి సంరక్షించుకుందామని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని ఫిలింభవన్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. విద్యార్థులు తమ ఇండ్లలోకి వచ్చే పిచ్చుకలను కాపాడాలని అన్నారు. పిచ్చుకలకు సేవ చేస్తే దేవుళ్లకు సేవ చేసినట్లేనని అన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ ఇండ్లలో పిచ్చుకలను కాపాడుకునేందుకు గూడు ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పిచ్చుకల గూడు ఏర్పాటు చేయడం, ఆహారం, నీటి సౌకర్యం కల్పించే అంశంతో పాటు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీటిని కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ప్రతిభ చూపిన వారికి కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, సెక్టోరల్ అధికారి అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి మధుసూదనాచారి, న్యాయ నిర్ణేతలు గాజుల రవీందర్, సరిత, కె.ఎస్ అనంతచార్య, లక్ష్మణ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి యువకుని మృతి



రాకేశ్ మృతదేహం

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామశివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన అలువాల రాకేశ్(21) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నవి. గోపాల్‌రావుపేటకు చెందిన స్నేహితుడు రాగుల అరవింద్‌తో కలిసి రాకేశ్ గ్రామంలో జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. చొప్పదండి మండల కేంద్రంలోని దాబాలో డిన్నర్ చేయడానికి ఇద్దరూ బైక్‌పై వెళ్లారు. వెంకట్రావుపల్లి శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. ప్రమాదంలో రాకేశ్‌తో పాటు అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెనకలా వస్తున్న బంధువులు క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా రాకేశ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి అల్వాల రాజేశ్వరి ఫిర్యాదుతో నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

బైక్ దొంగ రిమాండ్



స్వాధీనం చేసుకున్న బైక్‌తో పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఓబులాపూర్‌లో ఇటీవల జరిగిన సమ్మక్క సారలమ్మ జాతరలో చోరీకి గురైన బైక్‌ను తంగళ్లపల్లి పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై దాస సుధాకర్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణం ఇంద్రానగర్‌కు చెందిన పెంట శ్రీనివాస్ సమ్మక్క జాతరకు తన బైక్‌పై వచ్చి, రాత్రి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మండెపల్లికి చెందిన అల్లెపు నవీన్ బైక్‌తో పట్టుబడగా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థికి తీవ్రగాయాలు

మానకొండూర్: మండల కేంద్రంలోని తూర్పుదర్వాజ చౌరస్తా సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో పదో తరగతి విద్యార్థికి గాయాలయ్యాయి. మానకొండూర్‌కు చెందిన గొల్ల చరణ్‌తేజ్(15) పది పరీక్షలు రాస్తున్నాడు. బుధవారం బైక్‌పై స్నేహితుడి దగ్గరికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మానకొండూర్‌కు చెందిన ట్రాక్టర్ ఢీకొట్టింది. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఆక్సిడెంట్‌తో మరో నాలుగు పరీక్షలు రాయలేక పోతున్నానని చరణ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

మధ్యాహ్నం బడి కష్టాలు!

- పదో తరగతి సెంటర్ ఉన్న చోట పనివేళల మార్పు
- మధ్యాహ్నం 3గంటల తరువాత అందుతున్న మధ్యాహ్న భోజనం
- జగిత్యాలలో పరీక్ష ఉన్నా లేకున్నా.. మధ్యాహ్నమే పనివేళలు
- అయిష్టంగానే హాజరవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వేసవి మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల పిల్లల్ని ఎండల బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ఒంటి పూట బడులను ప్రారంభించింది. సాధారణంగా ఒంటి పూటబడి అంటే ఉదయం పూటే తరగతులు ముగించుకుని మధ్యాహ్నం ఎండ జోరు పెరిగేలోగా విద్యార్థులు ఇళ్లు చేరుకోవాలి. అయితే, ఇక్కడే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాదిమంది పిల్లలకు చిక్కులు ఎదురవుతున్నాయి. ఆ వెంటనే పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ప్రతీ మండలంలోని రెండు లేదా మూడు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు నడుస్తున్నాయి. దీంతో విధి లేక ఒంటి పూట బడికి మధ్యాహ్నం సమయంలో హాజరవాల్సి వస్తుంది. పరీక్ష ఉన్న రోజుల్లో ఎలాగోలా ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్దుకుంటున్నారు. కానీ, ఒక్క జగిత్యాల జిల్లాలో పది పరీక్షలు ముగిసేదాకా మధ్యాహ్నం పనివేళలే కొనసాగుతాయని ఉన్నతాధికారులు చెప్పడంతో ఆ జిల్లా విద్యార్థులు కంగుతిన్నారు. చేసేది లేక ఎండలోనే పాఠాలకు హాజరవుతున్నారు.


ఏంటి సమస్య?

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులు మొదలయ్యాయి. మూడు రోజుల వ్యవధితో పదో తరగతి పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలు కూడా మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఒంటిపూట బడి అమలు చేసే విషయంలో వీరు పనివేళలను మార్చుకోవాల్సి వచ్చింది. సాధారణంగా ఉదయం 7.45 గంటలకు మొదలైన పాఠశాల పనివేళలు మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాగాలి. అయితే, పరీక్షా కేంద్రాలు కేటాయించిన చోట విద్యార్థులు తమ ఒంటి పూట బడిని అనివార్యంగా మార్చుకోవాల్సి వచ్చింది. దీంతో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అన్ని జిల్లాల విద్యార్థులు మధ్యాహ్నం 1 గంటలకు పాఠశాల పనివేళలు మొదలై సాయంత్రం 5 గంటల వరకు సాగుతున్నాయి. ఈక్రమంలో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, ఉక్కపోత వల్ల పాఠాలు సరిగా వినలేక పోతున్నారు. మరోవైపు మధ్యాహ్నం ఒంటిపూట పాఠశాల నడుస్తున్న క్రమంలో అందులో విద్యనభ్యసించే వారికి భోజనం పూర్తయి వడ్డించే సరికి మ.3గంటలు దాటుతోంది. అప్పటి వరకు ముఖ్యంగా హాస్టల్‌లో ఉండే పిల్లలు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల తరగతుల్లో ఫ్యాన్లు, తాగునీరు సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈనెల 30వ వరకు పదో తరగతి పరీక్షలు నడుస్తాయి. రోజు విడిచి రోజు పరీక్షలు జరగనున్నాయి. సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో పరీక్షలేని రోజుల్లో ఉదయం పూటే తరగతులు జరుగుతున్నాయి. కానీ, ఒక్క జగిత్యాల జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. కనీసం పది పరీక్షలు లేని రోజుల్లోనైనా తమకు ఉదయంపూట బడి నడిచేలా జిల్లా విద్యాధికారి (ఈడీవో) అయినా చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లా	పరీక్ష కేంద్రాలు	పది విద్యార్థులు	1–9 విద్యార్థులు
కరీంనగర్	75	12,458	38,877
సిరిసిల్ల	45	7,725	68,775
జగిత్యాల	35	6,475	25,535
పెద్దపల్లి	64	11,394	47,433

అమెరికా వర్సిటీతో 'జ్యోతిష్మతి' ఎంవోయూ

- జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్ రావు



ఒప్పందపత్రం చూపుతున్న జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-సైన్స్ విద్యా పరిశోధన, ఉన్నత విద్యలో ప్రవేశాల సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. లూసియానా టెక్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ ఎక్స్పోజర్, ఎంఎస్ ప్రోగ్రాంలో అడ్మిషన్లు పొందడంలో యోగ్యతను అందిస్తుందని తెలిపారు. తనతో పాటు లుసునియా టెక్ వర్సిటీ అధ్యక్షుడు జేమ్స్ అండర్సన్ ఎంవోయూపై సంతకం చేసినట్లు వెల్లడించారు.

సహకారం ఇలా..

మాస్టర్స్ ప్రోగ్రామ్ అడ్మిషన్: లూసియానా టెక్ గ్రాడ్యుయేట్ స్కూల్, ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఆఫీస్ స్టాఫ్ ఫ్యాకల్టీ సలహాదారుల మార్గదర్శకత్వంతో లూసియానా టెక్ వర్సిటీలో గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ కోసం జ్యోతిష్మతి విద్యార్థులకు ఎంవోయూ సులభతరం చేస్తుంది.

ఆర్థిక సాయం (స్కాలర్‌షిప్): జ్యోతిష్మతి విద్యార్థులకు గ్రాడ్యుయేట్ అసిస్టెంటిషిప్ల రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించడానికి లూసియానా టెక్ సాధ్యమైన చోట చర్యలు తీసుకుంటుంది.

ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్: సహకార ప్రయత్నాలను బలోపేతం, సంస్థల మధ్య అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

వృత్తిపరమైన అభివృద్ధి: జ్యోతిష్మతి, లూసియానా వర్సిటీలు కలిసి వర్క్‌షాప్‌లు, సెమినార్లు అధ్యాపక సభ్యులకు, విద్యార్థులకు వత్తిపరమైన నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించడానికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం కోసం కలిసిపనిచేస్తాయి.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ క్వెస్ట్ ఒలింపియాడ్ నిర్వహించిన జాతీయస్థాయి గణిత, సైన్స్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ఆర్.శ్రీతన్(3వతరగతి), కె.హాసీష్‌రెడ్డి(4వ), రెడ్డి శ్రీరాజ్‌రెడ్డి(5వ), శివేన్‌రెడ్డి, సిద్విక్, ఎస్.సహార్ష్(6వ), శ్లోకా పున్నమ, వి.శ్రీచరణ్‌రెడ్డి, పి.వంశీకృష్ణా(7వ), స్వరవిస్మత్, సుమేదా మడమరాజు(8వ), పి.శివాణి, జె.హన్సికరావు, క్వెస్ట్ సైన్స్ ఒలంపియాడ్‌లో జి.జోయల్ డేవిస్, జి.శివాన్స్‌రెడ్డి, వి.సహస్ర(4వ), సిద్విక్ నార్ల, పి.కృష్ణచైతన్యశ్రీ(6వ), జి.ప్రన్మాయరెడ్డి, శ్రీహిత చెద్దిరెడ్డి, శ్లోకా పున్నం(7వ), ఎం.అతీష్‌పటేల్(8వ), సీహెచ్ సహస్ర(9వ) బహుమతులు గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బుధవారం అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా 'గురుకుల' నిర్వహణ

- వసతులు, సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ డిమాండ్



భోజనం కోసం లైన్‌లో ఉన్న విద్యార్థులు

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల)పాఠశాల నిర్వహణ జరుగుతోందని, వసతులు, నిర్వహణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడికుమార్ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. వేడినీళ్లు పడి తీవ్రగాయాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల బిల్డింగ్‌లోకి వర్షం నీరు చేరి దుర్వాసన వస్తోందని, పాఠశాల ఆవరణలో విత్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్నాయని, ఫ్లోరింగ్ లేదని, వంటగది అపరిశుభ్రంగా ఉందని, భోజనంలో నాణ్యత లేదని ఆరోపించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిబ్బంది, మరుగుదొడ్ల నిర్మించాలన్నారు. పని చేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలన్నారు. సంబంధిత అధికారులు భవనాన్ని ఖాళీ చేయించి మౌలిక వసతులు ఉన్న నూతన భవనంలోకి మార్చాలని లేదంటే సొంత భవనం నిర్మించాలన్నారు. అలా చేయకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గుజ్జుల అశోక్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎస్సై మృతి



కిషన్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న మార్కొండ కిషన్(59) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. కరీంనగర్ జ్యోతినగర్‌లో ఉంటున్న కిషన్ తన ఇంట్లోనే గుండెలో నొప్పి రావడంతో చనిపోయాడు. జిల్లాలోని తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన కిషన్ 1984లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. 40ఏళ్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పని చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అతి ఉత్కృష్ట సేవ పతకం అందుకున్నారు. కిషన్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

రైతును కాటేసిన కరెంట్



రాజయ్య మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో గుండారపు రాజయ్య(60) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డిల కథనం ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన ఆరెల్లి వీరయ్య– దీవెనమ్మకు చెందిన పొలాన్ని రాజయ్య కౌలుకు తీసుకున్నాడు. ఈ యాసంగిలో వరి పండిస్తున్నాడు. రోజూమాదిరిగానే బుధవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో కిందపడి ఉన్న విద్యుత్ తీగను గమనించక దానిపై అడుగు వేశాడు. వెంటనే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఎల్లెమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై కూలీ మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లిలో ఓ పాత ఇంటిని కూల్చే పనులు చేస్తున్న కూలీ ఒల్లెపు ఉపేందర్ (25) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బుధవారం మరణించాడు. పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఉపేందర్ పాత ఇంటిని కూల్చుతుండగా అందులో ఉన్న ఓ ఇనుపరాడ్ ఇంటికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సైలు సుధాకర్‌రావు, మల్లేశ్ ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

మా నాన్న ఎలా చనిపోయాడు!

- వంట మనిషి సుబ్బారావు కుటుంబ సభ్యుల వేదన



వేడుకుంటున్న సుబ్బారావు కుటుంబసభ్యులు

జ్యోతినగర్(రామగుండం): వంటలు తయారు చేసే ఓ కాంట్రాక్టు కంపెనీ నిర్వాహకులు పనులు చేసేందుకని తమ తండ్రి ఈర సుబ్బారావు(58)ను రామగుండం ఎన్టీపీసీకి తీసుకొచ్చారని, ఆ తర్వాత ఏమైందో గానీ, కొద్దిరోజులకే శవాన్ని అప్పగించారని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన బాధితుల కథనం ప్రకారం.. సుబ్బారావు పలు కంపెనీల్లో వంటలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గతేడాది మార్చిలో ప్రభాత్ ఇంజినీరింగ్ వర్క్స్ కంపెనీ ద్వారా ఎన్టీపీసీ రామగుండం ప్లాంట్ క్యాంటీన్‌లో పనులు చేసేందుకు రప్పించారు. అయితే, ఆ కంపెనీకి చెందిన ఓ వ్యక్తి 2023జూలై 30న సుబ్బారావు చనిపోయాడని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే రామగుండం బయలుదేరిన కుటుంబసభ్యులు.. వరంగల్ చేరుకునేలోగా ఆ వ్యక్తి మరోసారి ఫోన్‌చేసి మృతదేహాన్ని భద్రాచలం పంపిస్తున్నామని చెప్పాడు. వెనుదిరిగిన కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకుందామని నచ్చజెప్పి వెళ్లిపోయారు. తమ తండ్రి ఎలా చనిపోయాడని కంపెనీ నిర్వాహకులను ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వలేదు. పైగా సెటిల్ చేద్దామన్నారు. ఈవిషయంలో పోలీసులకు ఫిర్యాదు చేకుండా అడ్డుకున్నారు.

న్యాయం చేయండి – ఈర మురళీ కృష్ణ(కుమారుడు), కుల్పగిరి దేవకి(కూతురు), భద్రాచలం

వంట పనుల కోసం మా నాన్నను ఎన్టీపీసీ తీసుకొచ్చిన కంపెనీ నిర్వాహకులు చంపి మృతదేహాన్ని అంబులెన్స్‌లో మా ఇంటికి తీసుకొచ్చి వదిలేసి వెళ్లిపోయారు. ఆయన చనిపోయి ఏడు నెలలు కావస్తున్నా కంపెనీ వారు మమ్మల్ని సంప్రదించడం లేదు. ఫోన్‌చేస్తే సమాధానం ఇవ్వడం లేదు. మృతదేహంతో పంపిన కాగితాల్లో కూడా మృతికి గల వివరాలు పొంతన లేకుండా ఉన్నాయి. న్యాయం చేయాలని ఎన్టీపీసీ పోలీసులకు విన్నవించాం. మాది పేద కుటుంబం. మా అమ్మ మంగ గతంలోనే చనిపోయింది. మా నాన్న సుబ్బారావు మా ఐదుగురు సంతానాన్ని కష్టపడుతూ పోషించాడు. ఇప్పుడు నాన్న లేడు. మాకు ఆధారం లేకుండా పోయింది. మా కుటుంబానికి న్యాయం చేయండి. తమ్ముడు విజయదుర్గాప్రసాద్ కూడా గతంలోనే చనిపోయాడు. ఇప్పుడు మాకు ఆసరా లేకుండాపోయింది. కార్మిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు జోక్యం చేసుకుని మా కుటుంబానికి న్యాయం చేయండి.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని మృతి



హన్సిక(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: దుబ్బపల్లి గ్రామ సమీప రాజీవ్ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి తెలికుంట హన్సిక (17) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె సోదరుడు భానుప్రకాశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన తెలికుంట హన్సిక జూలపల్లి మండలం తెలుకుంటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతోంది. బుధవారం కరీంనగర్ విద్యానగర్‌లోని తన బాబాయి ఇంటికి పనిపై వెళ్లింది. బాబాయ్ కొడుకు భానుప్రకాశ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్‌కు బయలు దేరింది. ఈక్రమంలో దుబ్బపల్లి వద్ద లారీ వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హన్సిక తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రగాయాలైన భానుప్రకాశ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, కూలీ పనులు చేస్తూ తన ఇద్దరు కూతుళ్లను పెంచి పెద్దచేసిన పద్మ.. చేతికి అందివచ్చిన చిన్నకూతురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో కన్నీటిపర్యంతమవుతోంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో 9 మందికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి పట్టుబడిన కేసులో బుధవారం కరీంనగర్ కోర్టు 9 మందికి జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ తెలిపారు. 20 మందిని కోర్టులో ప్రవేశపెట్టగా.. ముగ్గురికి ఐదు రోజుల జైలు, ఆరుగురికి మూడు రోజుల జైలు, మొత్తం రూ.19,500 జరిమానా విధించారు. మిగతా 11 మందికి రూ.15,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

ఎదురెదురుగా ఆర్టీసీ బస్సులు ఢీ

- తృటిలో తప్పిన ప్రమాదం



ఢీకొన్న బస్సులు

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తా ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే దారిలో బుధవారం ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. తృటిలో పెను ప్రమాదం తప్పింది. బస్సులు వెళ్లే రహదారి గుంతలమయంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బస్సులు వెళ్లే దారిని మరమ్మతు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

సిరిసిల్ల వాసికి తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం

- చరిత్ర పరిశోధనలో కృషికి అందజేత



కీర్తి పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరాజు

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు చెందిన చరిత్ర పరిశోధకుడు డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు మరో పురస్కారం అందుకున్నారు. వివిధ రంగాల్లో కృషిచేసిన వ్యక్తులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా అందించే కీర్తి పురస్కారాల్లో భాగంగా జిల్లా వాసి సి.శ్రీనివాసరాజును పరిశోధన విభాగంలో ఎంపిక చేసింది. బుధవారం వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో తిక్కవరపు రామిరెడ్డి స్మారక పురస్కారాన్ని అందజేసింది. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ తంగెడ కిషన్‌రావు, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీనివాసరాజు స్వస్థలం బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి. చరిత్ర పరిశోధన సమితిని స్థాపించారు. చారిత్రక ప్రాధాన్యం గల ప్రాంతాలను సందర్శించి అనేక విశేషాలను వెలుగులోకి తెస్తున్నారు. ఈక్రమంలో బహదూర్ కొండలరాయుడు నవల, భరతావని అనే కావ్యం, చక్రేశ్వరిదేవి, బొమ్మలమ్మగుట్ట శతకం, ప్రిన్సెస్ యశోధర అనే చారిత్రక నాటకం, ముసునూరి కాపయ నాయకుడు నవల, అన్‌బీటెన్ ఎంపైర్ పేరిట వేములవాడ చరిత్ర, కెప్టెన్ రఘునందన్ జీవిత చరిత్ర, హిస్టరీ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, మానవ జీవన పరిరక్షణ పేరిట కవితలు వెలువరించారు.

కదిలించే కవిత్వం



కరీంనగర్‌కల్చరల్: కదిలేది.. కదిలించేది.. పెనునిద్రను వదిలించేది.. మనిషిని ముందుకు నడిపించేది కవిత్వం. సమాజ శ్రేయస్సే కవిత్వం పరమావధి కావాలన్నది నిర్వివాదాంశం. సామాజిక చైతన్యాన్ని కలిగించే కవితలు ప్రపంచాన్ని శాసిస్తాయి. 1999లో ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. గురువారం కవితా దినోత్సవం సందర్భంగా జిల్లా కవుల అభిప్రాయాలు..

ప్రజల పక్షాన నిలవాలి



కవిత్వం హృదాయాలను కదిలించే విధంగా ఉండాలి. సమాజ చైతన్యానికి దోహదం చేయాలి. రుగ్మతల నివారణకు ఉపయోగపడాలి. పాలకులను అప్రమత్తం చేసేలా ఉండాలి. కవులు తమ రచనలతో ప్రజల పక్షాన నిలవాలి. ప్రజల సమస్యలను కవిత్వం అద్దం పట్టాలి.

– దాస్యం సేనాధిపతి, కవి, రచయిత, విమర్శకుడు

ఆటోనే కవిని చేసింది



ఆటో నడుపుకుని జీవించే నన్ను ఓ వర్ధమాన కవిగా నిలుపుతోంది కవిత్వమే. ఎన్నీల ముచ్చట్ల ద్వారా కవితా స్ఫూర్తితో ఈ రంగంలోకి అడుగిడిన నేను ప్రపంచ తెలుగు మహాసభల్లో నా కవిత్వాన్ని వినిపించాను. పలువురి కవితలను చదవడం, కవి సమ్మేళనాలకు హాజరుకావడం నాలో కవిత్వంపై మరింత ఆసక్తిని పెంచింది. నా కవిత్వం రైతులు, సైనికులు, పీడితతాడిత జనుల కోసమే.

– ఖలీద్, ఆటో కవి

మానవత్వాన్ని తట్టి లేపుతుంది



కడుపులోంచి తన్నుకువచ్చే దుఃఖం నా కలం. వలవలా శోకంలా రాలిన కన్నీరు నా కవితాత్మ. కవిత్వమే నా హృదయం. కవిత్వమే నాకు ప్రాణ వాయువు. కవిత్వం మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపుతుంది. మనిషి కవిత్వాన్ని అవాహన చేస్తే జీవితం కడిగిన ముత్యం అవుతుంది.

– అన్నవరం దేవేందర్, సాహితీవేత్త

సమాజహితం కోరుకుంటుంది



సాహిత్యం అంటే సమాజానికి హితాన్ని చేకూర్చేది. సమాజంలో ఎంత ఎక్కువగా కవులు తయారైతే అంత మంచి జరుగుతుంది. స్పందించే గుణం, చైతన్యాన్ని చూపించే గుణం కవులలో అధికం. కవి ప్రతి చిన్న విషయానికి స్పందిస్తాడు. కవులను ప్రోత్సహించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

– గాజుల రవీందర్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



సాయికుమార్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: నగరంలోని కమాన్ ఏరియాలో ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నగరంలోని కమాన్ ఏరియాకు చెందిన నాళ్ల సాయికుమార్(36) అనే వ్యక్తి తరచూ మద్యం తాగుతూ బానిసయ్యాడు. సాయికుమార్ తన సోదరుడితో కలిసి రేషన్ దుకాణం నడుపుకోనేవాడు. బుధవారం తన రేషన్ షాపులో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ విషయంపై సాయికుమార్ సోదరుడు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కరీంనగర్: జిల్లాలో వడగళ్ల వానలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఎకరాకు రూ.25వేల చొప్పున ఇచ్చి వెంటనే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వేలాది ఎకరాల పంటలు నష్టపోయాయని, వడగళ్ల వాన రైతన్నను తీవ్ర ఆందోళన గురి చేసిందని అన్నారు. వరి, మామిడి, బత్తాయి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్ట అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. గ్రామాల్లో కరెంట్ తీగలు పడి చాలాచోట్ల విద్యుత్ అంతరాయం నెలకొందని, అధికారులు పనులు పూర్తి చేయాలన్నారు.

కొత్తపల్లి: వడగళ్ల వానతో నష్టపోయిన రైతులు, ఇతర బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షానికి నష్టపోయిన పంటకు ఎకరానికి రూ.10వేల చొప్పున చెల్లించాలన్నారు.

నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గురువారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 11కె.వి. కలెక్టరేట్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని కరీంనగర్ రూరల్ ఎంపీడీవో, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఎల్ఐసీ కార్యాలయాలు, శ్వేత హోటల్ ప్రాంతాలు, 11కె.వి. భగత్‌నగర్ ఫీడర్ పరిధిలోని అర్విన్ ట్రీ స్కూల్, ఎర్రగుట్ట, వాసుదేవ కాలనీలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 9 వరకు 11కె.వి. ఎల్లమ్మ ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, పోచమ్మవాడ, కోతిరాంపూర్, డంప్‌యార్డు, కేబుల్ బ్రిడ్జి ప్రాంతాల్లో సరఫరా ఉండదని టౌన్1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

బిల్డర్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం


సభ్యులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అస్తపురం నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మ్యాక శ్రీనివాస్, కోశాధికారిగా దుర్గం ప్రభాకర్ నూతనంగా ఎన్నిక కాగా.. వీరిని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. గొల్లె కిష్టయ్య, దుర్గం శివ, అస్తపురం(మీసాల) కొండగట్టు, నాగుల వెంకటేశ్‌గౌడ్, అస్తపురం తిరుపతి, అస్తపురం విక్రమ్, కుంబాల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నాయకుడి మృతిపై సంతాపం


సంతాపం ప్రకటిస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: రాజబహదూర్ వెంకటరామారెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం మాజీ నాయకుడు(విశ్రాంత డిప్యూటీ కలెక్టర్) పింగిలి భాస్కర్‌రెడ్డి మంగళవారం మృతిచెందారు. మాజీ శాసనసభ్యుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, మాజీ అధ్యక్షుడు మూల ప్రభాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, బీజేపీ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలుంచి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు పింగిళి రవీందర్‌రెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కీర్తి పురస్కారాలు అందుకున్న జిల్లావాసులు



కరీంనగర్‌కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారాలు బుధవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ తంగెడ కిషన్‌రావు చేతుల మీదుగా రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి, కాలమిస్టు, పత్రికల వ్యాసాల రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, రచయిత, పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కల్వకోట సంతోశ్‌బాబు, రచయిత, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు నగదు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.




వామ్మో.. ఆర్టీసీ బస్సా..

ఆడవాళ్లకు ఉచిత బస్సు పుణ్యమా అని ఏ ఆర్టీసీ బస్సు చూసినా వారితో కిక్కిరిసిపోతున్నాయి. బుధవారం పద్మనగర్ బైపాస్ చౌరస్తాలో పెద్దఎత్తున మహిళలు ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు తరలివచ్చారు. ఆ బస్సు అప్పటికే సగం మంది మహిళలతో నిండి ఉంది. అప్పుడే ఉపాధిహామీ పథకం పనులు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లడానికి ఆ బస్సు ఎక్కేందుకు మహిళలు ప్రయత్నించగా.. సగం మంది మాత్రమే ఎక్కారు. మిగతా సగం మంది ఇదిగో ఇలా మరో బస్సు వచ్చేంతవరకు వేచి చూశారు. ఇది చూసిన పలువురు వామ్మో ఆర్టీసీ బస్సా అని అవాక్కయ్యారు.

– సప్తగిరికాలనీ(కరీంనగర్)

ప్రచారంలో పాల్గొంటే వేటే..

- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవీందర్ తెరాస పార్టీకి మద్దతుగా ప్రచారం నిర్వహించారని ఫిర్యాదులొచ్చాయి. రంగంలోకి దిగిన అధికారులు విచారణ చేయగా.. నిజమేనని తేలడంతో సస్పెన్షన్ వేటు వేశారు.
- అవే ఎన్నికల్లో చొప్పదండి మండలం అర్నకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ సీఈవో కుమారస్వామి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఫిర్యాదులొచ్చాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ సీఈవోను సస్పెండ్ చేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పదుల సంఖ్యలో ఉద్యోగాలను కోల్పోయారు. అందుకే నోటి మాట జాగ్రత్త.

- అమల్లోకి కోడ్
- ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్తా..
- ప్రచారంపై ప్రత్యేక నిఘా



కరీంనగర్‌అర్బన్: ఇన్నాళ్లు రాజకీయ నేతలతో కలిసి తిరిగాం కదా అని అలవాటులో పొరపాటుగా కలిస్తే ఇక అంతే సంగతి. పార్లమెంట్ 2024 ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన క్రమంలో ఉద్యోగులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన తరుణమిది. ప్రభుత్వ ఉద్యోగులు ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా వేటు పడటం ఖాయమే. ఎన్నికల నిబంధనల అమలులో ఉన్నతాధికారులు పక్కాగా వ్యవహరిస్తున్నారు. ప్రచారంలో పాల్గొన్నా, మద్దతు తెలిపినా సస్పెన్షన్ వేటు పడనుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున అధికారాలు ఎన్నికల సంఘానికి బదిలీ అయ్యాయి. ఉద్యోగులు ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా వేటు వేయడానికి ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం తమ విధులకే పరిమితం కావాలి తప్ప.. ఏ రాజకీయ పక్షానికి కొమ్ము కాయడం తగదని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు. నిరంతర నిఘాతోపాటు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ పోస్టులపై కూడా ఓ కన్నేసింది. ఎన్నికల్లో నాయకులు ఎలా ప్రచారం చేసుకున్నా, ఎటువంటి వ్యాఖ్యలు చేసినా ఏర్పడే ప్రభావం కన్నా.. ప్రభుత్వ ఉద్యోగులు చేసే ప్రచారం, వారి వ్యవహార శైలి మాత్రం పెను చిక్కులు తేనుంది.

సమావేశాలు.. సభలు వద్దు

ప్రభుత్వ ఉద్యోగులు తమను ఎవరూ గమనించడం లేదనుకొని ఎవరి సభలోనైనా లేదా సమావేశంలోనైనా పాల్గొంటే చాలు.. వేటు పడినట్లే. దానికి సంబంధించి వీడియో లేదా ఫొటోలు అధికారులకు అందినా, సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచినా కావాల్సినంత నష్టం జరుగుతుంది. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఏదో ఒక రాజకీయ పక్షానికి సానుకూలంగానో, వ్యతిరేకంగానో ఉంటూ సందర్భం వచ్చినప్పుడు అభిప్రాయాలను వ్యక్తపరుస్తుంటారు. ఇపుడిది పెను ముప్పే. ఆడియో, వీడియోల ద్వారా ఎవరైనా చిత్రీకరించి ఎన్నికల సంఘానికి కానీ.. అందుబాటులో ఉన్న యంత్రాంగానికి పంపినా.. లేదా ప్రచార మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ సమూహాల్లో పోస్టు చేసినా అంతే సంగతులని గత ఉదంతాలు చాటుతున్నాయి. ఇలాంటి ప్రచారాలపై నిరంతర నిఘా ఉంటున్న క్రమంలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే సమావేశాలకు హాజరు కాకపోవడం ఉత్తమం. ఇష్టానుసారంగా మాట్లాడటం, పరనింద, ప్రభుత్వ పథకాలపై నిందలు మోపడం వంటి చర్యలకు దిగే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు చేపట్టేందుకు ఎన్నికల సంఘం తమ నిబంధనలకు మరింత పదును పెడుతోంది. గతంలో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తూనే అంగన్‌వాడీలపై వేటు వేశారు. గతంలో అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బంది ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనేవారు. ప్రస్తుతం దూరంగా ఉంటున్నారు. వివిధ రాజకీయ పార్టీలు ఫోన్లు చేసి మద్దతు కోరినా దయచేసి తమను ఎన్నికల్లోకి లాగొద్దని సూచిస్తున్నారు. ఎవరు ఫోన్ చేసినా మా మద్దతు మీకేనంటూ దాటవేస్తున్నారు.

సెల్‌ఫోన్లతో కష్టాలు

సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో క్షణాల్లో సమాచారం విశ్వవ్యాప్తమవుతోంది. స్మార్ట్‌ఫోన్లు లేనివారు లేకపోగా.. అధునాతన ఫీచర్లను వినియోగిస్తున్నారు. ఇదే క్రమంలో ఉద్యోగులు సెల్‌ఫోన్ ద్వారా విస్తృతంగా వాడుతున్న ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా పోస్టులు చేసినా చర్యలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాల్సిందే. తొలుత విధుల నుంచి తొలగించాకే మరో ఆలోచన ఉంటుంది.

ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు


దేవయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: నగరానికి చెందిన ఒక వ్యక్తి ఇంట్లో గొడవ పెట్టుకొని బయటకు వెళ్లగా.. రెండు గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకొని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ పాత బజార్‌కు చెందిన మందపల్లి దేవయ్య(55) అనే వ్యక్తి బుధవారం ఉదయం 10 గంటల సమయంలో భార్యతో గొడవ పడి ఆత్మహత్యకు పాల్పడతానని ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. ఈ విషయంపై తన కూతురైన రమ ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్సై రవి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి అందుబాటులో ఉన్న టెక్నాలజీ సహాయంతో కేవలం రెండు గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి తన కూతురికి అప్పగించినట్లు సీఐ సరిలాల్ తెలిపారు. వన్‌టౌన్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

గీతామందిర మఠం వార్షికోత్సవాలు


ప్రవచనం చేస్తున్న స్వామీజీలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని అశోక్‌నగర్ మలయాళ సద్గురు గీతామందిర సన్యాస మఠంలో బుధవారం వార్షికోత్సవాలు మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో కొనసాగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు జప, ధ్యానం, అభిషేకాలు, సకల దేవతాహోమాలు, పూజలు, భజనలు, సంకీర్తనలు, భగవద్గీత, వివిధ దేవతల పారాయణాలు జరిగాయి. సంపూర్ణానందగిరిస్వామి అధ్యక్షతన తనతోపాటు విష్ణుసేవానందగిరిస్వామి, సచ్చిదానందగిరిస్వామి, శుద్ధబ్రహ్మనందగిరిస్వామి, రామచైతన్యస్వామి, సనక సనంద సరస్వతీ స్వామి, చిదానంద గిరిస్వామి, ఆత్మానందగిరిస్వామి, భక్త రాజేశం గురువు ఆధ్యాత్మిక ఉపన్యాసాలిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో విష్ణుమూర్తిశర్మ, రామచంద్రశర్మ, చంద్రమౌళి, బండ సత్తయ్య, గుండ రాధాకిషన్, బొద్దు లక్ష్మీనారాయణ, కొండ శివలింగం, కమటాల శ్రీనివాస్, రాధారాణి, పద్మ, సత్యవతి, చంద్రకళ భక్తులు పాల్గొన్నారు. గురువారం ఉదయం నుంచి పారాయణాలు, స్వామీజీల ఆశీర్వచన భాషణం, పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడుదాం


నివాళి అర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కరీంనగర్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కామ్రేడ్ ఠానూనాయక్ స్ఫూర్తితో ఉద్యమించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ పిలుపునిచ్చారు. ఠానునాయక్ వర్ధంతిని బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశానికే ఆదర్శమని అన్నారు. కమ్యూనిస్టుల అండతో విసునూరు రామచంద్రారెడ్డి దొరల ఆగడాలపై వీరోచితంగా పోరాడటంలో ఠానూనాయక్ ఆరుగురు అన్నదమ్ములు కీలక పాత్ర పోషించారన్నారు. కటారి నర్సింగ్‌రావు దొర, అతడి గూండాలు ఠానూనాయక్‌ను బండి చక్రానికి కట్టి శరీరం ముక్కలయ్యేదాకా నడిపించి చంపేయడం బాధాకరమని అన్నారు. గిరిజన నాయకులు ప్రకాశ్‌నాయక్, వంశీనాయక్, సురేష్, కృష్ణ, నవీన్, రాహుల్, రమేశ్, రాజు, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో మద్యం అక్రమ నిల్వలు, రవాణా, గుడుంబా రవాణాపై ప్రజలు జిల్లా ఎక్సైజ్‌కు సమాచారమిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేయడం, రవాణా నియంత్రణ కోసం ప్రతి గ్రామంలో ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా కలెక్టరేట్ ఆధ్వర్యంలో చెక్ పోస్టుల వద్ద తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ముగిసేవరకు నిబంధనలు ఎవరు అతిక్రమించిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కరీంనగర్ మిల్క్ డెయిరీ సందర్శన



క్షేత్ర పర్యటనకు వెళ్తున్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలోని కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య ఆధ్వర్యంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం కరీంనగర్ మిల్క్ డెయిరీని సందర్శించారు. రైతుల వద్ద నుంచి తీసుకొచ్చిన పాలను ప్రాసెస్ చేసే విధానం, ఇతర పాల ఉత్పత్తులను తయారు చేసే విధానం పరిశీలించారు. ఈ పర్యటన విజయవంతం చేసినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ కామర్స్ డిపార్ట్‌మెంట్‌ను అభినందించారు. అధ్యాపకులు డాక్టర్ ఎ.నారాయణ, వి.చంద్రమౌళి, ఎం.శిరీష, నర్మద, రాములు, రాజు, గౌతమి, కామర్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

హోటళ్లలో పోలీసుల తనిఖీ


కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఏసీపీ నరేందర్, సీఐ సరిలాల్

కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు కరీంనగర్ టౌన్ ఏసీపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కరీంనగర్‌లోని అన్ని హోటళ్లు, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్రమ డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేసే చర్యలకు పాల్పడేవారిని కట్టడి చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ఈ దాడులు కొనసాగించనున్నారు. ఏసీపీ నరేందర్‌తోపాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: పార్లమెంటు ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాకు వచ్చిపోయే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి మద్యం, నగదు, ఇతరత్రాలు రవాణా చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. సీపీ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక బృందాలు నిఘా ఏర్పాటు చేశాయి. సివిల్, కేంద్రబలగాలు, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, ఎన్నికల స్పెషల్ యాక్షన్ టీంలు రంగంలోకి దిగాయి. కరీంనగర్ నుంచి సిద్దిపేట వెళ్లే మార్గంలో తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద, పెద్దపల్లి వెళ్లే మార్గంలో ముగ్దుంపూర్‌లో, వరంగల్ దారిలో పరకాల ఎక్స్ రోడ్, సిరిసేడు వద్ద, జగిత్యాల మార్గంలో కొత్తపల్లి, చొప్పదండి మార్గంలో అర్నకొండ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి పోలీసు, రెవెన్యూ, వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు విడతలవారీగా 24గంటల పాటు విధుల్లో ఉంటున్నారు. సిటీలోనూ నిత్యం వాహన తనిఖీలు, డ్రంక్‌అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

భగత్‌సింగ్‌కి భారతరత్న ఇవ్వాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కరీంనగర్: భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్‌కి భారతరత్న అవార్డు ఇవ్వాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సంఘ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. భగత్‌సింగ్ జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్ మీద భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి హేమంత్, నాయకులు సందీప్, వినయ్, సాయి, అనిరుద్, అశోక్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలి

కరీంనగర్: పండిట్, పీఈటీ అప్‌గ్రేడేషన్‌లో అర్హులైన ఎస్‌జీటీలకు ప్రమోషన్లు కల్పించాలని ఎస్‌జీటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీరాందాస్ ప్రకటనలో కోరారు. పండిట్ పోస్టుల అప్‌గ్రేడేషన్ పోస్టుల విషయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు మూలంగా ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందరికీ న్యాయం జరిగేలా జీవో 11, 12కు చేసిన సవరణలను రద్దు చేసి నూతనంగా కామన్ సీనియారిటీ ప్రాతిపదికగా ఎస్‌జీటీలకు అవకాశం కల్పించాలన్నారు. మూడో కేటగిరీ నుంచి రెండో కేటగిరి ప్రమోషన్ పొందే ఏ ఉపాధ్యాయుడైనా ఏ ప్రమోషన్‌కయినా అవకాశం కల్పించేలా నూతన చట్టాలు తీసుకొచ్చి సమన్యాయం చేయాలని కోరారు.

ప్రమాదకరమే..



శాతవాహన యూనివర్సిటీకి ఎదురుగా ఉన్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం కూడలి చుట్టూ రెయిలింగ్ ధ్వంసం కావడంతో వచ్చిపోయే వాహనాలకు ప్రమాదకరంగా ఉంది. రాత్రి చూడక వచ్చిన వాహనాలు ఢీకొనడంతో ఎంతో మంది ఆసుపత్రిపాలైన సంఘటనలున్నాయి. మరమ్మతులు చేపట్టి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపై మురుగు



బ్యాంక్‌కాలనీలో రోడ్ నెంబర్ 4 డ్రైనేజీ పగిలి రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. భారీ వాహనాలు వెళ్లడంతో పైపులైన్లు పగిలిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పక్కనే పెద్ద అపార్ట్‌మెంట్లుండడంతో.. డ్రైనేజీ పైపులు పెద్దగా లేక మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. దుర్వాసన రావడంతో స్థానికులు అనారోగ్యంపాలవుతున్నారు. డ్రైనేజీలో పెద్ద పైపులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఘనంగా ఏకాదశి ఉత్సవం


పూజలు చేస్తున్న అర్చకుడు

కరీంనగర్‌కల్చరల్: తిరుమలనగర్ శ్రీనిలయంలో బుధవారం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆమలక ఏకాదశి ఉత్సవాన్ని మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. శ్రీమన్నారాయణునికి ఫలరసపంచామృతాభిషేకాలు, పూజలు జరిగాయి. ప్రత్యేక హవనం నిర్వహించారు. సాయంత్రం వివిధ భజన బృందాల ఆధ్వర్యంలో 45సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, భజనలు జరిగాయి. వివిధ ప్రాంతాల భక్తులు తదితరులున్నారు.

16 నుంచి 'ఒంటిమిట్ట'లో బ్రహ్మోత్సవాలు

- 22న శ్రీసీతారాముల కల్యాణం

తిరుపతి(అలిపిరి): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 16 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 16న అంకురార్పణ, 17న శ్రీరామనవమి నాడు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయని చెప్పారు. 22న జరిగే సీతారాముల కల్యాణం ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి తెప్పోత్సవం



తొలిరోజు తెప్పపై శ్రీసీతారామలక్ష్మణుల విహారం

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు బుధవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీసీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. తొలిరోజు శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి వారు పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు తిరిగి కనువిందు చేశారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వంగవీటి నరేంద్ర

- వంగవీటి కుటుంబానికి టీడీపీ బద్ధశత్రువు
- వంగవీటి రాధా టీడీపీలో చేరి పెద్ద తప్పు చేశారు
- మీడియాతో వంగవీటి నరేంద్ర

సాక్షి, అమరావతి: రాధా–రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయం మీడియా పాయింట్ వద్ద వంగవీటి నరేంద్ర మీడియాతో మాట్లాడుతూ.. పేదల బాగు కోసం వంగవీటి రంగా ఎన్నో పోరాటాలు చేసి గొప్ప నేతగా ఎదిగారని గుర్తు చేశారు. దీనిని చూసి ఓర్వలేని టీడీపీ దీక్షలో ఉన్న రంగాను దారుణంగా హత్య చేయించిందన్నారు. దీనిపై నాటినుంచి రాధా–రంగా మిత్రమండలి సభ్యులు రగిలిపోతున్నారని పేర్కొన్నారు. రంగాను పొట్టన పెట్టుకున్న టీడీపీలో చేరి తన సోదరుడు వంగవీటి రాధా తప్పు చేశారన్నారు. కులోన్మాది చంద్రబాబు పంచన చేరి రాధా చారిత్రాత్మక తప్పిదం చేశారని అభిప్రాయపడ్డారు. ఆయన టీడీపీలో చేరడం ఎవరికీ ఇష్టం లేదని చెప్పారు. ఇలా చేయడం వల్ల వంగవీటి రంగా ఆత్మ క్షోభిస్తుందన్నారు. రంగాను చంద్రబాబు పొట్టన పెట్టుకున్న విషయాన్ని రాధా–రంగా మిత్రమండలి ఎలా మరిచిపోగలదని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి రంగా కుటుంబాలు అప్పట్లో ఒకటిగానే ఉండేవని.. ఆ రెండు కుటుంబాలు వేరు కాదని చెప్పారు. రంగాను కాపాడుకోవాలని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయాలను వంగవీటి కుటుంబ సభ్యులైన తాము ఎలా మర్చిపోగలమని ప్రశ్నించారు. పేదలకు సంక్షేమ పథకాలు సీఎం జగన్ అందించారని, వైఎస్ జగన్‌నే ప్రజలు తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని స్పష్టం చేశారు.

మేనిఫెస్టో.. పవిత్ర గ్రంథం

ఈసారీ జనరంజకమే

ఎన్నికల మేనిఫెస్టోపై వైఎస్సార్‌సీపీ ముమ్మర కసరత్తు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలకు శ్రేణులను 'సిద్ధం' సభలతో సన్నద్ధం చేసిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో రూపకల్పనపై చేస్తున్న కసరత్తు తుది దశకు చేరుకుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. నాలుగు లోక్‌సభ స్థానాల పరిధిలో ఇప్పటికే సిద్ధం సభలు నిర్వహించిన నేపథ్యంలో మిగతా 21 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ప్రజలతో మమేకమవుతూ పార్టీ శ్రేణులను, అభిమానులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు ఈనెల 27న ఇడుపులపాయ నుంచి శ్రీకారం చుట్టనున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్ మేనిఫెస్టోకు సరి కొత్త నిర్వచనం చెప్పారు. చెప్పిన వాటితోపాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేయడంతో సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత మరింత పెరిగింది. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలతో ఇది ప్రస్ఫుటితమైంది. బస్సు యాత్ర ప్రారంభమయ్యేలోగా ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనుండటంతో సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అన్న నమ్మకం ప్రజల హృదయాల్లో బలంగా నాటుకుపోయింది.

పాలనకు దిక్సూచిగా..

ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి హామీలు గుప్పిస్తూ మేనిఫెస్టో విడుదల చేయడం.. గద్దెనెక్కాక ఐదేళ్ల పాటు సాగదీసి దిగిపోయే వేళ మళ్లీ ఓటర్లను ఆకట్టుకోవడానికి అరకొరగా హామీలు అమలు చేయడం రాజకీయ పార్టీలకు రివాజుగా మారింది. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మేనిఫెస్టోను వెబ్ సైట్ నుంచి కూడా మాయం చేసిన విషయం అందరికీ తెలిసిందే. గత ఎన్నికల్లో రెండే రెండు పేజీలతో కూడిన మేనిఫెస్టోను ప్రకటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సీఎం కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మేనిఫెస్టో బోర్డులు ఏర్పాటు చేసి దానికి పవిత్రతను ఆపాదించారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలను అమలు చేశారు. ఐదేళ్లలో మొత్తమ్మీద 99 శాతం హామీలను నెరవేర్చారు. రాష్ట్రంలో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2.70 లక్షల కోట్లు పారదర్శకంగా జమ చేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపితే నవరత్నాలు ద్వారా మొత్తం రూ.4.49 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని పేదలకు గత 58 నెలల్లో సీఎం జగన్ చేకూర్చారు. దీన్ని సద్వినియోగం చేసుకుని పేదరికం నుంచి గట్టెక్కుతున్నారు. రాష్ట్రంలో పేదరికం 2015–16లో 11.77 శాతం ఉంటే 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం.

విప్లవాత్మక మార్పులు..

వికేంద్రీకరణతో సుపరిపాలన అందిస్తూనే విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలను నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసి ఇంగ్లీషు మీడియం



బోధనను ప్రవేశపెట్టారు. విద్యాకానుక కింద పాఠశాలలు ప్రారంభమైన రోజే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగ్, యూనిఫామ్‌లు, బూట్లు విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందిస్తూ చిక్కిని కూడా అందచేస్తున్నారు. విద్యాదీవెన పథకం ద్వారా ఎంత ఫీజు ఉంటే అంతా రీయింబర్స్ చేస్తుండగా వసతి దీవెన కింద వసతి ఖర్చులు చెల్లిస్తున్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ శిక్షణ ఇచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉన్నతోద్యోగాలు పొందేలా దోహదం చేస్తున్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉండగా గత 58 నెలల్లో ఏకంగా 2.13 లక్షల ఉద్యోగాలను సీఎం జగన్ భర్తీ చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు నాడు–నేడు కింద ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి చేర్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా 16 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలను చేరువ చేశారు. తీర ప్రాంతాల్లో నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ సెంటర్లు, రహదారులు, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం లాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ఇంటి గుమ్మం వద్దే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. సీఎం జగన్ సుపరిపాలన, సంస్కరణలతో సాకారమైన విప్లవాత్మక మార్పులు ప్రతి ఇంటా.. ప్రతి గ్రామం.. ప్రతి నియోజకవర్గంలో కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. ఆ మార్పులు కొనసాగుతూ రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్లేలా పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేలా మేనిఫెస్టోను సీఎం జగన్ రూపొందిస్తారని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

టీడీపీ 'సూపర్ సిక్స్'ను పట్టించుకోని ప్రజలు..

జనసేన, బీజేపీ పొత్తు కుదరక ముందు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో గతేడాది మే 28న ప్రకటించిన మిని మేనిఫెస్టోను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జనసేన, బీజేపీతో పొత్తు కుదిరిన నేపథ్యంలో పూర్తి స్థాయి మేనిఫెస్టోను ప్రకటిస్తామని చంద్రబాబు పదే పదే చెబుతున్నా ఎవరూ ఆసక్తి చూపడం లేదు. చెప్పిన మాటపై చంద్రబాబు నిలబడడు.. మోసం చేస్తాడనే భావన ప్రజల్లో బలీయంగా నాటుకుపోవడమే అందుకు కారణమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో రైతు రుణాల మాఫీపై తొలి సంతకం చేస్తానని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇస్తూ తన ఫొటోతోపాటు పవన్, ప్రధాని మోదీ ఫొటోలు ముద్రించిన లేఖపై చంద్రబాబు సంతకం చేసి టీడీపీ కార్యకర్తల ద్వారా ప్రతి ఇంటికీ పంపారు. వాటితో కలిపి 650 హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అందులో పది శాతం కూడా అమలు చేయకుండా మోసం చేశారు. ఇప్పుడు మళ్లీ అదే కూటమి జట్టు కట్టగా సూపర్ సిక్స్ అంటూ మినీ మేనిఫెస్టోపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలెవరూ విశ్వసించడం లేదు.

బతిమాలితేనే పవన్‌కు టికెట్ ఇచ్చాం..

- గెలిచినా చంద్రబాబు చెప్పినట్లే నడుచుకోవాలి
- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యాఖ్యలు

పిఠాపురం: 'గత 20 ఏళ్లుగా పార్టీని కాపాడుకుంటూ వచ్చా. చంద్రబాబు ఆదేశాలతో నా సీటును త్యాగం చేశా. ఎంతో బాధతో ఆ స్థానాన్ని వదులుకున్నా. నేను త్యాగం చేస్తేనే పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్నాడు' అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ నిర్వేదం వ్యక్తం చేశారు. బుధవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. పిఠాపురంలో పవన్‌కు టీడీపీ నేతలే పచ్చ జెండాలతో ఎన్నికల ప్రచారం చేస్తారని, జనసేన నేతల అవసరం లేదన్నారు. తానే సేనాధిపతినని చెప్పారు. పవన్ కాకినాడ ఎంపీగా పోటీ చేస్తే పిఠాపురం సీటు తనదేనని తేల్చి చెప్పారు. పవన్ కాకుండా పిఠాపురం సీటును మరెవరికీ ఇచ్చేది లేదన్నారు. ఇక్కడ తనను కాదని జనసేన విజయం సాధించడం ఎట్టి పరిస్థితుల్లోను కుదరదన్నారు. పిఠాపురంలో టీడీపీ మాత్రమే ఉందని, జనసేన అనేదే లేదని కుండబద్దలు కొట్టారు. 'మనల్ని బతిమలాడుకుంటే



పవన్‌కు టికెట్ ఇచ్చాం. మనమిచ్చిన టికెట్ కాబట్టి నెగ్గించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది' అని చంద్రబాబు తనకు చెప్పారన్నారు. పవన్‌ను గెలిపించినా తీసుకెళ్లి చంద్రబాబుకే అప్పగిస్తామన్నారు. ఆయన ఆదేశాల మేరకే పవన్ పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గెలవడం వరకే పవన్ పని, గెలిచాక పని చేసేది మాత్రం టీడీపీనే అని పేర్కొన్నారు. కాగా వర్మ వ్యాఖ్యలపై జనసేన నేతలు మండిపడుతున్నారు. పవన్ కల్యాణ్ పోటీ చేయడంపై రోజుకో రకంగా మాట్లాడుతూ షరతులు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులతో పవన్ రాజకీయాలు

వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలపై స్పష్టత లేదని వైఎస్సార్‌సీపీ పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి వంగా గీత విమర్శించారు. డబ్బులతో రాజకీయం చేయాలని పవన్ భావిస్తున్నారని దుయ్యబట్టారు. 'కాపు మహిళా నేతగా పిఠాపురంలో నాకు మంచి ఇమేజ్ ఉంది. నా బంధువులు, స్నేహితులు అక్కడ చాలా ఎక్కువ. నన్ను తన పార్టీలోకి రమ్మనటం పవన్ అవివేకం. ఆయన్ను కూడా నేను వైఎస్సార్‌సీపీలోకి రమ్మంటే బాగుంటుందా? ఓ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అర్థంపర్థం లేకుండా మాట్లాడటం సరికాదు. సీఎం జగన్ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది. రాజకీయ సిఫార్సులకు తావు లేకుండా డీబీటీ ద్వారా ప్రజలకు పథకాలను అందించారు. మధ్యవర్తులు లేకుండా అంత డబ్బు ఎప్పుడూ ప్రజల ఖాతాల్లోకి చేరలేదు. అందుకే సీఎం జగన్ ఏదైనా చెబితే చేస్తారని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని అందరికీ నమ్మకం ఉంది. గత ఐదేళ్లలో సీఎం జగన్ చేసిన



సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన శేషుకుమారి, ఆమె సోదరి సుజాత. చిత్రంలో ఎంపీ వంగా గీత

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లేయాలని మేం కోరతాం. ఒకే ఒక్కడు వైఎస్ జగన్‌ను ఢీకొనలేక మిగతా పార్టీలన్నీ కలిసి పోటీ చేస్తున్నాయి. అయినా సరే గెలవడం అటుంచి వైఎస్సార్‌సీపీకి గట్టి పోటీ ఇస్తామనే నమ్మకం కూడా వారికి లేదు' అని వంగా గీత పేర్కొన్నారు. జనసేన పిఠాపురం మాజీ ఇన్‌ఛార్జి మాకినీడి శేషుకుమారి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన సందర్భంగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డితో కలసి ఆమె మీడియాతో మాట్లాడారు.

వలంటీర్ల వల్ల మంచే జరుగుతోందిగా



- వారి వల్ల సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయి
- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- వలంటీర్ల విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టీకరణ
- వారిని ఎన్నికలకు దూరంగా ఉంచుతూ ఈసీ ఉత్తర్వులిచ్చిందని వెల్లడి
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వం, ఈసీకి ఆదేశం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బీసీలకు మేలు చేసిన జగన్‌ను గెలిపిద్దాం


- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): బడుగు, బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. వారి ఉన్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ రాజకీయ నాయకుడు కాదని.. ఒక సంఘ సంస్కర్త అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నన్ని పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. బీసీలకు అండగా నిలిచిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవడం ద్వారా ఆయన రుణం తీర్చుకుందామని బీసీలకు పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సీఎం జగన్ రాష్ట్రంలో పేదల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రిని కలిశా. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ఆయన మెచ్చుకున్నారు. ఇన్ని పథకాలు అమలు చేయడం ఎవరి వల్ల కాదని చెప్పారు. ఇతర రాష్ట్రాలు తిరిగి వస్తే కానీ.. వైఎస్ జగన్ విలువేంటో ఇక్కడున్న వారందరికీ బాగా



అర్థమవుతుంది. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించడం ద్వారా.. వారి కుటుంబాల్లో సీఎం జగన్ వెలుగులు నింపుతున్నారు. పొరుగు రాష్ట్రాల ప్రజలు కూడా తమను ఏపీలో కలపాలని అడుగుతున్నారు. విద్య ద్వారా ఉన్నత శిఖరాలు చేరుకునే అవకాశం కోసం వారు ఎంతో ఆరాటపడుతున్నారు. ఏపీలోని అన్ని పదవుల్లోనూ సీఎం జగన్ బీసీలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా బీసీలకు ఇంత న్యాయం ఎన్నడూ జరగలేదు. ఓట్ల కోసం ప్రయత్నించే పార్టీలు.. బీసీలకు న్యాయం చేసేందుకు మాత్రం ముందుకు రావు. కానీ సీఎం జగన్ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడానికి సహకరించారు. బీసీలకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా.. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకొని ఆయన రుణం తీర్చుకుందాం' అని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు.

అన్నారం డ్యామేజీలకు మేము బాధ్యులం కాదు



As the risk has been arrived due to the design deficiency and essential operational pattern of the barrage, AFCONS-VIJETA-PES JV shall not be held responsible for any damage in the barrage.

డిజైన్ లోపాల కారణంగా అన్నారం బ్యారేజ్ కి ముప్పు పొంచి ఉందని మోడల్ స్టడీస్‌లో తేలినందున డ్యామేజీలకు తమ బాధ్యత ఉండదని నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ నీటిపారుదల శాఖకు రాసిన లేఖలోని భాగం

▶ మొదటి పేజీ తరువాయి

రీసెర్చ్ స్టేషన్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించిన మోడల్ స్టడీలో డిజైన్‌లో లోపాలున్నట్టుగా తేలిందని పేర్కొంది. వచ్చే వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే బ్యారేజీకి అత్యవసర రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరముందని స్పష్టం చేసింది. ఈ మేరకు గత ఫిబ్రవరి 10న నీటిపారుదల శాఖకు లేఖ రాసింది.

నీళ్ల నిల్వ ఉండేలా డిజైన్ చేయలేదు

బ్యారేజీలు, డ్యామ్‌ల గేట్లు ఎత్తినప్పుడు వరద భీకర వేగంతో కిందికి దూకినట్టుగా ప్రవహిస్తుంది. ఆ వరద నేరుగా దిగువన (అప్రాన్ ఏరియా) ఉన్న కాంక్రీట్ బ్లాకులపై పడడంతో అవి కొట్టుకుపోయి భారీగా లోతైన గుంతలు పడే ప్రమాదం ఉంటుంది. దీనిని నివారించడానికే బ్యారేజీ దిగువ ప్రాంతంలో తగిన స్థాయిలో నీళ్ల నిల్వ (టెయిల్ వాటర్ లెవల్) చేస్తారు. పైనుంచి పడే వరద ఆ నీటిలో పడటం వల్ల ఉధృతి తగ్గి కాంక్రీట్ బ్లాకులకు నష్టం జరగదు. అయితే అన్నారం బ్యారేజీకి దిగువన తగిన రీతిలో నీళ్ల నిల్వ ఉండేలా డిజైన్ చేయలేదు. దీంతో గతంలో వచ్చిన వరదలతో దిగువన ఉన్న కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయి ఆ ప్రాంతంలో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. నిరంతర వరదలతో బ్యారేజీ ర్యాఫ్ట్(పునాది) కింద రక్షణగా ఉండే సెకెంట్ పైల్స్ వరకు ఈ గుంతలు విస్తరించాయి. వీటివల్ల సెకెంట్ పైల్స్ దెబ్బతిని వాటికి, ర్యాఫ్ట్‌కు మధ్య అగాధం ఏర్పడి ఉండడానికి అవకాశం ఉంది. దీని వల్లనే బ్యారేజీలో బుంగలు పడి నీళ్ల లీక్ అవుతున్నాయని ఆఫ్కాన్స్–విజేత– పీఈఎస్ జాయింట్ వెంచర్ స్పష్టం చేసింది. కాగా స్టేట్ డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ చైర్మన్ ఏబీ పాండ్య, రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు మోడల్ స్టడీలో పాల్గొన్నారు.

సెకనుకు 15–30 మీటర్ల వేగంతో వరద

వరదలు తగ్గుముఖం పట్టాక తక్కువ మొత్తంలో నీళ్లను కిందికి విడుదల చేసేందుకు వీలుగా బ్యారేజీ గేట్లను తక్కువ ఎత్తులో పైకి లేపుతారు. అయితే బ్యారేజీ పూర్తిగా నిండి ఉండడంతో పీడనం పెరిగి వరద భీకర ఉధృతితో గేట్ల కింద నుంచి దూసుకు వస్తుంది. అన్నారం గేట్లను 10–30 సెంటీమీటర్లు మాత్రమే పైకి ఎత్తినా, సెకనుకు 15–30 మీటర్ల భీకర వేగంతో వరద బయటికి వస్తోందని మోడల్ స్టడీలో తేలింది. ఈ నేపథ్యంలోనే బ్యారేజీ రక్షణకు ల్యాబ్ సూచనల మేరకు అత్యవసర చర్యలు తీసుకోవాలని నిర్మాణ సంస్థ లేఖలో కోరింది.

మూడేళ్ల కిందే ముగిసిన డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్

అన్నారం బ్యారేజీ డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ 2021 డిసెంబర్ 17లోనే ముగిసింది. నాటి నుంచి మూడేళ్ల పాటు కేవలం బ్యారేజీ నిర్వహణ కోసం రూ.6.42 కోట్ల అంచనాలతో అఫ్కాన్స్ –విజేత–పీఈఎస్ జేవీతో నీటిపారుదల శాఖ 'ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్' ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం కూడా ఈ ఏడాది డిసెంబర్ 16తో ముగియనుంది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో బ్యారేజీకి జరిగే నష్టాలకు నిర్మాణ సంస్థే పూర్తి బాధ్యత తీసుకుని పునరుద్ధరిస్తుంది.

నాటి సీఎం స్థాయిలోనే నిర్ణయాలు!

▶ మొదటి పేజీ తరువాయి

వివరాలు అందించారు. 'నీటిపారుదల శాఖలో జనరల్, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్, హైడ్రాలజీ విభాగాల పనితీరు, బాధ్యతలు ఏమిటి? ప్రభుత్వం–నీటిపారుదలశాఖకు మధ్య ఫైళ్ల రాకపోకలు ఎలా సాగుతాయి?'వంటి అంశాలను నిపుణుల కమిటీ అడిగి తెలుసుకుంది.

నాణ్యత పర్యవేక్షణ ఎలా?

'కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి మూడేళ్ల గడువు ఉండగా.. రెండేళ్లలో ఎందుకు పూర్తి చేశారు? అంత వేగంతో పనులు చేస్తే నాణ్యతను ఎలా పర్యవేక్షించారు? బ్యారేజీల పునాదులు (ర్యాఫ్ట్)కు రక్షణగా తొలుత షీట్ పైల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి.. తర్వాత సెకెంట్ పైల్స్‌కు ఎందుకు మారారు? ఈ డిజైన్ మార్పులకు అప్రూవల్స్ తీసుకున్నారా?' అని బ్యారేజీ నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీర్లను అయ్యర్ కమిటీ ప్రశ్నించింది.

ఎక్కడో తప్పిదం జరిగింది: మురళీధర్

మేడిగడ్డ బ్యారేజీ పునాదుల(ర్యాఫ్ట్)కు దిగువన ఏర్పాటు చేసిన సెకెంట్ పైల్స్ (నిలువు స్తంభాలు) దిగువ నుంచి, లేదా వాటి మధ్య నుంచి ఇసుక కొట్టుకుపోవడంతోనే బ్యారేజీ కుంగిందని భావిస్తున్నానని అయ్యర్ కమిటీకి మాజీ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్ వివరించారు. కావాలని ఎవరూ అలా చేయలేదని, అనుకోని రీతిలో ఎక్కడో తప్పిదం జరిగి ఉండవచ్చని కూడా ఆయన పేర్కొన్నట్టు సమాచారం. రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుతో నిపుణుల కమిటీ విడిగా సమావేశమై బ్యారేజీల నిర్మాణంలో ఆయన అనుసరించిన విధానాన్ని అడిగి తెలుసుకుంది.

తప్పులు ఎక్కడ జరిగి ఉంటాయి.. చెప్పండి!

'బ్యారేజీల నిర్మాణంలో ఎక్కడ తప్పులు జరిగి ఉంటాయి? మీ అభిప్రాయం ఏమిటి?' అని నీటి పారుదల శాఖలోని వివిధ విభాగాల ఇంజనీర్లను అయ్యర్ కమిటీ ప్రశ్నించింది. 'బ్యారేజీల గేట్లను ఎవరు ఆపరేట్ చేశారు? ఈఎన్సీల నుంచి ఏఈ వరకు వివిధ స్థాయిల్లోని ఇంజనీర్ల జాబ్ చార్ట్ ఏమిటి? నీటిపారుదల శాఖ హైపవర్ కమిటీ నిర్ణయాలు ఎలా తీసుకుంటుంది? డిజైన్లను ఎవరు సిఫారసు చేస్తారు? ఎవరు ఆమోదిస్తారు? బ్యారేజీల నిర్మాణానికి ముందు ఇన్వెస్టిగేషన్ జరిపిన వ్యాప్కోస్ వద్ద ఉన్న సాంకేతికత ఏమిటి? మోడల్ స్టడీస్ చేశారా? క్వాలిటీ కంట్రోల్ ఈఎన్సీ(ఓఅండ్ ఎం) పరిధిలోకి వస్తుందా? లేక ఈఎన్సీ (జనరల్) పరిధిలోకి వస్తుందా?' వంటి అంశాలనూ ఆరా తీసింది. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి ప్రతి అంశంపై ప్రశ్నలు సంధించి ఎక్కడ లోపాలు జరిగి ఉంటాయనేది గుర్తించేందుకు ప్రయత్నించింది. ఈ పర్యటనలో భాగంగా గురు, శుక్రవారాల్లో సైతం నిపుణుల కమిటీ నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం కానుంది.

అత్యవసర మరమ్మతులపై ఇప్పుడే చెప్పలేం..

బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులను సూచించాలని ఈఎన్సీ(జనరల్) అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేయగా.. ఈ అంశంపై సిఫారసులతో మధ్యంతర నివేదిక ఇవ్వడంపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని చంద్రశేఖర్ అయ్యర్ స్పష్టం చేశారు. బ్యారేజీలపై అధ్యయనం జరిపి, లోపాలను తెలుసుకోవడానికి ఎంత సమయం పడుతుందో ఇప్పుడే చెప్పలేమన్నారు.

'సీఎం దృష్టికి కళాశాలల సమస్యలు'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సమస్యల పరిష్కారానికి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు టీపీసీసీ మేధావుల సెల్ చైర్మన్ ఆనంతుల శ్యాంమోహన్ చెప్పారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేశారని తెలిపారు. సీఎంను కలిసి వాటి పరిష్కారానికి ప్రయత్నించనున్నట్లు తెలిపారు.

అభిషేక్ బోయినపల్లికి మధ్యంతర బెయిల్

మంజూరు చేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో నిందితుడైన హైదరాబాద్ వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లికి సుప్రీంకోర్టు 5 వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. 2023 జూలైలో ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ అభిషేక్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్‌దత్తాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. అభిషేక్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ 2022 అక్టోబరు 9 నుంచి కస్టడీలో ఉన్నారని చెప్పారు. పిటిషనర్ భార్య అనారోగ్యంగా ఉన్నారంటూ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి అనుమతిస్తామని, అయితే ట్రయల్ కోర్టు విధించిన షరతులు పాటించాలని ధర్మాసనం పేర్కొంది. 'ఈడీ అధికారులతో టచ్‌లో ఉండేందుకు వీలుగా ఫోన్ నంబరు ఇవ్వాలి. పాస్‌పోర్టు సరెండర్ చేయాలి. స్వస్థలం హైదరాబాద్ సందర్శించడం మినహా దేశ రాజధాని ప్రాంతాన్ని వీడి వెళ్లరాదు' అని చెప్పింది. తదుపరి విచారణను ఐదువారాలపాటు వాయిదా వేసింది.

రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం కన్నుమూత



నెల్లూరు (టౌన్): రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం(83) నెల్లూరులోని హరనాథపురంలోని నివాసంలో బుధవారం తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. రత్నం విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా ఆయన తీర్చిదిద్దారు. రత్నం విద్యాసంస్థల్లో చదివిన పలువురు దేశవ్యాప్తంగా పలు రంగాల్లో సేవలు అందిస్తున్నారు.



మద్దాలి ఉషాగాయత్రి



రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకుంటూ...

నృత్య తపస్వి

**ఆమె ప్రయాణం నాట్యం.
ఆమె ప్రయత్నం నాట్యకళకు జీవం పోయడం.
నాలుగేళ్ల వయసు నుంచి కూచిపూడిని జీవనాడిగా చేసుకుని,
69 ఏళ్ల వయసులోనూ కళను వీడలేదు హైదరాబాద్ వాసి మద్దాలి ఉషాగాయత్రి.
సుదీర్ఘ నృత్య ప్రయాణంలో భారత్‌తోపాటు దేశ విదేశాల్లో ఎన్నో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
వందల మంది ఔత్సాహికులు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా 200కు పైగా నృత్యాంశాలకు సోలోగా కొరియోగ్రఫీ చేశారు.
విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలికి బ్యాలే చేసి, కేంద్ర ప్రభుత్వ అవార్డులు పొందారు.
ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్న డా. ఉషా గాయత్రి నృత్య ప్రయాణం తెలుసుకుంటే ఈ కళాసేవ ఒక తపస్సులా అనిపించకమానదు.**

''కూచిపూడి నృత్యానికి సంబంధించిన సాహిత్యం, రచనలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పుస్తకాలుగా తీసుకురావాలనేది నా చిరకాల స్వప్నం. దానిని నిజం చేయాలనే ప్రయత్నంలో ఉన్నాను'' అని తనను తాను పరిచయం చేసుకున్న తపస్వి ఉషాగాయత్రి తన నృత్య జీవన గమ్యాన్ని ఇలా మనముందుంచారు.

''నాలుగేళ్ల వయసులో ఉదయ్ శంకర్ శిష్యుడైన దయాల్ శరణ్ వద్ద నాట్యాభ్యాసం మొదలుపెట్టాను. ఇక్కడే కథక్, ఒడిస్సీ, సంగీతం కూడా నేర్చుకున్నాను. ఆ తర్వాత ప్రఖ్యాత గురువు వేదాంతం జగన్నాథ శర్మ వద్ద కూచిపూడి, పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ, పద్మభూషణ్ డా.వెంపటి చినసత్యం, వేదాంతం ప్రహ్లాద శర్మ వద్ద యక్షగానాలు, ప్రఖ్యాత కళాక్షేత్ర గురువు కమలారాణి వద్ద నట్టువాంగం, పద్మశ్రీ డా.నటరాజ రామకృష్ణ వద్ద పదములు నేర్చుకున్నాను. 1988లో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.ఏ. పూర్తయ్యింది. అంతేకాకుండా 'తెలుగు సాహిత్యంలో సత్యభామ పాత్ర వృద్ధి, వికాసం, నాట్యంలో అవతరణ' అనే అంశం మీద పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పొందాను. రాజీవ్‌గాంధీ విశ్వవిద్యాలయంలోని నృత్య విభాగంలోనూ పనిచేశాను. ఆ తర్వాత దాదాపు పాతిక సంవత్సరాలు పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఉద్యోగం చేశాను. నాట్యానికే అంకితం అవ్వాలనే తపనతో ఉద్యోగానికి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. 'నృత్య కిన్నెర' పేరుతో ఏర్పాటు చేసిన సంస్థ ఆధ్వర్యంలో వందల మందికి శిక్షణనిస్తూ వచ్చాను. ఇందులో 50 మంది శిష్యులు నృత్యంలో డిప్లొమా సర్టిఫికెట్లు పొందారు. 10 మంది చిన్నారులు భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్ పొందారు. నా శిష్యులు దేశవిదేశాల్లో స్థిరపడటమే కాకుండా నృత్యంలో పీహెచ్‌డీ, ఎం.ఏ. పట్టాలు పొంది గురువులు, నర్తకులుగా అభివృద్ధి చెందారని చెప్పుకోవడం ఎంతో సంతోషంగా అనిపిస్తుంది.



మద్దాలి ఉషాగాయత్రి

పాదం కదపని వేదిక లేదు

సంగీత నాటక అకాడమీ, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, టీటీడీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో ఎన్నో వందల ప్రదర్శనలు. దేశంలోని న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోనే కాకుండా విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చాను. భారత స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో 1997లో మారిషస్‌లో ఇచ్చిన ప్రదర్శనకుగాను ఆనాటి ప్రెసిడెంట్ సత్కరించడం ఒక గొప్ప జ్ఞాపకం. ప్రదర్శనల కోసం శిష్యులతోపాటు యూకే, యూరోప్‌లలో పర్యటించాను. యూకేటీఏ, జయతే కూచిపూడి, అంతర్జాతీయ కూచిపూడి ఫెస్టివల్‌లో భాగంగా ప్రదర్శనలు ఇవ్వడం మరో గొప్ప అనుభూతి. ప్రధానంగా దాదాపు 200 లకు పైగా సోలో నృత్యాంశాలకు కొరియోగ్రఫి చేయడంతో పాటు ప్రతిష్ఠాత్మకమైన 16 బ్యాలేలు చేశాను. ఇందులో భాగంగా రచయిత ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ చారిత్రక నవల శివభక్త మార్కండేయ, మా తెలుగుతల్లికి మల్లెపూదండ, స్వర్ణోత్సవ భారతి, వందేమాతరం, సంక్రాంతి లక్ష్మి, రుక్మిణీ సత్య, అలిమేలుమంగ చరిత్ర, యశోదకృష్ణ వంటి బ్యాలేలు ప్రదర్శించాను.

రవీంద్రుని గీతాంజలి మాట నిజమైన వేళ

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలికి బ్యాలే చేయడం నా అదృష్టంగా భావిస్తాను. కలకత్తా వేదికగా ఈ ప్రదర్శన చేసిన సమయంలో ఒక విషయం నన్ను అమితమైన ఆనందానికి లోను చేసింది. 'ఏదో ఒకనాడు, ఎవరో ఒకరు నా సాహిత్యానికి నృత్య రూపాన్ని తీసుకువస్తారు' అని ఆనాడే రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన మాటలను అక్కడి వారు ప్రస్తావించడం మాటల్లో చెప్పలేనంత సంతోషాన్ని, సంతృప్తినిచ్చింది. కావ్యాలకు, కథనాలకు, నృత్యానికి ఎంతటి అనుబంధం ఉంటుందో ఆ సంఘటన రుజువు చేసింది.

12 గంటలు 12 మంది శిష్యులు

నృత్యం దర్శయామిలో భాగంగా 72 సోలో నృత్యాంశాలైన శబ్దాలు, తరంగములు, దరువులు, తిల్లానాలు, అష్టపదులు, కీర్తనలు.. తదితర అంశాలతో 12 మంది శిష్యురాళ్లతో కలిసి 12గంటల పాటు అవిరామంగా నృత్యప్రదర్శన చేశాం. 12గంటల పాటు నిరంతరాయంగా నట్టువాంగం నిర్వహించి దానిని గురువు వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రికి అంకితం చేశాం. చేసిన సోలో ప్రదర్శనలు, బ్యాలేలు న్యూ ఢిల్లీ దూరదర్శన్‌తో పాటు విదేశీ ఛానళ్లలోనూ ప్రసారమయ్యాయి.

ఎంతో ప్రోత్సాహం..

ఈ నృత్య ప్రయాణంలో నా జీవిత భాగస్వామి మద్దాళి రఘురామ్ ప్రోత్సాహం ఎనలేనిది. ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకున్నాను. వాటిలో .. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో 2001లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రీయ అవార్డు 'హంస పురస్కారాన్ని', 2004లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ప్రతిభా పురస్కారం, యూరప్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ నర్తకిగా, న్యూయార్క్‌లో ఉత్తమ నాట్యగురువుగా, సిలికాన్ ఆంధ్ర అంతర్జాతీయ కూచిపూడి కన్వెన్షన్‌లో ఆనాటి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు, మారిషస్ ప్రెసిడెంట్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నృత్యరత్న బిరుదుతోపాటు, ఉత్తమ నర్తకి-నాట్యగురు అవార్డులను పొందాను. 1984లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో ఉత్తమ కళాకారిణిగానూ, భారత్‌తో పాటు విదేశాల్లో నిర్వహించిన పలు అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలకు న్యాయనిర్ణేతగా సేవలందించాను.

గత డిసెంబర్‌లో స్ట్రోక్ వచ్చి వీల్‌చెయిర్‌లో ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. అయినా నా కళా తపన ఆగలేదు. వీల్ చెయిర్ నుంచే విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో శిక్షణను అందిస్తున్నాను. ఈ నెల 6న రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక పురస్కారాన్ని వీల్‌చెయిర్‌లో ఉండే అందుకున్నాను. నా శ్వాస ఉన్నంత వరకు కళాసేవలో తరించాలని, కళలో ఔత్సాహికులను నిష్ణాతులను చేయాలన్నదే నా తపన' అంటూ ఉషాగాయత్రి తన సుదీర్ఘ నృత్య ప్రయాణాన్ని ఎంతో ఆనందంగా మన ముందు ఆవిష్కరించారు.

– హనుమాద్రి శ్రీకాంత్,
సాక్షి సిటీ, హైదరాబాద్



ఆమె ఉన్న చోట పులి ఉంటుంది



మన దేశంలో దాదాపు 55 టైగర్ రిజర్వాయర్‌లు ఉన్నాయి. వాటన్నింటినీ తన కెమెరాలో నిక్షిప్తం చేసింది ఆర్జూ ఖురానా. సరిగా చెప్పాలంటే పులి ఉన్న చోటల్లా ఆమె ఉంటుంది. వృత్తి రీత్యా అడ్వకేట్ అయినా ఆ పని మానేసి కెమెరాను నేస్తంగా అడవిని నివాసంగా చేసుకుని తిరుగుతూ ఆమె తీస్తున్న ఫొటోలు పెద్ద గుర్తింపునిచ్చాయి. ఆర్జూ పరిచయం.

అక్టోబర్ 1, 2023 నుంచి నేటి వరకూ 29 ఏళ్ల ఆర్జూ ఖురానా అడవుల్లోనే ఉంటూ వందల మైళ్ల తిరుగుతూ ఉందంటే నమ్ముతారా? నిజం. 'ఆల్ టైగర్ రిజర్వ్స్ ప్రాజెక్ట్ (ఏటీఆర్) కోసం ప్రభుత్వం అప్పజెప్పిన పనిలో ఆమె తలమునకలుగా నిమగ్నమైంది. మన దేశంలో 55 టైగర్ రిజర్వ్‌లు ఉన్నాయి. అయితే వాటిలో కొన్నింటికే టూరిస్ట్ అట్రాక్షన్ ఉంది. మిగిలిన వాటిని కూడా అందంగా ఫొటోలలో బంధించి, ప్రచారానికి ఉపయోగించి, టూరిస్ట్‌లను ఆకర్షించేందుకు నిర్దేశించిన ప్రాజెక్టే ఏ.టి.ఆర్. దానిలో భాగంగా అక్టోబర్ 1న రాజస్థాన్‌లోని సరిస్కా టైగర్ రిజర్వ్‌తో మొదలెట్టి మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో 43 టైగర్ రిజర్వ్‌లను కవర్ చేసి మరో రెండు నెలల్లో మిగిలినవి చేసి ఆఖరున నైనిటాల్‌లో ఉన్నా జిమ్ కార్బెట్ రిజర్వ్ ఫారెస్ట్‌ను ఫొటోలు తీయడం ద్వారా ఆమె పని ముగిస్తుంది. 'రోజుకు 14 గంటలు పని చేస్తున్నాను. మానసికంగా శారీరకంగా చాలా కష్టమైనది ఈ పని. కాని ఇందులో నాకు ఆనందం ఉంది' అంటుంది ఆర్జూ ఖురానా.

లా చదివి

'మాది ఢిల్లీ. మా నాన్నకు నేను అడ్వకేట్ కావాలని కోరిక. నాకేమో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కావాలని చిన్నప్పటి నుంచి కల. ఒక్కతే కూతురుని. అడవుల్లో కెమెరా పట్టుకుని తిరగడానికి అమ్మా నాన్నలు ఒప్పుకోలేదు. నాన్న కోసం లా చేశాను కాని చివరకు ఒప్పించి వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌ని అయ్యాను. ఇందుకోసం నేను ఢిల్లీలో బేసిక్ ఫొటోగ్రఫీ కోర్సును చేశాను. కాని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ వేరు. దానికి వేరే శిక్షణ కావాలి. నెట్‌లో వెతికితే సుధీర్ శివరామ్ అనే ప్రసిద్ధ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ మాలాంటి వారి కోసం క్యాంప్స్ నిర్వహిస్తారని తెలిసింది. ఆయన రాజస్థాన్‌లోని భరత్‌పూర్ రిజర్వ్‌ఫారెస్ట్‌లో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ క్యాంప్ నిర్వహించినప్పుడు హాజరయ్యి పని కొంత తెలుసుకున్నాను. రెండు సారస్ కొంగల సరదా సంప్రదింపులను నేను మొదటిసారి ఫొటో తీశాను. అది అందరికీ నచ్చింది. ఆ క్షణమే అనుకున్నాను... అరణ్యానికి జనారణ్యానికి మధ్య వారధిగా నేను ఉండగలను అని. అడవుల్లో ఉండే పక్షులు జంతువుల తరఫున వకాల్తా పుచ్చుకోగలను అని' అంటుంది ఆర్జూ ఖురానా.

కలిసి బతకాలి

'మనుషులు కలిసి బతకడానికి కష్టపడుతుంటారు. అడవుల్లో తిరిగితే వందల వేల జీవులు ఎలా ఒకదానితో ఒకటి కలిసి బతుకుతాయో తెలుస్తుంది. అవి మనతో కూడా కలిసి బతకాలనే అనుకుంటాయి. కాని మన స్వార్థం కోసం అడవులు ధ్వంసం చేస్తూ వాటిని నాశనం చేస్తున్నాం. గత 50 ఏళ్లలో భూమి మీద ఉన్న జంతువులలో 50 శాతం నశించిపోయాయంటే నమ్ముతారా? ఇది నిజం. మనలో ప్రతి ఒక్కరం అడవుల పరిరక్షణకు, తద్వారా వన్యప్రాణి పరిరక్షణకు పూనుకోవాలి. లేకపోతే మిగిలేదేమీ ఉండదు. ఒక పులి ఉండదు. ఒక నక్కా కనిపించదు' అంటోంది ఆర్జూ ఖురానా.

పశ్చిమ కనుమలలో ప్రాణదాతలు

'ప్రాణదాత' అనే మాట మనుషులకు సంబంధించే ఎక్కువగా వినబడుతుంది. 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్'లోని మహిళలు మాత్రం పశ్చిమ కనుమల అరణ్యాలలోని మొక్కల ప్రాణదాతలు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మొక్కలు, చెట్లను కాపాడడానికి 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' ద్వారా మొక్కవోని కృషి చేస్తున్నారు. పచ్చటి అడవి పెదవుల మీద చిరునవ్వు చెరిగిపోకుండా కష్టపడుతున్నారు...

పశ్చిమ కనుమల అడవులు అపూర్వమైన చెట్లజాతులు, జంతుజాలం, పక్షి, చేప జాతులకు ప్రసిద్ధి పొందాయి. అయితే ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ది కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయుసిఎన్) పశ్చిమ కనుమల గురించి ఆందోళన వ్యక్తం చేసింది. అటవీ నిర్మూలన, వాతావరణ మార్పుల వల్ల మన దేశంలోని పశ్చిమ కనుమలు ప్రమాదంలో పడ్డాయి. ఈ ప్రాంతంలోని అడవులను రక్షించుకోవడానికి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడానికి కేరళలోని పెరియాలో ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పాటైన 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' లోని 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్' కృషి చేస్తోంది.

27 మంది మహిళలు ఉన్న 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్' 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ'లో అరుదైన మొక్కలను సంరక్షిస్తోంది. 'మొక్కలను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. ప్రమాదంలో ఉన్న మొక్కలకు ఈ గురుకులం శరణార్థి శిబిరంలాంటిది. ఆస్పత్రి కూడా అనుకోవచ్చు. మొక్కలకు సంబంధించిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ మట్టిపాత్రలతో ఉంటుంది' అంటుంది ఎకోసిస్టమ్ గార్డెనర్ సుప్రభా శేషన్.

తొంభై శాతం అడవులు మాయమైన పరిస్థితిని 'పర్యావరణ మారణహోమం'గా అభివర్ణిస్తుంది సుప్రభా శేషన్.

అడవులనే ఇల్లుగా భావిస్తున్న సుప్రభ శేషన్ 'గ్రీన్ ఆస్కార్'గా గుర్తింపు పొందిన యూకేలోని టాప్ ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్ 'విట్లీ'కి ఎంపికైంది.

గురుకుల బొటానికల్ శాంక్చువరీ (జీబిఎస్) అరుదైన మొక్కల 'స్వర్గధామం'గా పేరు తెచ్చుకుంది

పశ్చిమ కనుమల ప్రాంతాలలో 50 లక్షల మందికి పైగా నివసిస్తున్నందున అడవులు ప్రమాదం అంచున ఉన్నాయి. 28 ఏళ్లగా 'జీబిఎస్'లో పనిచేస్తున్న సుప్రభా శేషన్ అరణ్యాలకు సంబంధించిన పరిస్థితులు విషమించడాన్ని ప్రత్యక్షంగా చూసింది.

'అరుదైన మొక్కలను కాపాడడంలోని ఆనందం అంతా ఇంతా కాదు' అంటుంది సీనియర్ గార్డెనర్ లాలీ జోసెఫ్. పాతిక సంవత్సరాలుగా ఈ అభయారణ్యంలో పని చేస్తున్న జోసెఫ్ 'మొక్కలు సంతోషంగా ఉంటేనే మేము సంతోషంగా ఉండగలం' అంటోంది.

'నేను చూస్తుండగా అడవిలో ఒక చెట్టు నేల కూలిపోవడాన్ని మించిన విషాదం మరొకటి లేదు' అంటుంది లాలీ జోసెఫ్.

కీటకాలు, పాముల నుంచి రక్షణగా పెద్ద బూట్లు ధరించిన 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్'లోని మహిళలు అడవులలో తిరుగుతుంటారు. ప్రమాదంలో ఉన్న మొక్కలు, చెట్లను రక్షించడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటారు. సహజ పదార్థాల నుంచి పురుగు మందులను తయారుచేస్తుంటారు.





అడవి గుండె చప్పుడు విని...

ఢిల్లీలో పెరిగిన సుప్రభా శేషన్... కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలోని బ్రోక్‌వుడ్ పార్క్ సెంటర్ (యూకే)లో చదువుకుంది. అక్కడ ఉన్నప్పుడు తొలిసారిగా కేరళలోని 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' గురించి విన్నది. ల్యాండ్ స్కేప్ గార్డెన్స్, పార్క్ ల్యాండ్‌ల చరిత్రపై ప్రాజెక్ట్ చేస్తున్న సుప్రభ శేషన్‌ని కేరళలోని 'గురుకుల' ఆకర్షించింది. అమెరికాలోని ల్యాండ్ ఇనిస్టిట్యూట్‌లో ఒక సంవత్సరం పాటు అధ్యయన కార్యక్రమాల్లో భాగం అయిన సుప్రభ ఆ తరువాత మన దేశంలోని ఆదివాసీ గూడేలలో మకాం వేసి అడవుల గుండె చప్పుడు విన్నది. తన ప్రయాణంలో భాగంగా 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' (జీబిఎస్) వ్యవస్థాపకుడు వోల్ఫ్ గాంగ్‌ను కలిసింది. 'జీబిఎస్' ద్వారా అడవులను రక్షించడానికి వారు చేస్తున్న ప్రయత్నాల గురించి తెలుసుకుంది. అలా లాలీ జోసెఫ్, సుమ కెలోత్‌లాంటి ఇతర 'జీబియస్' సభ్యులతో కలిసి అడవిబాట పట్టింది. పశ్చిమ కనుమలలోని పర్వతాలను అధిరోహించింది. అంతరించిపోతున్న మొక్కల జాతుల గురించి తెలుసుకోవడమే కాదు వాటి పరిరక్షణలో భాగంగా 'జీబియస్'గా గార్డెనర్‌గా ప్రయాణాన్ని ప్రారంభించింది.



ఈ నల్లని రాళ్లలో..

'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' లోని సీనియర్ గార్డెనర్ అయిన లాలీ జోసెఫ్, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మొక్కల కోసం అన్వేషిస్తుంటుంది. గురుకులంలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ద్వారా వాటిని బతికించే ప్రయత్నం చేస్తుంది. కొండ, కోనలు తిరుగుతూ మొక్కల యోగక్షేమాలు తెలుసుకుంటుంది.

నేడు ప్రపంచ అటవీ దినోత్సవం

అక్షరం

సజీవ ప్రపంచంలోకి...

నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్(సిఎన్‌పీ)కి వెళ్లి వచ్చిన తరువాత వైశాలికి 'సీతాస్ చిత్వాన్' అనే పుస్తకం రాయడం ప్రారంభించింది. ఈ పార్క్‌కు వెళ్లడానికి ముందు తన కుటుంబంతో కలిసి మన దేశంలోని ఎన్నో జాతీయ పార్క్‌లను చూసింది వైశాలి. ఏ పార్క్‌కు వెళ్లినా అందులోని జీవవైవిధ్యం తనకు బాగా నచ్చేది.

సాలె పురుగుల నుంచి పెద్ద పిల్లుల వరకు ఏనుగుల నుంచి ఆకాశాన్ని అంటుతున్నట్లు కనిపించే చెట్ల వరకు తనను అమితంగా ఆకట్టుకునేవి.

'ప్రకృతిని కాపాడుకుంటేనే బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చు' అనే సత్యాన్ని పిల్లలకు బోధ పరచడానికి 'సీతాస్ చిత్వాన్' పుస్తకం రాసింది.

'పర్యావరణ పరిరక్షణకు సంబంధించి చిత్తశుద్ధి ఉంటే అడవులను తద్వారా రాబోయే తరాలను కాపాడుకోవచ్చు. అడవి ఒక పాఠశాల. సహనంతోనూ, సాహసోపేతంగా ఉండడాన్ని నేర్పుతుంది. జీవరాశుల పట్ల సానుభూతి కలిగి ఉండడాన్ని నేర్పుతుంది' అని 'సీతాస్ చిత్వాన్' ద్వారా చెబుతుంది వైశాలి.

**వైశాలి ష్రాఫ్ చేతిలో మంత్రదండం ఉంది.
ఆ మంత్రదండం అడవులను బడులకు రప్పించగలదు.
అలనాటి రాక్షస బల్లులతో ఈనాటి పిల్లలను మాట్లాడించగలదు.
ఆ మంత్రదండం పేరు కలం.
ముంబైకి చెందిన వైశాలి ష్రాఫ్ పర్యావరణ సంబంధిత విషయాలపై పిల్లల్లో అవగాహన కలిగించడానికి ఎన్నో పుస్తకాలు రాసింది.
జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకుంది...**



వైశాలి ష్రాఫ్

ప్రాపంచిక, పర్యావరణానికి సంబంధించిన విషయాల గురించి తగిన సమాచారంతో ఫిక్షన్ ఫార్మట్‌లో చెప్పడం వైశాలికి ఇష్టం. ఈ ఫార్మట్‌లో ఎన్నో ప్రయోగాలు చేసింది. ఆకట్టుకునే క్యారెక్టర్‌లను సృష్టించింది.

పిల్లలు పుస్తకంలోని పాత్రలతో కనెక్ట్ కావడమే కాకుండా పర్యావరణానికి సంబంధించిన ఎన్నో విషయాల గురించి తెలుసుకుంటారు.

తన బామ్మ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకుంది వైశాలి.

వైశాలి స్కూల్ రోజుల్లో... తన బామ్మ ఒక మూలన కుర్చీలో కూర్చుని ఏదో ఒక పుస్తకం సీరియస్‌గా చదువుతూ కనిపించేది. బామ్మను అనుకరిస్తూ వైశాలి కూడా ఏదో కథల పుస్తకం చదువుతూ కూర్చునేది. మధ్య మధ్యలో బామ్మను ఆసక్తిగా చూసేది. ఈ అనుకరణ కాస్తా ఆ తరువాత పుస్తకాలు చదివే అలవాటుగా మారింది. ఆ అలవాటే తనని పిల్లల రచయిత్రిని చేసింది.

'ఫిక్షన్, నాన్ ఫిక్షన్‌లలో నాన్ ఫిక్షన్ రాయడమే కష్టం. నాన్ ఫిక్షన్ పుస్తకాల కోసం బోలెడు సమాచార సేకరణ చేయాల్సి ఉంటుంది' అంటుంది వైశాలి. మన దేశంలోని రాక్షస బల్లుల గురించి సాధికారమైన సమాచారంతో ఆమె రాసిన 'బ్లూథింగోసారస్' నాన్-ఫిక్షన్ పుస్తకానికి ఎంతో మంచి స్పందన వచ్చింది.

వివిధ రకాల వ్యక్తీకరణల ద్వారా కమ్యూనికేట్ చేయడానికి, కనెక్ట్ కావడానికి భాషలు వీలు కల్పిస్తాయి. వైశాలి తాజా పుస్తకం 'తాతుంగ్ తతుంగ్ అండ్ అదర్ అమేజింగ్ స్టోరీస్' పుస్తకం భారతీయ భాషల విస్తృతి, లోతు గురించి పిల్లల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. మాతృభాషల గొప్పదనాన్ని తెలియజేస్తుంది. గుహ గోడలపై ఉన్న చిత్రలిపి నుంచి పురాతన, సమకాలీన స్థానిక భాషలకు సంబంధించిన వివరాలు ఈ పుస్తకంలో ఉంటాయి.

'తాతుంగ్ తతుంగ్... మన దేశపు అద్భుతమైన భాషా సంప్రదాయాన్ని కళ్లకు కడుతుంది. భాషలు, వాటి గొప్ప వారసత్వాలు కనుమరుగు కాకూడదని హెచ్చరిస్తుంది. ఈ పుస్తకం చదవడం ద్వారా పిల్లలకు తమ మాతృభాష పట్ల మరింత అభిమానం పెరుగుతుంది' అంటారు రచయిత, రాజకీయ నాయకుడు శశిథరూర్.

'భిన్నమైన విషయాల గురించి భిన్నమైన పద్ధతుల్లో రాయడం ఇష్టం' అంటున్న వైశాలి ష్రాఫ్ పిల్లల కోసం మరిన్ని మంచి పుస్తకాలు రాయాలని ఆశిద్దాం.

బ్యూటిప్స్ -హెయిర్ కేర్



వేసవిలో జుట్టు రాలిపోయే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అందువల్ల కొన్ని చిన్న చిట్కాలను పాటించడం ద్వారా దానిని అరికట్టవచ్చు.

యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న గ్రీన్ టీ జుట్టు పెరుగుదలను, బలాన్ని పెంచుతుంది. 2–3 గ్రీన్ టీ బ్యాగ్‌లను వేడి నీటిలో నానబెట్టండి. చల్లారిన తర్వాత, మీ జుట్టు, తలపై మసాజ్ చేయాలి. ఒక గంట పాటు అలాగే ఉంచి చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి.

మెంతి గింజల పేస్ట్

మెంతులను రాత్రంతా నానబెట్టి, ఆపై వాటిని పేస్ట్‌గా రుబ్బుకోవాలి. ఈ గ్రోత్-బూస్టింగ్ మాస్క్‌ని మీ జుట్టుకు అప్లై చేసి 30–40 నిమిషాల పాటు అలాగే ఉంచండి. తరువాత, చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి.



పరాజయంతో పునరాగమనం

ప్రపంచ మాజీ నంబర్‌వన్ సిమోనా హలెప్ పరాజయంతో ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో పునరాగమనం చేసింది. మయామి ఓపెన్ టోర్నీలో హలెప్ (రొమేనియా) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. పౌలా బదోసా (స్పెయిన్)తో జరిగిన మ్యాచ్‌లో హలెప్ 6-1, 4-6, 3-6తో ఓడిపోయింది. హలెప్ 2022లో డోపింగ్‌లో విఫలమవడంతో నాలుగేళ్ల నిషేధం విధించారు. అయితే ఈ నిషేధంపై ఆమె కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో అప్పీల్ చేసింది. విచారణ తర్వాత హలెప్ నిషేధాన్ని 9 నెలలకు కుదించారు.

'టాప్' ర్యాంక్‌లోనే సూర్యకుమార్

గత మూడు నెలలుగా ఆటకు దూరంగా ఉన్నా... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల టి20 ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ తన నంబర్ వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో సూర్యకుమార్ 861 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఐర్లాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో రాణించిన రషీద్ ఖాన్ నాలుగు స్థానాలు ఎగబాకి పదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ 4వ ర్యాంక్‌లో ఉన్నాడు.



అరంగేట్రంలో అదరగొట్టేందుకు!

- తొలిసారి ఐపీఎల్ బరిలో యువతారలు
- అందరి దృష్టి రచిన్ రవీంద్రపైనే

రేపటి నుంచి ఐపీఎల్ 17వ సీజన్

సత్తా ఉన్న ప్రతిభావంతులకు తారాజువ్వలా దూసుకుపోయేందుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సరైన వేదిక. స్వదేశీ ఆటగాళ్లయినా... విదేశీ ఆటగాళ్లయినా ఒక్కసారి ఐపీఎల్‌లో ఆడి మెరిపిస్తే కావాల్సినంత గుర్తింపు వస్తుందనడంలో సందేహం లేదు. నిలకడైన ఆటతీరుతో కెరీర్‌ను గాడిలో పెట్టుకోవడానికి.... ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఐపీఎల్ దోహదం చేస్తోంది. ఇప్పటికే ఎంతో మంది క్రికెటర్లు ఐపీఎల్‌లో అదరగొట్టి తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. రాబోయే ఐపీఎల్ 17వ సీజన్‌లో అరంగేట్రంలోనే తమ విధ్వంసకర ఆటతీరుతో, ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. –సాక్షి క్రీడా విభాగం


రచిన్ రవీంద్ర

➤ గెలుపు గుర్రం... రచిన్ రవీంద్ర (చెన్నై)

అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక్కసారిగా తెరపైకి వచ్చాడు ఈ న్యూజిలాండ్ క్రికెటర్. ఫార్మాట్ ఏదైనా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. అనతికాలంలోనే జట్టు ముఖ్య సభ్యుడిగా ఎదిగాడు. గత ఏడాది భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో రచిన్ 10 మ్యాచ్‌లు ఆడి 578 పరుగులు సాధించి న్యూజిలాండ్ టాప్ స్కోరర్‌గా నిలవడంతోపాటు టాప్-4లో చోటు సంపాదించాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టి20లో కేవలం 35 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో చెలరేగి 68 పరుగులు చేశాడు. తొలిసారి ఐపీఎల్ ఆడబోతున్న రచిన్ తన మెరుపులతో మెరిపించి చెన్నై సూపర్ కింగ్స్ టైటిల్ నిలబెట్టుకునేందుకు తనవంతు పాత్ర పోషిస్తే మాత్రం భవిష్యత్‌లో టాప్ స్టార్‌గా ఎదగడం ఖాయం.

➤ సిక్సర్ల వీరుడు... సమీర్ రిజ్వీ (చెన్నై)



ఐపీఎల్‌లో ఐదుసార్లు విజేతగా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ వేలంలో ఆటగాళ్లను ఎంచుకునే సమయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. కానీ గత మినీ వేలంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల సమీర్ రిజ్వీ కోసం చెన్నై పట్టుబట్టింది. ఇంకా భారత జట్టుకు ఆడని సమీర్ రిజ్వీని చెన్నై ఏకంగా రూ. 8 కోట్ల 40 లక్షలు వెచ్చించింది. ముస్తాక్ అలీ దేశవాళీ టి20 టోర్నీలో భాగంగా తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో రిజ్వీ యూపీని గెలిపించినంత పనిచేశాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్లు సాయికిశోర్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తిలపై విరుచుకుపడిన రిజ్వీ ఆ మ్యాచ్‌లో 46 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో అజేయంగా 75 పరుగులు చేశాడు. యూపీ టి20 లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్ జట్టు తరఫున అత్యధిక సిక్స్‌లు బాది వెలుగులోకి వచ్చిన రిజ్వీ కల్నల్ సీకే నాయుడు అండర్-23 టోర్నీలో ఏకంగా ట్రిపుల్ సెంచరీ సాధించాడు. ఆడుతున్న తొలి ఐపీఎల్‌లో తనపై పెట్టుకున్న అంచనాలను నిజం చేసేందుకు రిజ్వీ రెడీ అవుతున్నాడు.

➤ వేగం.. వైవిధ్యం.. గెరాల్డ్ కొయెట్జీ (ముంబై)



గతంలో రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీ గెరాల్డ్ కొయెట్జీని ప్రత్యామ్నాయ ప్లేయర్‌గా తీసుకున్నా మ్యాచ్ ఆడించలేదు. వేగంతోపాటు వైవిధ్యభరిత బౌలింగ్‌తో కొయెట్జీ గత వన్డే వరల్డ్‌కప్‌లో ఏకంగా 20 వికెట్లు పడగొట్టి టాప్-5లో నిలిచాడు. ఈ ప్రదర్శన ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని ఆకట్టుకుంది. 23 ఏళ్ల కొయెట్జీని ముంబై రూ. 5 కోట్లకు సొంతం చేసుకుంది. ఈసారి ఐపీఎల్‌లో బుమ్రా తర్వాత ముంబై తరఫున రెండో ప్రధాన బౌలర్‌గా కొయెట్జీని చూడవచ్చు.

➤ ఆల్‌రౌండర్... అజ్మతుల్లా (గుజరాత్)



2022లో కొత్త జట్టుగా వచ్చిన గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో తొలి ప్రయత్నంలోనే ఐపీఎల్ చాంపియన్‌గా అవతరించింది. గత ఏడాది రన్నరప్‌గా నిలిచింది. అయితే ఈ ఏడాది పాండ్యా గుజరాత్‌ను వీడి ముంబై ఇండియన్స్‌కు వెళ్లిపోయాడు. దాంతో పాండ్యా తరహాలో టైటాన్స్‌కు ఆల్‌రౌండర్ కొరత ఏర్పడింది. ఈ లోటును కొంతలో కొంత అఫ్గానిస్తాన్ ప్లేయర్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్ భర్తీ చేస్తాడని చెప్పవచ్చు. రూ. 50 లక్షలకు అజ్మతుల్లాను టైటాన్స్ కొనుగోలు చేసింది. గత ఏడాది వన్డే వరల్డ్‌కప్‌లో అజ్మతుల్లా 353 పరుగులు చేయడంతోపాటు ఏడు వికెట్లు పడగొట్టాడు.

➤ లెఫ్టార్మ్ పేసర్... జాన్సన్ (గుజరాత్)



మడమ గాయంతో గుజరాత్ టైటాన్స్ ప్రధాన బౌలర్ మొహమ్మద్ షమీ ఈ ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. దాంతో టైటాన్స్ బౌలింగ్ విభాగం కాస్త బలహీనపడింది. అయితే ఆస్ట్రేలియాకు చెందిన లెఫ్టార్మ్ పేసర్ స్పెన్సర్ జాన్సన్ రూపంలో టైటాన్స్‌కు మరో మంచి బౌలర్ దొరికాడనే చెప్పాలి. 28 ఏళ్ల జాన్సన్ గత రెండేళ్లలో ఎంతో రాటుదేలాడు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే టి20 లీగ్‌లలో పాల్గొన్నాడు. మినీ వేలంలో గుజరాత్ టైటాన్స్ ఏకంగా రూ. 10 కోట్లు వెచ్చించి జాన్సన్‌ను తీసుకుంది.

➤ లక్కీ చాన్స్... షామర్ జోసెఫ్ (లక్నో)



ఆస్ట్రేలియాతో ఈ ఏడాది జనవరిలో జరిగిన టెస్టులో షామర్ జోసెఫ్ ఏడు వికెట్లు తీసి వెస్టిండీస్‌ను గెలిపించాడు. ఈ ప్రదర్శనతో షామర్ అంతర్జాతీయస్థాయిలో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించాడు. గత ఏడాది మినీ వేలంలో షామర్‌ను ఎవరూ తీసుకోలేదు. అయితే ఇంగ్లండ్‌కు చెందిన పేస్ బౌలర్ మార్క్ వుడ్ గాయంతో తప్పుకోవడంతో అతని స్థానంలో లక్నో సూపర్ జెయింట్స్ షామర్ జోసెఫ్‌ను రూ. 3 కోట్లకు తీసుకుంది.

సింధు శుభారంభం

ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్, లక్ష్య సేన్



బాసెల్ (స్విట్జర్లాండ్): మాజీ చాంపియన్ పీవీ సింధు స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు 21-12, 21-13తో పోర్న్‌పిచా చొయ్‌కీవోంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో జపాన్ ప్లేయర్ తొమోకా మియజకీతో సింధు ఆడుతుంది. పురుషుల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్ కూడా తొలి రౌండ్‌లో విజయాలు అందుకున్నారు. 2015లో స్విస్ ఓపెన్ విజేతగా నిలిచిన శ్రీకాంత్ 21-17, 21-18తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై నెగ్గగా... లక్ష్య సేన్ 21-19, 15-21, 21-11తో లియోంగ్ జున్ హావో (మలేసియా)ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో... పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీలు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. తొలి రౌండ్‌లో అశ్విని-తనీషా ద్వయం 21-18, 12-21, 21-19తో మెలీసా పుస్పితాసారి-రేచల్ రోజ్ (ఇండోనేసియా) జంటపై... గాయత్రి-ట్రెసా జోడీ 21-15, 21-12తో అనీ జు-కెరీ జు (అమెరికా) ద్వయంపై గెలుపొందాయి.

విజయమే లక్ష్యంగా...

నేడు అఫ్గానిస్తాన్‌తో భారత్ పోరు



అభా (సౌదీ అరేబియా): ఫుట్‌బాల్ ప్రపంచకప్-2026 ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా నేడు అఫ్గానిస్తాన్‌తో భారత జట్టు తలపడనుంది. తటస్థ వేదిక సౌదీ అరేబియా ఆతిథ్యమివ్వనున్న ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి గం. 12:30 నుంచి జరుగుతుంది. నాలుగు జట్లున్న గ్రూప్ 'ఎ'లో భారత జట్టు రెండు మ్యాచ్‌లు ఆడింది. ఒక మ్యాచ్‌లో నెగ్గి, ఒక మ్యాచ్‌లో ఓడి మూడు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. సునీల్ ఛెత్రి కెప్టెన్సీలో భారత జట్టుకు మరో విజయం లభిస్తే మూడో రౌండ్‌కు అర్హత పొందేందుకు తమ అవకాశాలను మెరుగుపర్చుకుంటుంది. అఫ్గానిస్తాన్‌తో ముఖాముఖిగా 11 సార్లు తలపడ్డ భారత్ ఏడుసార్లు గెలిచింది. మూడు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది.

క్వార్టర్స్‌లో స్నేహిత్

డబుల్స్‌లో శ్రీజ జోడీకి కాంస్యం



బీరుట్ (లెబనాన్): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్లు ఆకుల శ్రీజ, సూరావజ్జుల స్నేహిత్‌లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో స్నేహిత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... మహిళల సింగిల్స్‌లో శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 166వ ర్యాంకర్ స్నేహిత్ 11-7, 11-8, 11-13, 15-13తో ప్రపంచ 58వ ర్యాంకర్ అహ్మద్ సలెహ్ (ఈజిప్ట్)ను బోల్తా కొట్టించాడు. శ్రీజ 10-12, 9-11, 11-2, 9-11తో భారత్‌కే చెందిన ఐహిక ముఖర్జీ చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో శ్రీజ-దియా చిటాలె (భారత్) ద్వయం 9-11, 8-11, 5-11తో చాంటల్ మాంట్జ్ (జర్మనీ)-ఇజాబెలా లుపులెస్కు (సెర్బియా) జోడీ చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో స్నేహిత్-శ్రీజ (భారత్) జోడీ తొలి రౌండ్‌లో 4-11, 4-11, 8-11తో జియా లియాన్ ని-లుకా మ్లాడెనోవిచ్ (లక్సెంబర్గ్) జంట చేతిలో ఓటమి పాలైంది. భారత్‌కే చెందిన మానవ్ ఠక్కర్-అర్చన కామత్... మనుష్ షా-దియా చిటాలె జోడీలు మిక్స్‌డ్ విభాగం ఫైనల్లోకి దూసుకెళ్లాయి.

సినిమా

తనకు అంత పిచ్చి ఉంటుందనుకోలేదు


● రామ్‌చరణ్, జాన్వీకపూర్, చిరంజీవి

– రామ్‌చరణ్

''డైరెక్టర్ సుకుమార్‌గారి టీమ్‌లో బుచ్చిబాబు బెస్ట్. తనకు సినిమా అంటే పిచ్చి. 'రంగస్థలం' కథని సుకుమార్ గారు నాకు నలభై నిమిషాలు చెప్పారు. ఆ తర్వాత ప్రతి రోజూ నాకు రెండేసి గంటలు నెరేషన్ ఇచ్చింది మాత్రం బుచ్చిబాబునే. తనకు సినిమా అంటే అంత పిచ్చి ఉంటుందనుకోలేదు'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్). మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమా బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత బోనీ కపూర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో చిరంజీవి క్లాప్ కొట్టారు. డైరెక్టర్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందించారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ ''నేను, జాన్వీ కలిసి 'జగదేకవీరుడు-అతిలోక సుందరి' లాంటి మూవీ చేయాలని చాలామంది అనుకున్నారు. మా కాంబినేషన్ 'ఆర్‌సీ 16'తో నిజం కావడం హ్యాపీ'' అన్నారు. ''నాపై నమ్మకంతో రామ్‌చరణ్‌గారు ఇచ్చిన అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకుంటాను'' అన్నారు బుచ్చిబాబు సానా. ''బుచ్చిబాబు ఏదైనా పెద్దగా ఆలోచిస్తాడు. తన కథపై తనకు ఉన్న నమ్మకం అలా ఉంటుంది'' అన్నారు డైరెక్టర్ సుకుమార్. ''ఈ సినిమాకి ఇప్పటికే మూడు ట్యూన్స్ పూర్తి చేశాం'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్. ''నేను ఎంతగానో అభిమానించే ప్రముఖులందరితో కలిసి ఈ వేడుకలో పాల్గొనడం నా అదృష్టం'' అన్నారు జాన్వీ కపూర్. ''బుచ్చిబాబు ఈ సినిమాతో తప్పకుండా మరో హిట్ కొడతాడు'' అన్నారు నిర్మాత నవీన్ ఎర్నేని. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు వై. రవిశంకర్, 'దిల్' రాజు, శిరీష్, సాహూ గారపాటి, రామ్ ఆచంట, నాగవంశీ, ఎమ్మెల్యే రవి గొట్టిపాటి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సమర్పకుడు: సుకుమార్, కెమెరా: రత్నవేలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై. ప్రవీణ్ కుమార్.


● మోహన్‌బాబు మంచు, నిర్మలాదేవి, విరానికా, విష్ణు మంచు

కన్నప్ప నా మనసుకు ఎంతో దగ్గరైంది

– విష్ణు మంచు

''కన్నప్ప' కథ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. కామిక్ పుస్తకం కూడా సినిమాలానే ఉంటుంది. మన చరిత్ర, మన మూలాలను తెలుసుకునేలా చేయడంలో ఇది గొప్ప ప్రారంభం అని నేను భావించాను. ఇది నేను డబ్బు కోసం చేస్తున్న పని కాదు.. ఈ కథ నా మనసుకు ఎంతో దగ్గరైంది. కన్నప్ప భక్తి భావాన్ని ప్రపంచమంతా తెలుసుకోవాలనుకుంటున్నాను'' అని హీరో విష్ణు మంచు అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో విష్ణు మంచు హీరోగా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో మోహన్‌బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. కాగా మార్చి 19న మోహన్‌బాబు పుట్టినరోజు, మోహన్‌బాబు యూనివర్సిటీ 32వ వార్షిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి నటులు మోహన్‌లాల్ గౌరవ ముఖ్య అతిథిగా, ముఖేష్ రిషి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో 'కన్నప్ప స్టోరీ బుక్ వాల్యూమ్ 1'ని ఆవిష్కరించిన విష్ణు మంచు మాట్లాడుతూ– ''ఈ పుస్తకం భక్త కన్నప్ప పురాణ కథను కామిక్ రూపంలో చూపిస్తుంది. నేను చదివిన అత్యంత ఉత్తేజకరమైన కథను ప్రపంచానికి తెలియజేయాలనేది నా కల. నేటితరం యువత ఈ కథను, చరిత్రను తెలుసుకోవాలి'' అన్నారు.

వెండితెరకి ఇళయరాజా


● కమల్‌హాసన్, ఇళయరాజా, ధనుష్

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా జీవితం వెండితెరపైకి వస్తోంది. ధనుష్ లీడ్ రోల్‌లో నటిస్తున్న 'ఇళయరాజా' చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ మూవీకి అరుణ్‌మాథేశ్వరన్ దర్శకుడు. కనెక్ట్ మీడియా, పీకే ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యూరీ మూవీస్ సమర్పణలో రూపొందుతున్న 'ఇళయరాజా' షూటింగ్ బుధవారం చెన్నైలో ప్రారంభమైంది. ఈ వేడుకకి ఇళయరాజా, హీరోలు కమల్ హాసన్, ధనుష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇళయరాజాతో తమకున్న అనుబంధాన్ని కమల్‌హాసన్, ధనుష్ పంచుకున్నారు. కాగా ఈ మూవీ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. తమిళ్, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి నీరవ్ షా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కాగా ఈ మూవీకి ఇళయరాజా సంగీతం అందిస్తారని కోలీవుడ్ టాక్.

నా పెళ్ళాం దెయ్యం!


● రామ్‌గోపాల్ వర్మ

'నా పెళ్ళాం దెయ్యం' అంటున్నారు డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ. ఆయన దర్శకత్వం వహించిన 'వ్యూహం, శపథం' సినిమాలు ఇటీవల విడుదల అయ్యాయి. తాజాగా తన కొత్త చిత్రాన్ని ప్రకటించారు వర్మ. ఈ మూవీకి 'నా పెళ్ళాం దెయ్యం' అనే టైటిల్‌ని అనౌన్స్ చేసి, తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్టర్‌ని షేర్ చేశారాయన. అయితే ఈ మూవీలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలేవి ప్రకటించలేదు.


● కీర్తి సురేష్

ఆ అంశం కిక్ ఇచ్చింది

– శ్రీ విష్ణు



''నా సినిమాలకు పెట్టుబడి పెట్టే నిర్మాతలు నష్టపోకూడదని కోరుకుంటాను. ఇండస్ట్రీలో నా మార్కెట్ పెరగడం, తగ్గడం అనేది నా చేతుల్లో లేని విషయం. ఏ సినిమా వల్ల మార్కెట్ పెరుగుతుందో, ఏ సినిమా వల్ల తగ్గుతుందో గ్యారెంటీగా చెప్పలేం'' అని శ్రీవిష్ణు అన్నారు. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో వి సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ– ''సైంటిస్టులు కావాలని ఉస్మానియా యూనివర్సిటీలో చాలా కాలంగా తిష్ట వేసిన ఓ ముగ్గురు పీహెచ్‌డీ స్కాలర్స్‌ను అక్కడి విద్యార్థులు ఓ స్కెచ్ వేసి బయటకు పంపిస్తారు. అలా బయటకు వచ్చిన ఆ ముగ్గురు భైరవపురం అనే ఊరికి వెళ్లినప్పుడు అక్కడ ఏం జరిగింది? ఈ ముగ్గురి నిధి అన్వేషణ ఫలించిందా? లేదా అన్నది 'ఓం భీమ్ బుష్' కథాంశం. అలాగే ఈ మూవీలో కొత్త పాయింట్‌ని టచ్ చేశాం. ఆ అంశం నాకు కిక్ ఇచ్చింది. నా తర్వాతి చిత్రం 'స్వాగ్' పూర్తి కావొచ్చింది. గీతా ఆర్ట్స్, కోనగారితో సినిమాలు కమిటయ్యాను. అలాగే ఓ థ్రిల్లర్ ఫిల్మ్ కూడా ఉంది'' అన్నారు.

ఉప్పు కప్పురంబు!

హీరోయిన్ కీర్తి సురేష్ మెయిన్ లీడ్ రోల్‌లో నటించనున్న కొత్త సినిమాకు 'ఉప్పు కప్పురంబు' అనే టైటిల్ ఖరారైనట్లు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో 'కలర్ ఫోటో' ఫేమ్ సుహాస్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. అని ఐవీ శశి దర్శకత్వంలో రాధికా లావు ఈ చిత్రం నిర్మిస్తున్నారు. వసంత్ మురళీ కృష్ణ మరింగంటి కథ అందిస్తున్నారు. ఓ గ్రామంలోని స్మశానం విస్తరణ నేపథ్యంలో 'ఉప్పు కప్పురంబు' సినిమా కథనం ఉంటుందనే ప్రచారం ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలో కీర్తి సురేష్, సుహాస్ జంటగా నటిస్తారా? లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

కొత్త జేమ్స్ బాండ్?


● ఆరోన్ టేలర్ జాన్సన్

హాలీవుడ్ 'జేమ్స్ బాండ్' ఫ్రాంచైజీ సూపర్‌హిట్. 'జేమ్స్ బాండ్' సినిమా ఎప్పుడు వచ్చినా ప్రేక్షకాదరణ ఉంటుంది. ఈ ఫ్రాంచైజీలో ఇప్పటివరకు 25 సినిమాలు వచ్చాయి. హాలీవుడ్ నటుడు డేనియల్ క్రైగ్ ఎక్కువ సార్లు జేమ్స్ బాండ్‌గా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించారు. 2021లో వచ్చిన జేమ్స్ బాండ్ 25వ చిత్రం 'జేమ్స్ బాండ్: నో టైమ్ టు డై'లోనూ డేనియల్ క్రైగ్ బాండ్‌గా కనిపించారు. తాజాగా జేమ్స్ బాండ్ 26వ సినిమా గురించిన వార్తలు హాలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ఈ సినిమాకు తొలుత డేనియల్ క్రైగ్ పేరు వినిపించింది. కానీ మరోసారి బాండ్‌గా కనిపించేందుకు డేనియల్ ఆసక్తికరంగా లేరట. దీంతో కొత్త జేమ్స్ బాండ్‌గా ఎవరు కనిపిస్తారు? అనే చర్చ హాలీవుడ్‌లో మొదలైంది. ఈ క్రమంలో ఆరోన్ టేలర్ జాన్సన్ పేరు తెరపైకి వచ్చింది. యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడం, వయసు రీత్యా కూడా జేమ్స్ బాండ్‌గా ఆరోన్ పర్‌ఫెక్ట్ చాయిస్ అంటున్నారు కొందరు హాలీవుడ్ సినీ ప్రేమికులు. అలాగే 'జేమ్స్‌బాండ్ 26'వ చిత్రానికి క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇక హాలీవుడ్ చిత్రాలు 'కిక్కాస్', 'చాట్ రూమ్', 'గాడ్జిల్లా', 'అవెంజర్స్' వంటి సినిమాల్లో నటించి మెప్పించారు ఆరోన్ టేలర్.

బాలీవుడ్ అశ్వత్థామ


● షాహిద్ కపూర్

బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'అశ్వత్థామ: ది సాగా కంటిన్యూస్' టైటిల్ ఖరారైంది. కన్నడ దర్శకుడు సచిన్ రవి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. వసు భగ్నాని, జాకీ భగ్నాని, దీప్షికా దేశ్‌ముఖ్ నిర్మిస్తున్న ఈ సినిమా అధికారిక ప్రకటన వెల్లడైంది. సచిన్ రవి మాట్లాడుతూ– ''మహా భారతంలోని అశ్వత్థామ ఇప్పటికీ జీవించే ఉంటారని కొందరి నమ్మకం. మహాభారత కాలంనాటి ఓ అమరుడు ఇప్పటి ఆధునిక కాలానికి వస్తే ఏం జరుగుతుంది? అనే అంశాలను ఈ సినిమాలో చూపిస్తున్నాం'' అన్నారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో లెజెండ్స్ యుద్ధం చేస్తే ఎలా ఉంటుంది? అనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుంది. త్వరలోనే మూవీ రిలీజ్ డేట్ వెల్లడిస్తాం'' అని పేర్కొన్నారు జాకీ భగ్నాని.

సరికొత్తగా...


● అప్సరా రాణి

'క్రాక్, డీ కంపెనీ, సీటీమార్' చిత్రాల ఫేమ్ అప్సరా రాణి, అరుణ్ ఆదిత్య జంటగా కృష్ణబాబు దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. జస్ట్ ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో నల్లా శ్రీదేవి నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ క్లాప్ కొట్టారు. దర్శకుడు వి. సముద్ర గౌరవ దర్శకత్వం వహించారు. కృష్ణబాబు మాట్లాడుతూ– ''సరికొత్త కథాంశంతో రూపొందుతున్న సినిమా ఇది'' అన్నారు. ''నా కెరీర్‌కు ఈ సినిమా ప్లస్ అవుతుందని నమ్మకంగా ఉంది'' అన్నారు అప్సరా రాణి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వెంకటేష్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సీఎన్ గోపీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్

గురువారం
21-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	90	72,102
నిఫ్టీ ▲	22	21,839

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,158	▽	8
డోజోన్స్	39,109	▽	2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,737	▽	1
డాక్స్	18,015	▲	28
షాంఘై	3,079	▲	17
నికాయ్	40,004	▲	236

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	65,689	▲	100
బంగారం (99.5 స్వచ్ఛత)	65,426	▲	100
వెండి (కిలో)	73,886	▲	42

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.19	84.48
£	బ్రిటన్ పౌండ్		103.88	108.12
€	యూరో		88.12	91.990
¥	జపాన్ ఎన్ (100)		47.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.07	56.58
S$	సింగపూర్ డాలర్		60.13	64.88
SAR	సౌదీ రియాల్		21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్		21.65	23.43
¥	చైనా యువాన్		10.28	12.29

నష్టాల్లోంచి లాభాల్లోకి...

రాణించిన రిలయన్స్, ఐటీసీ, ఎస్‌బీఐ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, అధిక వెయిటేజీ రిలయన్స్(1.25%), ఐటీసీ(1.50%), ఎస్‌బీఐ(2%) షేర్లు రాణించడంతో సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. అయితే రూపాయి క్షీణత, చిన్న కంపెనీల షేర్లలో అమ్మకాలు సూచీల భారీ లాభాలకు అడ్డుకట్టవేశాయి. తొలిసెషన్‌లో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ట్రేడింగ్‌లో 729 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 90 పాయింట్ల లాభంతో 72,102 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 71,674 కనిష్టాన్ని, 72,403 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 221 పాయింట్ల రేంజ్‌లో 21,931 వద్ద గరిష్టాన్ని, 21,710 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 22 పెరిగి 21,839 వద్ద నిలిచింది.

రెండు నెలల కనిష్టానికి రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 16 పైసలు క్షీణించి 83.19 వద్ద నిలిచింది. ఈ ముగింపు స్థాయి రెండు నెలల కనిష్టం.

ట్రస్ట్ ఫిన్‌టెక్ @ రూ.95–101

సాస్ ప్రొడక్ట్ ఆధారిత ఫిన్‌టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లు అందించే ట్రస్ట్ ఫిన్‌టెక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 95–101 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 26న ప్రారంభమై 28న ముగియనుంది.ఆఫర్ ద్వారా కంపెనీ రూ. 63 కోట్లకుపైగా సమీకరించే యోచనలో ఉంది.

రూ.12 వేల స్థాయిని తాకిన మారుతీ



కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ షేరు ట్రేడింగ్‌లో తొలిసారి రూ.12,000 స్థాయిని అందుకుంది. సీఎస్‌జీ వ్యక్తిగత వాహన విభాగంలో ఈ కంపెనీ అగ్రస్థానంలో కొనసాగుతుందని బ్రోకరేజ్ సంస్థ సీఎల్ఎస్ఏ అవుట్‌లుక్ వ్యాఖ్యలు షేరు ర్యాలీకి కారణమయ్యాయి. ఇంట్రాడేలో మూడున్నర శాతం బలపడి రూ.12,025 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 3% లాభంతో రూ.11,942 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ బీఎస్ఈలో రూ.3.75 లక్షల కోట్లుగా నమోదైంది.



ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో నార్త్‌బ్లాక్‌లో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ సమావేశమయ్యారు. ఎకానమీపై చర్చించారు. కాగా సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ కూడా ఆర్థిక మంత్రితో సమావేశమై మార్కెట్ పరిణామాలను వివరించారు. స్విగ్గీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రోహిత్ కపూర్ సీతారామన్‌తో సమావేశమయినట్లు మరో పోస్ట్‌లో ఆర్థికశాఖ పేర్కొంది.

ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథం

5.25–5.5 శాతంగా అమలు



వాషింగ్టన్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ తాజాగా యథాతథ పాలసీ రేట్ల అమలుకే కట్టుబడింది. చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన రెండు రోజులపాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) యథాతథ వడ్డీ రేట్ల కొనసాగింపునకు ఓటు వేసింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 5.25–5.5 శాతంగానే అమలుకానున్నాయి. ద్రవ్యోల్బణ పరిస్థితులను కట్టడి చేసేటంతవరకూ వడ్డీ రేట్ల తగ్గింపునకు త్వరపడబోమంటూ గత సమావేశంలోనే పావెల్ స్పష్టం చేశారు. ఫెడ్ టార్గెట్ 2 శాతంకాగా.. ఫిబ్రవరిలో సీపీఐ 3.2 శాతంగా నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-3-2024	
విశాఖ	435-00
చిత్తూరు	478-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	72.00
20-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

ప్రతి మూడు నెలలకు ఓ కొత్త కారు

- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా లక్ష్యం
- సామర్థ్యాల పెంపుపై రూ. 5 వేల కోట్ల పెట్టుబడి

ముంబై: చైనాకు చెందిన ఎస్ఏఐసీతో దేశీ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ 'జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా' భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. సెప్టెంబర్ నుంచి మొదలుపెట్టి ప్రతి 3–4 నెలలకు ఓ కొత్త కారును ఆవిష్కరించాలని భావిస్తోంది. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఎస్ఏఐసీతో భాగస్వామ్యం ఖరారు చేసుకోవడాన్ని ప్రకటించిన సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ ఈ విషయాలు తెలిపారు. మరోవైపు, హలోల్‌లో (గుజరాత్) ఇప్పుడు తమకున్న ప్లాంటుకు దగ్గర్లోనే మరో ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు ఎంజీ మోటార్ ఇండియా గౌరవ చైర్మన్ రాజీవ్ చాబా తెలిపారు. దీనితో తమ ఉత్పత్తి సామర్థ్యం ఏటా 1 లక్ష యూనిట్ల నుంచి 3 లక్షలకు పెరుగుతుందన్నారు. సామర్థ్యాల పెంపు, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణపై భాగస్వాములు భారీగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ఎంజీ సైబర్‌స్టర్ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారు ఆవిష్కరణ

మారుతీ తరహా విప్లవం..

కొత్త ఇంధనాలతో నడిచే వాహనాల (ఎన్ఈవీ) విభాగంలో ఈ జేవీ 'మారుతీ తరహా విప్లవాన్ని' తేగలదని సజ్జన్ జిందాల్ పేర్కొన్నారు. 'నలభై ఏళ్ల క్రితం మారుతీ మార్కెట్లోకి వచ్చిన తర్వాత ఆటో పరిశ్రమను మార్చేసింది. సమర్థమంతమైన, తేలికైన, అధునాతనమైన కార్లను ప్రవేశపెట్టి ఇప్పుడు మార్కెట్ లీడరుగా ఎదిగింది. అంబాసిడర్లు, ఫియట్లు కనుమరుగయ్యాయి. కొత్త ఇంధనాలతో నడిచే వాహనాల విభాగంలో ఎంజీ కూడా ఆ ఫీట్‌ను పునరావృతం చేయగలదని విశ్వసిస్తున్నాం' అని ఆయన చెప్పారు. 2030 నాటికి ఏటా 10 లక్షల యూనిట్ల విక్రయాలతో ఎన్ఈవీ విభాగంలో తమ సంస్థ మార్కెట్ లీడరుగా ఎదగాలని నిర్దేశించుకున్నట్లు జిందాల్ వివరించారు. ఎంజీ మోటర్ మాతృ సంస్థ అయిన ఎస్ఏఐసీ మోటార్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ గతేడాది నవంబర్‌లో జేవీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కొత్త స్వరూపం ప్రకారం జేవీలో జేఎస్‌డబ్ల్యూకి 35 శాతం, భారతీయ ఫైనాన్షియల్ సంస్థలకు 8 శాతం, ఎంజీ మోటార్ డీలర్లకు 3 శాతం, ఉద్యోగులకు 5 శాతం, మిగతా 49 శాతం వాటాలు ఎస్ఏఐసీకి ఉంటాయి. కాగా, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ – ఎస్ఏఐసీ మోటార్ జాయింట్ వెంచర్ క్రింద అభివృద్ధి చేసిన ఎంజీ సైబర్‌స్టర్ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారు ఆవిష్కరణ జరిగింది. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ మేనేజింగ్ డైరెక్టర్ పార్థ్ జిందాల్, ఎంజీ మోటార్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ రాజీవ్ చాబాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్కెట్లోకి లాయిడ్ డిజైనర్ ఏసీలు



హైదరాబాద్: మార్కెట్లో అత్యాధునిక 'లాయిడ్ డిజైనర్ ఏసీలు ఆవిష్కృతమయ్యాయి. తమ ఉత్పత్తులు మరింత నాణ్యతగా అందించడానికి ఏపీలోని శ్రీసిటీలో ఏర్పాటు చేసిన నూతన మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఎంతో ఉపయోగపడుతోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యోగేష్‌కుమార్ గుప్తా చెప్పారు. ఈఏడాదిలో మార్కెట్లోకి రానున్న అత్యాధునిక ఫీచర్లు ఉన్న ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, టీవీల లాంచింగ్ కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌లు అలోక్ టికూ, రాజేష్ రతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామ్‌కీ ఇన్‌ఫ్రాకు రూ.216 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగంలోని హైదరాబాద్ కంపెనీ రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తాజాగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నుంచి 2 కాంట్రాక్టులను దక్కించుకుంది. వీటి విలువ రూ.216 కోట్లు. ఇందులో భాగంగా చెన్నైలోని కొడుంగయూర్ డంపింగ్ గ్రౌండ్ పునరుద్ధరణ పనులను బయో మైనింగ్ ద్వారా రామ్‌కీ చేపట్టనుంది. 252 ఎకరాల విస్తీర్ణంలోని ఈ డంపింగ్ గ్రౌండ్‌లో 66 లక్షల టన్నుల వ్యర్థాలు 50 ఏళ్లుగా పేరుకుపోయాయి.

1 శాతం కుబేరుల దగ్గరే 40 శాతం సంపద

భారత్‌లో రెండు దశాబ్దాలుగా పెరిగిన అసమానత

న్యూఢిల్లీ: దాదాపు రెండు దశాబ్దాలుగా (2000 తొలి నాళ్ల నుంచి) భారత్‌లో ఆర్థిక అసమానతలు గణనీయంగా పెరిగాయి. 2022–23 గణాంకాల ప్రకారం మొత్తం ఆదాయాల్లో 22.6 శాతం వాటా, అలాగే సంపదలో 40.1 శాతం వాటా కేవలం ఒక్క శాతం ప్రజలదే ఉంటోంది. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికా వంటి దేశాలతో పోల్చినా ఇది చాలా ఎక్కువ. '1922–2023 మధ్య కాలంలో భారత్‌లో ఆదాయ, సంపద అసమానతలు: పెరిగిన బిలియనీర్ల రాజ్యం' పేరిట రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ముఖ్యంగా 2014–15 నుంచి 2022–23 మధ్య కాలంలో కొందరి వద్దే అత్యధికంగా సంపద కేంద్రీకృతమవ్వడమనేది మరింతగా పెరిగింది. థామస్ పికెటీ (ప్యారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్), లూకాస్ చాన్సెల్ (హార్వర్డ్ కెనెడీ స్కూల్, వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్), నితిన్ కుమార్ భారతి (న్యూయార్క్ యూనివర్సిటీ, వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్) ఈ నివేదికను రూపొందించారు. నికర సంపద దృష్టికోణం నుంచి చూస్తే భారత ఆదాయపు పన్ను వ్యవస్థ తిరోగామి విధానంగా అనిపించవచ్చని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదాయం, సంపదను పరిగణనలోకి తీసుకునేలా పన్ను విధానాన్ని పునర్‌వ్యవస్థీకరించడం, ఆరోగ్యం.. విద్య..పౌష్టికాహారంపై ప్రభుత్వం మరింతగా పెట్టుబడులు పెట్టడం ద్వారా కేవలం సంపన్న వర్గాలే కాకుండా సగటు భారతీయుడు కూడా గ్లోబలైజేషన్ ప్రయోజనాలను పొందేలా చూడాల్సిన అవసరం ఉందని తెలిపింది. అలాగే అసమానతలపై పోరాడేందుకు 2022–23లో అత్యంత సంపన్నులుగా ఉన్న 167 కుటుంబాలపై 2 శాతం 'సూపర్ ట్యాక్స్'ని విధిస్తే దేశ ఆదాయంలో 0.5 శాతం మేర సమకూరగలదని, సామాన్య ప్రజానీకానికి ఉపయోగకరంగా ఉండే పెట్టుబడులు పెట్టేందుకు ఆర్థికంగా వెసులుబాటు లభించగలదని నివేదిక వివరించింది.



భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్(ఆదర్శ పాఠశాలలు)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం బోధన ఉంటుంది.

» **అర్హత:** సంబంధిత జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. **వయసు:** ఓసీ/బీసీ విద్యార్థులు 01.09.2012 నుంచి 31.08.2014మధ్య జన్మించి ఉండాలి.ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 01.09.2010 నుంచి 31.08.2014మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. ఓసీ/బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు పొందితే ప్రవేశాలు పొందుతారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు/ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 31.03.2024.
» **ప్రవేశ పరీక్ష:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** www.cse.ap.gov.in or www.apms.ap.gov.in.

టీజీఆర్‌డీసీ సెట్-2024

తెలంగాణ మహాత్మా జ్యోతిబాపులే బీసీ సంక్షేమ (ఎంజేపీటీబీసీడబ్ల్యూ) కళాశాలలు,ఎస్సీ((టీఎస్‌డబ్ల్యూ), ఎస్టీ(టీటీడబ్ల్యూ) సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష-ఆర్‌డీసీ సెట్-2024 నిర్వహిస్తారు.అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **కోర్సులు:** బీఎస్సీ, బీకాం, బీఏ, బీహెచ్ఎంసీటీ, బీబీఏ, బీఎఫ్‌టీ.
» **మొత్తం కళాశాలలు:** 29
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలకు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:**12.04.2024
» **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:**21.04.2024
» **పరీక్ష తేది:** 28.04.2024.
» **వెబ్‌సైట్:** https://tsrdccet.cgg.gov.in

ఇంజనీరింగ్ @ ఈఏపీ సెట్

» బీటెక్, అగ్రి, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి ఈఏపీ సెట్
» కాన్సెప్ట్‌లు, అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో విజయం

బీటెక్.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థుల్లో అధిక శాతం మంది లక్ష్యం! ఇందుకోసం జాతీయ స్థాయి జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లతోపాటు రాష్ట్ర స్థాయిలో ఈఏపీ సెట్‌లకు సన్నద్ధమవుతున్నారు. అదే విధంగా బైపీసీ విద్యార్థులు సైతం ఫార్మసీ, వ్యవసాయ అనుబంధ కోర్సుల్లో ప్రవేశం కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌పై దృష్టిపెడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈఏపీ సెట్‌లకు నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. ఏపీ/టీఎస్ ఈఏపీసెట్-2024ల వివరాలు, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర సమాచారం..

స్వరాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మా, అగ్రి కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఇక తమ కసరత్తును ముమ్మరం చేయాలి. ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులు అందుబాటులో ఉన్న ఈ రెండు నెలల సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే బెస్ట్ ర్యాంక్ సొంతం చేసుకునే వీలుంది.

కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ

- రాష్ట్ర స్థాయిలో ఇంజనీరింగ్; అగ్రికల్చర్; ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈఏపీసెట్ 2024కు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో నోటిఫికేషన్లు వెలువడ్డాయి.
- తెలంగాణలో గత ఏడాది వరకు టీఎస్ ఎంసెట్ పేరుతో పరీక్ష నిర్వహించగా.. ఈ ఏడాది నుంచి టీఎస్ ఈఏపీసెట్‌గా పేరు మార్చారు. అదే విధంగా రెండు రాష్ట్రాల్లోనూ దరఖాస్తు ప్రక్రియ సైతం ప్రారంభమైంది.

కోర్సులు ఇవే

- ఈఏపీ సెట్‌లో స్కోర్ ద్వారా ఇంజనీరింగ్; అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో.. బీటెక్, బయో టెక్నాలజీ, బీటెక్(డైరీ టెక్నాలజీ), బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సులు ఉన్నాయి.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో.. బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ, బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్, బ్యాచిలర్ ఫిషరీస్ సైన్సు, బీ ఫార్మసీ, ఫార్మాడీల్లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు.

అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీఎస్సీ(ఫారెస్ట్రీ) కోర్సుకు కూడా టీఎస్ ఈఏపీ సెట్ ర్యాంకునే పరిగణనలోకి తీసుకుంటారు.

ఏపీ/టీఎస్ ఈఏపీసెట్ 2024



అర్హత

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు.. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులు కూడా అర్హులే.
- అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌కు ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు ఉత్తీర్ణత శాతంలో అయిదు శాతం మినహాయింపు ఉంటుంది.
- ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మ్యాథమెటిక్స్ నుంచి 80ప్రశ్నలు;ఫిజిక్స్ నుంచి 40; కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది.

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్

అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో.. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. బయాలజీలో బోటనీ, జువాలజీ నుంచి 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

టీఎస్ ఈఏపీసెట్-2024 ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 6
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://eapcet.tsche.ac.in

ఏపీ ఈఏపీసెట్-2024 ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 15
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in/EAPCET

బెస్ట్ ర్యాంకు సాధించేలా

మ్యాథమెటిక్స్

ఈఏపీసెట్‌లో 50 శాతం వెయిటేజీ ఉన్న సబ్జెక్ట్.. మ్యాథమెటిక్స్. కాబట్టి విద్యార్థులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ సిలబస్‌ను ఆల్జీబ్రా, కాల్కులస్, జామెట్రీ, వెక్టార్ ఆల్జీబ్రా,ట్రిగనోమెట్రీగా విభజించొచ్చు. లిమిట్స్ అండ్ కమ్యూనిటీ, డిఫరెన్షియేషన్, అప్లికేషన్స్ ఆఫ్ డెరివేటివ్స్, ఇంటిగ్రేషన్స్, డిఫైనెట్ ఇంటిగ్రల్, డిఫరెన్షియెల్ ఈక్వేషన్స్‌పై దృష్టి పెట్టాలి. జామెట్రీకి వెయిటేజీ కొంత ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో 2డీ, 3డీ జామెట్రీ, లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, స్ట్రెయిట్ లైన్స్, సర్కిల్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, ఎల్లిప్స్, డైరక్షన్ కొసైన్స్, డైరక్షన్ రేషియోస్, ప్లేన్ తదితరాలు కీలక అంశాలుగా ఉంటాయి.

- అదే విధంగా ఆల్జీబ్రా విభాగంలో ఫంక్షన్స్ మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిసెస్, కాంప్లెక్స్ నంబర్స్, డిమోయర్స్ థీరమ్, క్వాడ్రాటిక్ ఎక్స్‌ప్రెషన్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్ తదితరాలపై పట్టు సాధించాలి. ట్రిగ్నోమెట్రీలో.. ట్రిగ్నోమెట్రీ రేషియోస్ అప్ టు ట్రాన్స్‌ఫర్మేషన్స్, ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, ఇన్వెర్స్ ట్రిగ్నోమెట్రిక్ ఫంక్షన్స్, హైపర్‌బోలిక్ ఫంక్షన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్ టాపిక్స్‌ను సమగ్రంగా అధ్యయనం చేయాలి. వెక్టర్ ఆల్జీబ్రా నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వస్తున్నాయి. అడిషన్ ఆఫ్ వెక్టర్స్, ప్రొడక్ట్ ఆఫ్ వెక్టర్స్, మెజర్స్ ఆఫ్ డిస్పెర్షన్ అండ్ ప్రాబబిలిటీలో మెజర్స్ ఆఫ్ డిప్రెషన్, ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్‌పై పట్టుసాధించాలి.

ఫిజిక్స్

హీట్ అండ్ థర్మోడైనమిక్స్‌కు వెయిటేజీ ఇవ్వాలి. ఈ చాప్టర్ నుంచి దాదాపు పది ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. దీని తర్వాత వర్క్ ఎనర్జీ పవర్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్ అండ్ రొటేషనల్ మోషన్, లాస్ ఆఫ్ మోషన్, మోషన్ ఇన్ ఎ ప్లేన్, మూవింగ్ చార్జెస్ అండ్ మ్యాగ్నటిజం చాప్టర్ల నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆసిలేషన్స్, వేవ్స్, ఎలక్ట్రోస్టాటిక్ పొటెన్షియెల్ అండ్ కెపాసిటెన్స్‌పై చాప్టర్ల నుంచి నాలుగు ప్రశ్నల చొప్పున అడిగే అవకాశం ఉంది. వీటి తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఇండక్షన్, రేఆప్టిక్స్, ఆల్టర్నేటింగ్ కరెంట్, వేవ్ ఆప్టిక్స్, మోషన్ ఇన్ ఎ స్ట్రెయిట్ లైన్, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్, ఎలక్ట్రిక్ చార్జెస్ అండ్ ఫీల్డ్స్, డ్యూయల్ నేచుర్ ఆఫ్ రేడియేషన్ అండ్ మేటర్, న్యూక్లియై, సెమికండక్టర్ ఎలక్ట్రానిక్స్‌పై దృష్టిపెట్టాలి. పరీక్షలో అత్యధిక వెయిటేజీ ఉంటున్న మెకానిక్స్‌పై ప్రిపరేషన్ సమయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి. తర్వాత ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్ పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీ

కెమిస్ట్రీని ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలుగా విభజించుకొని చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇనార్గానిక్ తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలు నిలుస్తాయి. ఫిజికల్ కెమిస్ట్రీలో సొల్యూషన్స్ చాప్టర్ నుంచి ప్రధానంగా ప్రాబ్లమ్ బేస్ట్ ప్రశ్నలు అడుగుతున్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీని జనరల్, హైడ్రోకార్బన్లు, హాలో కాంపౌండ్లుగా విభజించుకొని చదవాలి.

బోటనీ


డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్(మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ (బ్యాక్టీరియా, వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో టెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జువాలజీ

జువాలజీ నుంచి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటోజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఈఏపీసెట్‌కు ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయా అంశాల అభ్యసనంతోపాటు వాటిపై ఉన్న అవగాహన తెలుసుకునేందుకు సమాధానాలు, సమస్యల




సాధాన చేయాలి. అదే విధంగా షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు దానికి సంబంధించిన సూత్రం, సిద్ధాంతంపై అవగాహనతో అడుగులు వేయాలి. ఒక కాన్సెప్ట్‌కు చెందిన ప్రశ్నను భిన్న కోణాల్లో సమస్యను సాధించేందుకు కృషి చేయాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌కు సమయం వెచ్చించేలా సమయ పాలన పాటించాలి. విద్యార్థులు ప్రతి చాప్టర్‌లోని సినాప్సిస్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

పునశ్చరణ

అభ్యర్థులు పరీక్ష తేదీకి కనీసం నెల రోజుల ముందు నుంచి పూర్తిగా పునశ్చరణకే ప్రాధాన్యం ఇచ్చేలా సమయాన్ని కేటాయించుకోవాలి. దీనికి అనుగుణంగా తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకునే చేసుకునే విధంగా వ్యవహరించాలి. రివిజన్ సమయంలో తమకు ఎదురైన సందేహాలను నివృత్తి చేసుకోవాలి. కొత్త అంశాలు, అకడమిక్స్‌లో విస్మరించిన అంశాలుంటే వాటిపై కొత్తగా దృష్టి పెట్టడం సరికాదని గుర్తించాలి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.


SAMSUNG
Galaxy S24 Ultra
Circle it, find it
12:45
100%
Google
Add to your search
Sela Pass, Tawang
Tawang: Hidden gem of Arunachal Pradesh
Circle to Search
with Google
Own Galaxy AI at ₹ 5417/month*
Zero down payment | 24 months no cost EMI#
Up to ₹ 17000 upgrade bonus**
Samsung Upgrade
HDFC BANK
BAJAJ FINSERV
Samsung Finance+™
samsung.com
Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 1800 5 7267864 for information on e-waste/plastic pick up.
Image simulated for representational purposes, actual may vary. S Pen embedded in Galaxy S24 Ultra. Circle to Search results may vary depending on visual matches. Google is a trademark of Google LLC. Compatible devices and internet connection required. Works on compatible apps and surfaces. Results may vary depending on visual matches. Users may need to update Android to the latest version. Product functionality may be dependent on your app and device settings. Some functions may not be compatible with certain apps. Availability of the service varies by country and language. Accuracy of results is not guaranteed. *T&C apply. EMI computed on zero down payment, 24 months no cost EMI on the price of ₹ 129999 for 1 Unit of Galaxy S24 Ultra 12GB | 256GB. Final price at sole discretion of dealer. #Eligibility for EMI at the sole discretion of the financiers including those listed on Samsung Finance+ (Financier T&C applies). Samsung disclaims any liabilities with the same. **Upgrade bonus offer as per Samsung Upgrade program, provided by brand/dealer at their sole discretion upon exchange of select devices. Upgrade bonus varies model wise and EMI offer taken by the customer. Up to ₹ 17000 upgrade bonus is applicable only upon exchange of select Galaxy S Series devices and where customer does not avail the 24 months no cost EMI offer. In case of exchange of any other devices and/or other EMI offers taken by customer, the upgrade bonus may vary. Reach out to dealer for more information. Offers may be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company. Samsung promotes responsible use of Artificial Intelligence (AI) features.
Scan and experience Galaxy AI
Or WhatsApp "Hi" to 9870 494949 to buy at Samsung Exclusive Store
Cheil-19654/24